
50.3.2

03-1980 మార్చి '80





సంస్థాపకులు
కీ॥ శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి
రాఘవయ్య

మార్చి 1980

సంపుటి 18 సంచిక 2

విషయసూచిక

ఈ నెల నవలానుబంధం

మంజులనాదం

రచన : ముద్దంశెట్టి హనుమంతరావు

ముఖచిత్రం: జయసుధ

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, మద్రాసు-600 024. ఫోన్ : 423123
సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) 43 రూపాయలు

జ్యోతి

కీ॥ శే॥ వి. వి. రాఘవయ్యగారికి

స్మృత్యంజలి



1928 —1971

మీ కార్యదీక్షా, క్రమశిక్షణా, సహృదయతా మాకు ఆశీస్సులై నిలుస్తుండగా మీరు స్థాపించిన యీ సాహిత్య జ్యోతిని వెలిగిస్తూ ముందుకు సాగుతున్నాము. మీరు మాకు దూరమైన క్షణాన్ని కసితీరా తిట్టుకొంటూ, మీ జ్ఞాపకాల్ని మననం చేసుకొంటూ మీకు మా స్మృత్యంజలి ఘటిస్తున్నాము.

—జ్యోతి కుటుంబం

తొలిమాట

దేశమంతటా మళ్ళీ ఇందిరా ప్రభంజనం వీచింది. శ్రీమతి ఇందిరాగాంధీ అత్యధిక మెజారిటీతో తిరిగి పార్లమెంటులో ప్రవేశించారు. ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అస్థిరత్వంతో, అశాంతితో కొట్టుమిట్టాడుతూ బతికిన దేశం తృప్తిగా, నిశ్చింతగా ఊపిరి పీల్చుకుంది. ఈ దిగ్విజయ సందర్భంగా భారత జన హృదయేందిరని జ్యోతి మనసారా అభినందిస్తోంది.

* * * *

మీరు ఆసక్తితో యెదురు చూస్తున్న జ్యోతి నవలలపోటీ ఫలితాలను ఈ సంచికలో ప్రకటిస్తున్నాము. ఇతివృత్త పరంగానూ, శైలిపరంగానూ తెలుగు నవలా రచనలో వస్తోన్న గుణాత్మకమైన పరిణామాన్ని బహుమతులుపొందిన మూడు నవలలూ ప్రతిబింబిస్తున్నాయని భావిస్తున్నాము. ఈసారికూడా పోటీలో పాల్గొన్న కొత్త రచయితల సంఖ్య యెక్కువగానే వుంది. అయితే, వారిలో రచనోత్సాహం వున్నంతగా నవలా ప్రక్రియని పూర్తిగా అధ్యయనంచేసి రచనా రహస్యాలను తెలుసుకోవాలనే అభిలాషవున్నట్టు కనిపించడంలేదు. ఈ అంశాన్ని కొత్తరచయితలు గమనించగలరని ఆశిస్తున్నాము. పోటీలో పాల్గొన్న రచయితలకు, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన పెద్దలకు మా కృతజ్ఞతలు తెలియజేసుకొంటూ విజేతల్ని అభినందిస్తున్నాము. మొదటి బహుమతి పొందిన నవలని వచ్చేనెల నవలానుబంధంలో ప్రచురిస్తున్నాము.

* * * *

ఈ సంచికతో, 'జ్యోతి కథలపోటీ'లో ప్రత్యేక బహుమతి పొందిన కథల ప్రచురణ ముగుస్తోంది. గమనించవలసిందిగా పాఠకుల్ని కోరుతున్నాము.



1



2

మహాకవి శ్రీశ్రీ డెబ్బయ్యో జన్మదినోత్సవం వచ్చే మార్చి 2 న కాకినాడలో ఘనంగా జరగనున్న సందర్భంగా జ్యోతి సేకరిస్తున్న శ్రీశ్రీ నిధికి విరాళాలు పంపిన శ్రీశ్రీ అభిమానులకు జ్యోతి అభినందనలు. ఫిబ్రవరి 26 వరకూ జ్యోతి యిలా విరాళాలు సేకరిస్తుంది. మార్చి 2 న జరిగే సభలో శ్రీశ్రీ అభిమాన పాఠకుల తరపున నిధిని శ్రీశ్రీకి బహూకరిస్తుంది. రండి మహా కవుల్ని గౌరవించి కాపాడుకొనే పొరుగు భాషలవారి దారిలో నడుద్దాం—

డిసెంబర్ 79లోనూ, జనవరి 26, 1980 వరకు అందిన విరాళాల వివరాలు—


	రూ.పై.
గత సంచిక వరకు	424.00
శ్రీమతి జి. సుశీల రమణ, ఆత్మకూరు	116.00
శ్రీమతి కె. సత్యవతి, మద్రాసు	58.00
ఏ. ఎస్. చారి, హైద్రాబాద్	10.00

జ్యోతి శ్రీశ్రీ నిధి

సి. రాజగోపాలాచార్యులు, హైద్రాబాద్	10.00
కె. కాత్యాయిని, వరంగల్	10.00
కె. శ్రీగౌరి, వరంగల్	10.00
ఏ. వి. సుబ్రమణ్యం, గార	10.00
డా॥ భీమ్‌సేన్, హైద్రాబాద్	10.00
బి. ఏ. రామ్, సరిపాక	10.00
వి. ఎస్. విష్ణుభొట్ల, కొత్తగూడెం	10.00
బి. శ్రీనివాసరావు, వేగాయమ్మపేట	10.00
ఎన్. ఆర్. రాజేశ్వరరావు, బాపట్ల	10.00
డి. ఎస్. నాగలింగేశ్వరరావు, కనగల	10.00
డి. రాజారామ్, నూజివీడు	10.00
కె. మత్స్యేంద్రరెడ్డి, హైద్రాబాద్	10.00
ఎమ్. సత్యనారాయణ, ఖమ్మం	11.00
టి. నరసింహారావు, హైద్రాబాదు	11.00
ఎస్. అమర్‌నాథ్, న్యూఢిల్లీ	10.00
కె. శేషగిరిరావు, హైద్రాబాద్	10.00
కె. శర్మిల, పెందుర్తి	10.00
కె. సురేష్, కర్నూల్	10.00
సి. ఎస్. శర్మ, సునాబేడా	10.00
ఓ. సుబ్బారావు, హైద్రాబాద్	10.00
బి. సాయిరామ్, గుంటూరు	10.00
వై. వెంకటేశ్వరరావు, తుని	50.00
సి.హెచ్. బి. శంకరరావు, హైద్రాబాద్	21.00
ఏ. రాజ్యలక్ష్మి, విజయవాడ	10.00
టి. ఉదయభాస్కరగుప్త, అప్పారావుపేట	12.00
ఎమ్, రామకృష్ణారావు, ఆకివీడు	12.00
కె. కె. సుబ్బారావు, అహమ్మదాబాద్	10.00
శ్రీశ్రీ అభిమాని, బరంపురం	10.00
ఐ. కామేశ్వరరావు, హైద్రాబాద్	10.00
టి. ఆర్. రమారాణి, హిందూపూర్	10.00
ఎస్. వి. శ్యామల, కుమరపాలెం	10.00
వి. వి. ఎన్. శివప్రసాద్, మైలవరం	10.00
కావలిపాటి విజయలక్ష్మి, పాడేరు	116.00
వెలివోలు పున్నమ్మగారు, మద్రాసు	116.00
వై. సురేష్, బరహంపూర్	11.10
ఎ. ఎస్. చారి, హైదరాబాదు	10.00
టి. వి. ఎస్. శాస్త్రి, గురజాల	14.00
ఎమ్. కోటేశ్వరరావు, తెనాలి	11.00
ఎస్. వెంకటరావు, తెనాలి	11.00
ఇవటూరి కామేశ్వరరావు, హైదరాబాద్	14.00
జి. ఉష, కుప్పం	14.00
జి. ఎమ్. అనిత, కుప్పం	10.00
పి. ఎస్. శాస్త్రి, చందుగాం	20.00
మొహిసిన్ బిన్ అమర్, వనపర్తి	10.00
ఎ. ఎస్. చక్రవర్తి, హైదరాబాద్	10.00
సింహప్రసాద్, నల్గొండ	15.00
ఎస్. ఎమ్. వై. శాస్త్రి, బొంబాయి	21.00
కె. రాఘవప్రసాద్, తిరుపతి	10.00
పి. రామలక్ష్మి, అరసవల్లి	15.00
ఎమ్. శ్రీరాములు, అరసవల్లి	10.00
వి. రంగాచార్యులు, అదిలాబాద్	10.00
కె. ఎమ్. ప్రసాద్, మద్రాసు	10.00
ఎమ్. ఎస్. ఆర్. మూర్తి, బలిమెల	15.00
టి. రామకృష్ణ, సిమెంటునగర్	54.00
ఎస్. ఐ. టి., టి. సి. ఎ. (తెలుగు విద్యార్థులు), తుముకూర్	45.00
హెచ్. ఎమ్. బాష, పత్తికొండ	14.00
కొల్లూరి, అమలాపురం	10.00

జ్యోతి శ్రీశ్రీ నిధికి మీ విరాళం పంపారా?

శ్రీశ్రీ ఫోటో కావలసిన వారు ఈ నాలుగు ఫోటోలలో మీకు నచ్చిన నంబరు జ్యోతికి తెలియజేయండి.




3

శ్రీశ్రీ అభిమానుల వినాదం

'నేను సైతం రెండు శ్రీలకు పెన్నొక్కటి సమర్పిస్తాను'

4





ఉత్తరాలు

"అవమానం అవమానం!!"

మహాకవికి చందాల సన్మానమా! అవమానం. శ్రీశ్రీలాంటి మార్గదర్శకులకు మనం చేయవల్సింది యిలాంటి పనిగాదు—పదిమంది దగ్గర పది, అయిదూ తీసుకుని పేరు ప్రకటించీ—ఛీ! నాకు తెలిసినంతవరకూ శ్రీశ్రీ నిరాడంబరుడు. మామూలు సాదా జీవితం గడుపుతాడు. అయినా ఆయనకు మీరు నిధి సేకరించ దల్చుకుంటే ఆంధ్రదేశంలో వున్న ప్రతి పత్రికా స్తోమతనుబట్టి 500—1000 ప్రతి పబ్లిషరూ అలా కొంత, ఇంక కొంత సినిమావారి దగ్గరగాని మీరు సేకరించవచ్చు. లేక సావనీర్ వేసి సేకరించవచ్చు—లక్షకు పైగా. ఈ పద్ధతి బాగోలేదు—

—వి. వెంకటరత్నం, సికిందరాబాదు.

* మహాకవి శ్రీశ్రీకి ఈ పాఠకునివంటి అభిమాను లుండడం సంతోషించ వలసిన విషయం. వచ్చేమార్చి 2న జరగనున్న శ్రీశ్రీ డెబ్బయ్యో జన్మదినోత్సవానికి కాకినాడ సన్నాహక సంఘంవారు వేరుగా నిధులు సేకరిస్తున్నారు. సినిమావారూ, యితరులూ యథాశక్తి తోడ్పడుతున్నారు. వెంకటరత్నంగారు పూనుకుని లక్షరూపాయల నిధి సేకరించ దలచుకుంటే తోడ్పడడానికి తెలుగువారికి కానీ, స్వీకరించడానికి శ్రీశ్రీగారికి కానీ అభ్యంతరం వుండదనే అనుకొంటున్నాము. —ఎడిటర్

శ్రీదేవి ముఖచిత్రంతో వెలువడిన ఫిబ్రవరి నెల "జ్యోతి" అత్యంత ఆకర్షణీయంగా ఆహ్లాదకరంగా వుంది. "ప్రేమసింహాసనం, మీరా" సీరియల్స్ ఎంతో ఆసక్తికరంగాసాగుతున్నాయి. "యుగాంతం" ప్రతి సంచికలోను వెరైటీగా వుండి ఆకట్టుకుంటోంది. "అల్లావుద్దీన్ అభినవదీపం" మిక్కిలి హాస్యభరితంగా సాగుతున్నది. ఫిబ్రవరినెల కథలలో "లేటొచ్చిన బస్సు" — "చెరచబడ్డ గీతం" బాగున్నాయి.

—మాదల శివరామప్రసాద్, పొన్నూరు.


జ్యోతి రెగ్యులర్ పాఠకులలో నేనూ ఒకడిని. ఈమధ్య మీ కథల సెలక్షన్ బ్రహ్మాండంగా వుంటోంది. సీరియల్స్ వెరైటీగావుండి వచ్చే సంచిక కోసం ఎంతో ఆతృతతో ఎదురు చూసేలా వున్నాయి. కళాశాల విద్యార్థుల కోసం మీరు ప్రత్యేకంగా కథలపోటీ నిర్వహిస్తున్నందుకు ఒక కళాశాల విద్యార్థిగా మిమ్మల్ని అభినందిస్తున్నాను.

—ఎన్. విజేంద్రనాథ్ ప్రసాద్, ఆదోని.

శ్రీశ్రీ ప్రహేళికలు!

శ్రీశ్రీ ప్రహేళికలు ఎంత బావుంటున్నాయో! ఫిబ్రవరినెల్లో నిలువు 21 'జ్యోతిబాసు గణితం' (సమాధానం: లీలావతి) ఒకచక్కటి ఆధారం. ఇదివరకు 'కొండ (తననా)' (సమాధానం: నగము) అనే ఆధారం ఎంత బావుందో యిదీ అంతే. అందుకే నే నంటాను 'మరో ప్రస్థానం'లో అక్కడక్కడా మహాకవిశ్రీశ్రీ ప్రహే





అంతర్జాతీయ బాలల సంవత్సరాంతంలో 'కళాసాగర్' వారు తమిళనాడు గవర్నర్ శ్రీప్రభుదాస్ పట్వారీ సమక్షంలో యేర్పాటు చేసిన 'బాలోత్సవ్' కార్యక్రమంలో 'కరాటే' విన్యాసంచేసి 'కళాసాగర్ మొమెంటో' అందుకుంటున్న విజయవాడ విద్యార్థిని కుమారి రమ.

కల్నీ, సినిమా గీతాల్నీ సర్దితే బావుంటుందీ అని.

—తాతిరాజు వేణుగోపాల్, బరంపురం-1


తెలుగుతనం నిలుపుకో!

"తెలుగు సాహిత్యంలో ఇంగ్లీషు పదాల ఉచితా నుచితాల గురించి జరుగుతున్న చర్చను ఆసక్తితో గమనిస్తున్నాను. ఒక పాఠకు డన్నట్టు, కలకత్తాలో కలుసుకున్న యిద్దరు తెలుగువాళ్లు ఇంగ్లీషులో మాట్లాడుకోవడం, ప్రవాసాంధ్రులైన కొందరు ప్రముఖుల ఇండ్లలో పిల్లలకు తెలుగు రాకపోవడం, పెద్ద వారుకూడా నట్టి నట్టి మాట్లాడటం సత్యదూర మయిన విషయాలు కాదు. దేశంలో ఏ మూల నున్నా, లేక ఖండాంతరాలలో వున్నా తమ వ్యక్తిత్వాన్ని (భాషలోనే కాక, ఆహార్యంలో, అలవాట్లలో)కూడా నిలుపుకుంటున్న మన తోటి సోదరులు తమిళులు, మళయాళీలు, బెంగాలీలు మొదలయినవారిని చూసి నేర్చుకుని తెలుగు వాడు వెలుగు తారకలా తన తెలుగుతనంతో ప్రకాశించాలని నా ప్రగాఢవాంఛ. నా ఈ కోరిక తప్పంటే, లెంపలు వేసుకోటానికి నేను వెను కాడను."

—పులిచేరి రామమోహనరావు,
విజయవాడ.

'రూళ్ళ' కర్ర

తెలుగుతో ఇంగ్లీష్ వాడకూడదని యెవ రైనా రూలీకరించారేమో నాకు తెలియదు. కానీ ఉంటే గట్రా ఆలాంటి రూళ్ళ కర్రలు పట్టుకుని రచయితల బుర్రలమీద వాయించే తెలుగింగ్లీష్ 'మీసా'లు, దమ్ములూ ఎవరికీ





లేవని నే నంటాను. భాష అనేది మీడియమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్. ఏ ప్రాంతంవాడు ఆ ప్రాంతం భాషలోనే మాట్లాడాలని గిరి గీసుక్కూచునేవాడు గిరులూ, ఝరులూ దాటి ప్రపంచ పరిధిలోకి చొచ్చుకురాలేడని నా ఉద్దేశం. ఈ సమస్య సమస్యగా రేకెత్తించి దీనికి పరిష్కార మేమిటిస్మీ అని బుర్ర బద్దలు కొట్టుకోవడం కంటే, ఇది సమస్య కాదని కుండ బద్దలు కొట్టడం బెటరు. తెలుగోడి చేగోడీ అరవ్వాళ్ళు తినకూడదన్న మాట. యేమంటే ఇడ్లీ తినేవాడి సుతిమెత్తని నోటికి చేగోడి విరుగుతుందా? తెలుగులో ఇంగ్లీష్ చాలావరకు కలిసిపోయింది. "సిగ్నల్ పడిందా" అన్న వాణ్ణే చూశాను గానీ "ధూమ శకట ఆగమన నిర్గమన సంకేతము చూపబడినదా" అన్నవాణ్ణి నే నింతవరకు చూళ్ళేదంటే, నిజంగా చూళ్ళే దన్నమాటే. తెలుగులో సంస్కృతం, తమిళం, ఉర్దూ భాషలు చేరగా గింజుకోని వాళ్ళందరూ ఇంగ్లీష్ రాగానే జుట్టు పీక్కోడం ఎందుకు?


ఒక భాషలో చెలామణీ అవుతున్న పదాలన్నిటితోపాటు, తన రచనకు, పాత్రోచితంగా, సమయోచితంగా అవసరమైన పదాలు (ఆ భాషలో యెంత మాత్రం చెలామణిలో లేనివైనా సరే) ఏ భాషవైనా, వాటిని నదవించగలిగితే, అలా రాయగల చేవ సిరా వున్న యే కలానికైనా ఉందన్న మాటే. ('మరో చరిత్ర' సినిమాలో బాలూ, అతని తలిదండ్రులూ తమిళంలో మాట్లాడినంత మాత్రాన ఆ సినిమా, ఆ పాత్రల మాటలూ అర్ధం కాకుండా పోలేదు.) వేరైన తరువాత అది అరవ వేరైనా ఇంగ్లీష్ వేరైనా వేరు వేరే కానీ వేరు కాదు కదా.

—వినయ్ ఎస్, జి, హైదరాబాదు.

ఫిబ్రవరినెల "జ్యోతి"లో శ్రీ దయానంద్ గారు నా ఉత్తరాన్ని ఎలా అర్ధం చేసుకున్నారో తెలియటంలేదు. అనువదించడానికి వీలున్న పదాలను ఆంగ్లంలో వ్రాసినందుకు విమర్శించాను తప్ప, జ్యోతిలో "Jyothi" అని ఆంగ్లంలో వ్రాసినందుకు కాదని మనవి. శ్రీ రామశాస్త్రిగా రన్నట్లు పాత్ర చిత్రణకి, భావ స్పష్టతకి యెంతవరకు అవసరమో అంతవరకు ఏ భాషా పదాలు వాడినా తప్పులేదు. ఇంత మంచి చర్చకి కారకులయి తెలుగు వారిలో సంచలనం కలిగించిన జ్యోతి సంపాదకులు అభినందనీయులు.

—జి. విజయమోహన్‌రెడ్డి, కలకత్తా.

* ఎంతో ఆసక్తితో ఈ చర్చలో పాల్గొన్న పాఠకులను అభినందిస్తూ, తెలుగు కథల్లో ఆంగ్లపదాలు చర్చను యింతటితో ముగిస్తున్నాము. —ఎడిటర్.



ఇటీవల 'కళాభారతి' (మద్రాసు)వారు నిర్వహించిన పండిత సన్మానోత్సవం వేదికమీద శ్రీ యామిజాల పద్మనాభస్వామి, శ్రీ పర్వతనేని బ్రహ్మయ్య, శ్రీ తాతినేని ప్రకాశరావు, శ్రీ వేదం వేంకటరాయశాస్త్రి, శ్రీ రావూరి దొరస్వామిశర్మ.

నవలల పోటీ ఫలితాలు

ప్రథమ బహుమతి రు. 2000

మానవుడు

రచయిత: కంఠంనేని రాధాకృష్ణమూర్తి

ద్వితీయ బహుమతి రు. 1000

ఆకాశానికి అట్నూ ఇట్నూ

రచయిత: శివాజీ

తృతీయ బహుమతి రు. 750

కడలి అంచు కాపురం

రచయిత: పాలకోడేటి సత్యనారాయణరావు

సాధారణ ప్రచురణకి స్వీకరించబడిన నవలలు

పీడకల	:	యర్రంశెట్టిశాయి
కాశీయాత్ర	:	చెల్లూరి సీతారాజేశ్వరరావు
వెలుతురులో చీకటి	:	నెల్లూరి కేశవస్వామి
మైత్రేయి	:	శివల జగన్నాధరావు
సూర్యమిత్ర	:	జొన్నలగడ్డ లలితాదేవి
పోటీ లేనిపరుగు	:	వి. రాజారామమోహనరావు

కళాశాల విద్యార్థుల కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ

ఉపదేశం

ఎన్. వి. ఆర్. జ్యోతికుమార్ బి. కాం. (ప్రథమ)
డి. ఎన్. ఆర్. కాలేజి, భీమవరం.

"గుడ్ మార్నింగ్ డాక్టర్!"

"హలో, నువ్వటోయ్ విజయ్, రా! కూర్చో."

డాక్టర్‌కి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాడు విజయ్.

"ఏమిటి నీ కంప్లయింట్?" మెడకి వున్న స్టెతస్కోపును చెవుల్లో దూర్చుకుంటూ అడిగాడు డాక్టర్.

విజయ్ ఏమీ మాట్లాడలేదు. తల వంచుకుని కూర్చున్నారు.

"ఇంట్లో అంతా బావున్నారా?" అనుమానంగా అడిగాడు డాక్టర్.

"అంతా కులాసాగానే ఉన్నారు డాక్టర్."

"మరేమిటోయ్ నీ కంప్లయింట్?"

"నేను...."

"వెఫ్ దగిరా, డాక్టర్ దగిరా సిగ్గు పనికిరాదోయ్. సిగ్గుపడితే అది తమకే నష్టం" అన్నాడు డాక్టర్.

"నేను కాలుజారాను డాక్టర్."

"అయ్యో, యెక్కడ జారావేమిటి? ఏది చూడనీ నీ కాలు."

"ఎబ్బే, కాలు జారడమంటే....కాలుజారలేదండీ...."

"ఏమిటోయ్ నువ్వనేది? నాకేం అర్థం కావడంలేదు" కాస్త విసుగ్గా అన్నాడు డాక్టర్.

"లేదు డాక్టర్, నేను.......నా గర్ల్ ఫ్రెండుతో...."

డాక్టర్‌కి ఈసారి సంగతి అర్థమైంది. తేలిగ్గా నవ్వేస్తూ—

"ఓహ్, అదటోయ్ సంగతి. దీనికే ఇంత హడలిపోవాలా? అది నీ తప్పు కాదు, నీ గాళ్ ఫ్రెండు తప్పు అంతకన్నా కాదు. మీ వయసుది! కాదంటావా? అయితే తప్పు ఇంతదాకా నిన్నొక యింటివాడ్ని చేయని మీ నాన్నది. ఏమంటావ్?"

"అవున్సార్...."

"సరే, కిందటి యేడాది నేను స్టేట్స్‌కి వెళ్ళొచ్చాను—తెల్సుగదా నీకు?"

"తెల్సండి."

"అయితే చెప్తాను విను. బుద్ధిగా కూర్చో....జాగ్రత్తగా వినాలి....మనదేశంలో లైంగిక స్వేచ్ఛ లేదోయ్. కట్టుబాట్లు, సాంప్రదాయాల బంగారు సంకెళ్ళతో అనాదికాలం నించి యువతరాన్ని బంధించివేస్తున్నారు. అదేమంటే, ఇదంతా మన సంస్కృతనో, నాగరికతనో చక్కటి పేర్లు పెడతారు. అదే స్టేట్స్‌లో అయితే యిట్లాంటి నాన్సెన్స్ నిబంధనలు, కట్టుబాట్లనేవి మచ్చుకైనా కనబడవ్. లైంగిక స్వేచ్ఛ వుండబట్టే ఆ దేశమంతగా డెవలప్ అయింది. మరి మన దేశమో?...."

"అవున్సార్."

"....ఇట్లాంటి కట్టుబాట్లకి నేను చాలా వ్యతిరేకినోయ్. మనకు స్వాతంత్ర్యం వచ్చిందని చంకలు కొట్టుకుంటున్నాం. అయితే లైంగిక స్వేచ్ఛ ఎక్కడుందోయ్? ఏమంటావ్?

"కమ్ టుద పాయింట్. ఇంతకూ ఇప్పుడా అమ్మాయికి అబార్షన్ చేయాలంటావ్."

"అవున్సార్. యేపైనా మందులు రాసిస్తే...."

"ఎబ్బే, పేషంటుని టెస్టు చేయందే మందులు రాయడం కుదర్దోయ్."

"అది కాదండి. ఆడపిల్ల..మీ దగ్గిరికి ఎలా రాగలదండి...."

"నే నింతదాకా నెత్తీ నోరూ కొట్టుకుని నీకు చెప్పిందేమిటోయ్, సిగ్గుపడాల్సినంత నేరమేం చేయలేదోయ్ మీరు."

"అవుననుకోండి. కానీ...."

"ఆమాత్రం ఒప్పించలేవా ఆ అమ్మాయిని.

ఇట్లాంటి కేసుల్లో తప్పనిసరిగా పరీక్ష చేసి తీరాలి."

"అయితే రేపే తీసుకొస్తాను సార్."

"బైదిబై, యింతకీ యెవరన్నావ్ ఆ అమ్మాయ్?"

"నా క్లాస్‌మేట్ సార్! మిస్ సుజాత.... అంటే స్వయానా మీ...."

గుడ్లు తేలేసి కుర్చీలో ఓ వక్కకి ఒరిగిపోతున్న డాక్టర్ని చూసి, "నర్స్....నర్స్...." అని కేకలు వేశాడు విజయ్. □

కళాశాల విద్యార్థుల కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

అందం

పోతిన భవానీశంకర్ బి. ఎస్‌సి. (తృతీయ) విక్రమ్‌దేవ్ కాలేజి, జైపూర్

"హాయ్ స్మాల్‌పాక్స్ బ్యూటీ" అని నేను కామెంట్ చేయటంతో చప్పట్లు మారుమోగాయి. ఫ్రెండ్స్ అందరూ నన్ను ఆకాశానికి ఎత్తేశారు. పెద్ద ఘనకార్యం సాధించిన హీరోలా ఫీలయ్యాను. ఎదురుగా వస్తున్న నీరజ తల దించుకొని వెళ్ళిపోయింది.

నీరజ నిజానికి యెంతో అందంగా ఉంటుంది. ఆ ముఖంపైన మశూచికం మచ్చలు లేకపోయి వుంటే ఆమె అందం నిరుపమానం. స్నేహితుల ప్రోత్సాహంతో అలా కామెంట్ చేశానే కాని తర్వాత బాధపడ్డమాట నిజం. అలా యెందుకు కామెంట్ చేశానా అనిపించింది.

క్లాసు అయిపోయిన తర్వాత నీరజ వెనుకనుండి పిలుస్తుంటే గబ గబా వచ్చేద్దామనుకొన్నా సాధ్యంకాలేదు. ఇంతలో నీరజ వచ్చి "కంగ్రాచ్యులేషన్స్ గోపీ, గొప్ప పనే చేశావు. ఒక చిన్న సలహా, ఒకరి గురించి కామెంట్ చేసేముందు ముందుచూపు వుండడం మంచిది. మనం చేసే కామెంట్‌ని ఎదుటి వ్యక్తి సంతోషంగా తీసుకొంటేనే అందం. థాంక్యూ" అని చరచర తిరిగిచూడకుండా వెళ్ళిపోయింది.

* * *

పరీక్షలు అవుతూ ఉన్నాయి. ఈ ప్రాక్టికల్స్‌తో పరీక్షలయిపోయినట్టే. ఏమిటో కెమిస్ట్రీ అంటేనే గాభరా. ఇంకా పది నిముషాలు మాత్రమే ఉంది. ఈ లోపల సాల్టు ఎనాలిసిస్ చేసితీరాలి. ఎందుకో టెస్టుట్యూబ్ లోని యాసిడ్ యింకా బాయిల్ అవడంలేదు. మంట (ఫ్లేమ్) పెంచాను. అంతలో యేదో పేలిన శబ్దం, ముఖంపై ఏదో చిలకరింపు. కళ్ళు మంటలు. అంతే....మర్నాడు చూస్తే నా ముఖం అంతా కమిలిపోయినట్లు అక్కడక్కడా మడతలు. మడతలూ, మచ్చలూ! అబ్బా! చిన్నపిల్లలు చూస్తే దడుచుకొనేలా ఉన్నది నాముఖం. ఒకనాటికాలేజీ హీరోముఖం.

* * *

కాలేజికి బయల్దేరాను. గేటువద్ద నీరజ తన స్నేహితురాండ్రు గుమికూడి ఉన్నారు. సరాసరి వారి దగ్గరకు వచ్చాను. అంతే - పకపక నవ్వులు, చప్పట్లు. నీరజ కామెంట్. "హాయ్, ఫోల్డుఫేస్ హాండ్‌సమ్"...."త్రీచీర్స్ ఫర్ అవర్ ఫోల్డు ఫేస్ ప్రిన్స్...హిపిప్‌రే...."

హిపిప్....రే

హిపిప్....రే

నాలో సహనం నశించింది. ఒక్కసారిగా అరిచాను.

"స్టాపిట్....ఐసే....స్టాపిట్"

చప్పట్లు, పకపకలు అంతా బంద్....

కళ్ళు తెరిచాను—చుట్టూ చీకటి. నేను మంచంమీద....

"ఏమయింది?" అంటూ డాడీ, మమ్మీ వచ్చారు....అంటే ఇది కలా లేక నిజమా.... వెంటనే అద్దంలో చూసుకొన్నాను. ఏమీ కాలేదు. "థాంక్ గాడ్!"

మర్నాడు నీరజను క్షమించమన్నాను. అందుకు నీరజ ఇలా అన్నది. "పరవాలేదు గోపీ, యిప్పటికయినా తప్పు తెలుసుకున్నావు."

అప్పు డనుకొన్నాను నీరజకన్నా నీరజ మనసే అందమైందని. □

పచ్చదనం

ఆదూరి వెంకట సీతారామమూర్తి

ఆదినారాయణరావుకి అర్జంటుగా పదిరోజులు సెలవు కావల్సి వచ్చింది. ఆఫీసరు ఆనందరావు చూడబోతే అఖండుడూ—అసాధ్యుడూను. చచ్చి గీపెట్టినా అరపూట లీవు కూడ ఇచ్చేట్టు లేదు. కంపెనీ కుర్ర డాక్టరు కూడా కొరకరాని కొయ్యే—ఒకంతట నిక్కరాయడు.

'ఏం చేయాలి?' అని రెండ్రోజులు సీరియల్‌గా బుర్ర గోక్కుని, సీరియస్‌గా ఆలోచించగా... చించగా ఓ అద్భుతమైన ఐడియా తట్టింది ఆనందరావుకి.

'వాళ్ళ కిదే మందూ—తన కిదే మార్గమూను' అనుకున్నాడు.

సరాసరి కంపెనీ కుర్ర డాక్టరు దగ్గరకెళ్ళి తనకు పచ్చకామెర్లున్నట్టు అనుమానంగా ఉందన్నాడు. పొట్టలో ఎడంవైపు నొప్పిగా వుంటూందనీ....యూరిన్ కలరూ గట్రా అన్నీ చెప్పాడు. అంతా విని; కళ్ళను తనకున్న జ్ఞానంతో పరీక్ష చేసి,

'నోనో—యూ ఆర్ ఆల్‌రైట్' అన్నాడాయన.

కుర్ర డాక్టరుమీద విపరీతమైన కోపమొచ్చింది ఆదినారాయణరావుకి. కానీ అది కన్పించనీయకుండా తనకు లేని ఓ బామ్మగార్ని సృష్టించి, ఆవిడగారు కామెర్ల స్పెషలిస్టనీ ఆవిడే యీ అనుమానాన్ని లేవదీసిందనీ కథ అల్లేడు. ఇలా కామెర్లను కొనుకోలేకే మరో పాతికేళ్ళు బతకాల్సిన తన మామగారు అకస్మాత్తుగా హరీమన్నాడనీ చెప్పేడు.

అంతా విని కుర్ర డాక్టరు ఆలోచనలో పడ్డాడు.

"మన కంపెనీలో సరియైన ఇన్‌స్ట్రుమెంట్స్ లేవు. ఏం చేయమంటారో మీరే చెప్పండి" అని ఆదినారాయణరావునే అడిగి, అతని సలహాపైనే 'యూరిన్ టెస్టు' కోసం ప్రైవేట్ క్లినిక్‌కి రిఫర్ చేశాడు. రొట్టె విరిగింది. ఇక నేతిలో పడ్డమే తరువాయి అనుకున్న ఆ.నా.రావు ఒకానొక ప్రైవేట్ క్లినిక్‌లో తనకు తెల్సినాయనచేత తన జబ్బు 'పచ్చకామెర్లే' అని ఋజువు చేయించుకుని, పదిహేనురోజుల సిక్ లీవు సంపాదించి హాయిగా స్వంతూరు వెళ్ళి పనులు చూసుకొని పదహారో రోజు ఆఫీసులో జాయినయ్యేడు.

ఆ సాయంత్రం యింటి కొస్తూంటే కడుపులో ఎడంవైపు చిన్ననొప్పి వచ్చింది ఆ.నా.రావుకి. ఇంటి కెళ్ళి యూరిన్ చూశాడు. సందేహంలేదు. కాఫీ అందిస్తూ-"మీ కళ్ళేమిటలా పచ్చగా వున్నాయ్?" అంది అతని భార్య. ఆదినారాయణరావు కళ్ళు నిజంగానే పచ్చబారేయి! □

ప్రేమ సింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

19 సీరియల్

రెండు గంటల అనంతరం స్వప్న గదిలో చిత్తరవులా నిలబడివుంది! క్షణం క్రితం ఆ యింట్లో పెద్ద తుఫాను వీచినంత గడబిడ జరిగింది. సుధీర్ మేనమామ, వచ్చాడు. సుధీర్ తల్లి కోరికమీద తనే ఆయనకి ఫోన్‌చేసి పిలిపించాడు. ఏమిటో అర్జెంట్ పని అంటే, ఆదరాబాదరా వచ్చిన ఆయన అహల్యమ్మగారి నోటివెంట, సుధీర్ వివాహం జరిగిన వైనం విని విభ్రాంతపోయాడు. ఆగ్రహంతో రెచ్చిపోయిన ఆయన మేనల్లుడిని నోటికి వచ్చినట్టు తిట్టేసాడు. "అంత పెళ్ళిచేసుకోవాలని మోజుపడినవాడివి, యింత పిరికిపందలా ఎందుకు ప్రవర్తించావురా! ధైర్యం వుంటే, మాకు చెప్పి చేసుకోబోయావా! ఛీ! నువ్వు ఒక మనిషివేనా! కుక్కకయినా కాస్త అన్నం పెడితే కృతజ్ఞత అనేది వుంటుందేమో! నువ్వు ఆ మాత్రం కూడా చేయలేదు."

"మామయ్యా!" సుధీర్ అరిచాడు.

"ఎందుకురా అరుస్తావు! ఆ అమ్మాయిలో ఏం చూసి మమ్మల్ని అందరినీ కాలతన్నావురా! నేను చూస్తాగా! నువ్వు ఏం సుఖపడ్తావో! అది ఎవర్రా, ఒక హత్యచేసి బజారునపడిన —"

"మామయ్యా! ఆపు" సుధీర్ ఆయన దగ్గరకి వచ్చాడు.

అతను ఖచ్చితంగా అన్నాడు "మామయ్యా! స్వప్నని నేను పెళ్ళిచేసుకున్నాను. స్వప్న యిప్పుడు నా భార్య! స్వప్నని నువ్వు ఏదయినా తేలికగా మాట్లాడితే, అది ముందు నా మనసుకి తాకుతుందని గుర్తుంచుకో! మర్యాదగా మాట్లాడు. స్వప్నని

జరిగిన కథ

తనని బలవంతం చేసిన పొరుగింటి మోహన్‌ను ఆత్మరక్షణార్థం చేతికందిన వస్తువుతో కొట్టింది స్వప్న. మోహన్ మరణించాడు. స్వప్నపై హత్యానేరం మోపబడింది. ఆ షాక్‌తో స్వప్న తల్లి చనిపోయింది. స్వప్న మేనమామ లక్ష్మీరంజనం స్వప్నను కాపాడమని తన శిష్యుడు సుధీర్‌ను కోరాడు. సుధీర్ తన ప్రతిభతో స్వప్నకు శిక్షపడకుండా చేశాడు. స్వప్నకు సీరియస్‌గా వుందన్న కబురు తెలిసి పార్టీనుంచి ఆందోళనగా వెళ్ళాడు సుధీర్. స్వప్నను హాస్పిటల్‌లో చేర్పించాడు. సుధీర్ సహాయం వద్దనుకొనికూడా పొందవలసే వచ్చింది. స్వప్న మేనమామ వెంట వాళ్ళింటికి వెళ్ళింది. మేనమామ భార్య రుసరుసలాడింది స్వప్నని చూసి. మేనమామ భార్య తనకు బలవంతంగా పెళ్ళి ఏర్పాటు చేస్తే తప్పించుకు పారిపోయింది స్వప్న. ఒక డాక్టరు మిత్రుడు ఫోన్‌చేస్తే వెళ్ళిన సుధీర్ పెళ్ళిదుస్తుల్లో వున్న స్వప్నను అక్కడ చూసి ఆశ్చర్యపోయాడు. స్వప్నను నర్సు మరియమ్మ ఇంట్లో ఉండే ఏర్పాటు చేశాడు డాక్టరు. స్వప్న కారణంగా తనకిచ్చిన మాట పోగొట్టుకున్నందుకు సుధీర్‌పై కోపగించుకొంది విమల. స్వప్నని ఓదార్చి, పెళ్ళి చేసుకొంటానని చెప్పి, తన కౌగిలిలోకి తీసుకొని ముద్దాడినట్లు కలగన్నాడు సుధీర్. మెలకువ వచ్చినా స్వప్నని తాకిన అనుభూతిని మాత్రం మరువలేకపోయాడు. తల్లి బలవంతాన, విమలకు సారీ చెప్పేందుకు బయలుదేరాడు సుధీర్. ఆపదలో వున్న స్వప్నను తా నాదుకోవలసిన పరిస్థితులను మామయ్యకు వివరించి, తర్వాత విమలతో ముచ్చట్లాడి ఆమె కోపాన్ని పోగొట్ట గలిగాడు సుధీర్. సుధీర్ ప్రోత్సాహంతో బి. ఎ. పరీక్షకు కట్టింది స్వప్న. తనకు తెలియకుండానే సుధీర్‌ని అభిమానించ సాగింది. పరీక్ష లయ్యాయి. సుధీర్ మేనమామ కూతురు విమల స్వప్నని అవమానించింది. క్రైస్తవ సన్యాసినిగా మారిపోవాలన్న స్వప్న నిర్ణయాన్ని మార్చి ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. అహల్యమ్మ ఈ విషయంలో తన అయిష్టతని సుధీర్‌కి తెలియజేసింది.

పెళ్ళిచేసుకోవడం అనేది, నా వ్యక్తిగత సమస్య. నా వివాహం క్లుప్తంగా, నిరాడంబరంగా జరగాలని నేను అనుకున్నాను. అలాగే జరిపించుకున్నాను.

అహల్యమ్మగారు యీ మాటలు వినగానే ఆడ పులిలా చూసింది. ఆవిడ అన్నగారివైపు తిరుగుతూ, "అన్నయ్యా! వాడితో యిక మాటలు అనవసరం. వాడి పెళ్ళి! వాడికిష్టంవచ్చినట్టు జరిపించుకున్నాడు. వాడికి అమ్మ వుందనే సంగతి గుర్తు లేదయ్యె. వాడి ఆలోచనల్లోనే నాకు చోటులేనప్పుడు, యీ యింట్లో మాత్రం యిక నాకు చోటు ఎక్కడుంటుంది. పద అన్నయ్యా! యింటికి వెళ్దాం! నన్ను యిక్కడనుంచి తీసుకు వెళ్లు. నీకు పుణ్యం వుంటుంది. వెళ్దాం పద!"

"అమ్మా!" సుధీర్ ఆవిడకి దగ్గరగా రాబోయాడు. ఆవిడ ఎర్రబడిన కళ్ళతో కొట్టేంత తీవ్రంగా చూసింది.

"అమ్మ చచ్చిపోయిందిరా! అందుకే అడిగేవాళ్ళు లేనట్టుగా, యిలాటి పని చేశావు. నీ సంతోషం నువ్వు చూసుకున్నావు. అమ్మ సంగతి నీకెందుకు? అమ్మ ఎలా పోతే నీకెందుకు! చూడు నువ్వు సర్వ సుఖాలతో సలక్షణంగా, ఆనందంగా వుండు. దీనికోసమేరా నేను యిన్ని సంవత్సరాలు మొండిగా, భగవంతుడితో పోరాడి బ్రతికింది. దీనికోసమే. ఈ చావు దెబ్బకోసమే. నా కొడుకులాటివాడు, యీ ప్రపంచంలోనే వుండడని భావించాను. నిజమే! ఈ లోకంలో ఎక్కడా వుండడేమో! ఎంత అదృష్టవంతురాలినిరా నేను!"

"ఇప్పటికైనా దాని కడుపులో ఎంత చిచ్చుపెట్టావో అర్థంచేసుకున్నావురా సుధీర్! నా మాట విను. జరిగిన ఆ పెళ్ళి ఎవరికీ తెలియదు. ఎందుకలా తొందర పడ్డావో, ఆ అమ్మాయి నీకేం పెట్టిందో నాకు తెలియదు. ఇప్పటికైనా ఫర్వాలేదు. ఆ అమ్మాయిని హాస్టలుకైనా పంపించివేయ్!"

"అది అసంభవం మామయ్యా. స్వప్నని నేను పెళ్ళిచేసుకున్నాను. మనసా, వాచా జీవితాంతం ఆ అమ్మాయి నాకు భార్య."

"పదన్నయ్యా!" అహల్యమ్మగారు దారి తీసింది.

ఆయన వెళ్ళబోతూ ఆగారు. "ఒరేయ్! ఇన్నాళ్ళూ నా మంచితనమే చూసావురా. నాతో తగాదా పడడం పాముని రెచ్చగొట్టడమే నన్న సంగతి నీకు తెలియదు. నువ్వు ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నంత మాత్రాన అంతా నీ వొడిలో ఒరిగిపోయిందని అనుకోకు. నీ నుంచి ఆ అమ్మాయిని ఎలా వదిలించాలో, యీ యింటిలోనుంచి ఆ అమ్మాయిని ఎలా గెంటాలో నాకు తెలుసు. ఈ రోజు యిలా మీ అమ్మని బైటికి గెంటుతున్నావు కదూ! మీ అమ్మని చేతులు పట్టుకుని బ్రతిమలాడే రోజువస్తుందిరా! బాగా గుర్తుంచుకో!" అంటూ రంకెలు వేసాడు.

"అమ్మని నేనేమీ వెళ్ళిపొమ్మని అనటంలేదు మామయ్యా!"

"ఛట్; నోర్ముయ్! సిగ్గులేక ఇంకా మాట్లాడుతున్నావు. బజారు మనిషిని తెచ్చి యింట్లో పెడితే, వెళ్ళిపోమని అనటం లేదన్నమాట. నువ్వు చెబితే చెప్పావు, తగుదునమ్మా అంటూ రావటానికి దానికి ఎలా సిగ్గులేకపోయింది అంట!"

"మామయ్యా—"

"ఏరా! కొడ్తావా? కొట్టు. ఊ! ఆగావేం. కానీ! ఎంతవరకూ నీకు పిచ్చి యెక్కిందో అదీ తెలుసుకుంటాను! జీవితం వడ్డించిన విస్తరిలా వున్నప్పుడు అందరూ ఆప్తుల్లా వస్తార్రా! ప్రేమలు ఒలకపోస్తారు. దానికి నీమీద ప్రేమని మురిసిపోకు? దాన్ని పెళ్ళి చేసుకున్నావుగా! రేపటినుంచి నీ గడ్డి నువ్వు తినకపోతే చూడు!"

సుధీర్ కోపం ఆపుకోవటానికి చాలా శక్తి తెచ్చుకోవాల్సి వచ్చింది.



అతను ఎంత చెప్పినా, బ్రతిమలాడినా తల్లి వినలేదు.

"మీ అమ్మని వుండమని అనటానికి నీకు సిగ్గెలా లేదురా! అంత గౌరవంగా, అంత పవిత్రంగా బ్రతికినమనిషి, ఆ హంతకురాలితో కలిసి, ఒకే నడకప్పుక్రింద వుంటుందా; ఒకేచోట కలిసి తిరుగుతుందా! పద అహల్యా పోదాం," అన్నాడాయన.

మేనమామ తల్లిని తీసుకుని వెళ్ళిపోగానే, సుధీర్ అలాగే నిలబడిపోయాడు. అతను తల్లిని సమన్వయపరచగలనని అనుకున్నాడు. మేనమామని పిలవటం అతనికి యిష్టం లేకపోయినా, తల్లి బలవంతంమీద ఫోన్‌చేయక తప్పలేదు. స్వప్నని అతను పెళ్ళి చేసుకున్నాడు. ఇందులో రహస్యం ఏమీ లేదు. దాచాల్సిన అవసరం అంతకంటే లేదు. తల్లి, మేనమామని పిలవమని గొడవ చేసింది. ఆయన రావటంతో అతను తల్లికి నచ్చచెప్పే ధోరణిపోయి, ఘర్షణకి దిగాల్సి వచ్చింది.

తను చేసిన యీ పని తల్లి అభిమానాన్ని ఎంత గాయపరుస్తుందో, అతనూహించలేనిదేమీ కాదు.

దేనికైనా కాలమే మందు. కొద్దిరోజులు మేనమామ దగ్గర వుంటే, తల్లికి, ఆవేశం తగ్గి, మామూలుగా ఆలోచించి, తనని క్షమించే శక్తి తెచ్చుకుంటుందని అనిపించింది! అతనికి బాగా తెలుసు. అతను యెంతగానో ఆలోచించాడు. తల్లికి తెలియచేసే యీ పెళ్ళి చేసుకుందామని యెన్నిసార్లో అనుకున్నాడు. కానీ, తల్లిదగ్గర యీ ప్రసక్తి చూచాయిగా రాగానే, ఏం మాట్లాడుతున్నావురా, మతి ఏమైనా పోయిందా! స్వప్న యెక్కడ నువ్వు యెక్కడ? సుధీ! నీకు ఆ అమ్మాయిమీద జాలి వుంటే, ఇంకే రకంగానైనా సాయం చెయ్యి. అంతేగానీ-అంటూ ఆ ప్రసంగం అంతటితో త్రెంచి వేసింది.

ఆ తర్వాత ఆ ప్రసక్తి తేవటానికి అతనికి ధైర్యమే చాలలేదు.

గదిలో శిలలా నిలబడ్డ స్వప్నకి ముందు గదిలోకి వెళ్ళాలో, లేదో తెలియ లేదు!

కొద్దిసేపయింది! సుధీర్ లోపలికి వచ్చాడు. అతని ముఖం అంతక్రితం మేనమామతో ఘర్షణపడి ఆవేశంగా, మాట్లాడంతో కందివుంది. కళ్ళలో బిగబట్టుకుంటున్న బాధ స్పష్టంగా కన్పిస్తోంది.

స్వప్నని చూసి చిరునవ్వు నవ్వబోయాడు. కానీ రాలేదు. అతను వెళ్ళి మంచంమీద కూర్చున్నాడు.

"అబ్బా!" జుత్తులోకి వేళ్ళు పోనిచ్చుకున్నాడు.

స్వప్న ఒంటిమీద స్పృహ వచ్చినట్లుగా, నడక వచ్చిన శిల్పంలా, అతని దగ్గరగా వెళ్ళింది. అతని తలమీద చేయి ఆనించింది.

అతను కళ్ళు తెరిచి స్వప్న వైపు చూసాడు.

స్వప్న కళ్ళలో నీళ్ళు తొణికిసలాడుతున్నాయి.

"నేను-నేను-మీకు మొదటే చెప్పాను" అస్పష్టంగా అంది. క్షణంసేపు తదేకంగా స్వప్న కళ్ళలోకి చూసిన అతను, వెంటనే పసిపిల్లాడిలా, రెండు చేతులూ స్వప్న నడుంచుట్టూ పెనవేసి గుండెల్లో ముఖం దాచుకుంటూ అన్నాడు! "స్వప్నా! సారీ! వెరీ వెరీ సారీ!"

"ఎందుకు?"


"నీకు మంచి ఆతిథ్యం యివ్వలేకపోయింది."

స్వప్న కళ్ళలో నీళ్ళు వుబికినాయి. పెదిమలమీద చిరునవ్వు కదలింది. "నా ఆతిథ్యం గురించి ఆలోచిస్తున్నారా? మిమ్మల్ని చాలా బాధపెట్టాను కదూ!"

అతను లేదన్నట్టు తలతిప్పారు. స్వప్న గుండెల్లోనే చెప్పాడు. "స్వప్నా! అమ్మకి కోపం వచ్చింది! బాగా! నేను వూహించగలను అనుకున్నాను! కానీ ఇప్పుడు తెలుస్తోంది! నేను వూహించలేకపోయాను! అమ్మ కోపం పోగొట్టటంలో నువ్వు నాకు సాయం చెయ్యాలి! చేస్తావు కదూ!"

"తప్పకుండా! నా శాయశక్తులా! చూడండి. నన్ను పొందడంకోసం, మీరు దేన్నీ పోగొట్టుకోకూడదు. నేను అంత అపరూపమైన వ్యక్తిని కాదు. ఆ సంగతి నాకు బాగా తెలుసు!" అంది.





9 డిశెంబరు 1978:
విజయి, కొచ్చిన్ (కేరళ) పట్టణంలో మెకానిక్ తన రు॥లు 50,00 జీవిత బీమా పాలసీపై మొదటి మూడు నెలల ప్రీమియమును కట్టాడు.

13 జనవరి 1979:
విజయి మోటారు సైకిల్ ప్రమాదంలో భార్య లక్ష్మి మరియు ఒక చంటి పిల్లను వదలి మరణించాడు.

20 జనవరి 1979:
విజయి మరణముగూర్చి జీవిత బీమా కార్పొరేషనుకు తెలియజేసారు. లక్ష్మి ఎల్.ఐ.సి ఇచ్చిన క్లైము ఫారములను పూర్తిగనింపి అన్ని పత్రములు జతపరచి దాఖలు చేసినది.

16 ఫిబ్రవరి 1979:
ఎల్.ఐ.సి డివిజనల్ కార్యాలయము, త్రివేంద్రమువారు క్లైమును చెల్లించగా లక్ష్మికి చెక్కు అందినది. ఎల్.ఐ.సి 1978–79లో రు॥ 55.05 కోట్లు క్లైములు చెల్లించిన వాటిలో ఇదికూడా ఒక క్లైము.

(ఇది వాస్తవంగా జరిగిన సంఘటన. కాని పేర్లు మాత్రం గోప్యతకై మార్చబడినవి).

ఎల్.ఐ.సి నిరంతరము తమ కార్య పద్ధతులను తేలిక చేయుటలో నిమగ్నమయి ఉన్నది. ఉదాహరణకు రు॥ 5000లు మరియు అంతకులోపు బీమా మొత్తపు పాలసీలకు పయోనిర్ణయము, పాలసీలు కోల్పోయినచో హామీనుదారు ఏర్పాటు, నిజాయితీ అయిన క్లైముల విషయంలో క్లైము విచారణ మున్నగు షరతులను ఎల్.ఐ.సి సడలించుచున్నది. అట్టి అనేక ముఖ్య షరతులను నిరంతరము పరిశీలించుచు చిన్నకారు పాలసీదార్లకు ఇంకా సడలింపులు చేయుటలో ఎల్.ఐ.సి నిమగ్నమయి ఉన్నది.

చాలా కేసులలో క్లైము చెల్లింపుకు అత్యవసర విషయము లేమనగా:

- నిర్ణీత అధికారినుండి మరణించినట్లు సూచనా పత్రం.
- బీమా పట్టా.
- నామినీ లేక క్లైముదారుచే పూర్తి చేయబడిన క్లైము ఫారములు. బీమా పట్టాపై నామినేషను ఉన్నచో చాల సహాయకారి అగును.

మోసము లేక ముఖ్య విషయముల దాపరికము తప్పించి మరి యే ఇతర క్లైము త్రోసివుచ్చబడుట లేదు.
మా పూర్తి ప్రయత్నముల తరువాత కూడా కొన్ని క్లైములలో జాప్యము ఉన్నమాట నిజమే. తమ క్లైము మొత్తమును పొందుటలో జాప్యము కలిగిన ప్రతి క్లైముదారు (ఇవ్వవలసిన పత్రములన్ని దాఖలు చేసిన పిదప) దగ్గరలోని మా ఎల్.ఐ.సి. డివిజనల్ కార్యాలయమునందలి ముఖ్య అధికారిని కలిసిన ఆయన మీకు సహాయము చేయగలరు.

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

RADEUS/LIC/SP-34

"నీ కేం తెలియదు! నా మనసుని అడుగు చెబుతుంది. స్వప్నా! యికనుంచి మా అమ్మకి, నాకు జరగబోయే యుద్ధంలో నువ్వు నాకు బాగా అండగా వుండాలి! వుంటావు కదూ!"

స్వప్న సమాధానంగా నోటితో ఏం చెప్పలేదు. అతని తలని గుండెలకి గాఢంగా అదుముకుంది.

20

సుధీర్ కోర్టునుంచి హడావుడిగా వచ్చాడు. 'స్వప్నా! ఏం చేస్తున్నావు!'

"మీకు కాఫీ కలపబోతున్నాను."

"ఆ ప్రయత్నం ఏమీవద్దుగాని, త్వరగా రెడీ అవ్వు. ఒక మేరేజ్ రిసెప్షన్ వుంది. పొద్దుట కోర్టుకివెళ్ళే హడావుడిలో చెప్పటం మర్చిపోయాను. 5 నిముషాల్లో రెడీ అవాలి. తెలిసిందా?"

స్వప్న తెలిసింది అన్నట్టు తలవూపి వెళ్ళిపోయింది.

"ఏయ్" అతను పిల్చాడు.

స్వప్న ఆగింది. అతను చిటికవేస్తూ అన్నాడు. "స్మార్ట్‌గా తయారవాలి!"

స్వప్న అతనివైపు చూసి వెళ్ళిపోయింది.

సుధీర్ టై కట్టుకుంటున్నవాడల్లా, గదిలోకి వచ్చిన స్వప్నని చూసి తెల్లబోయాడు. "మైగాడ్! యింత త్వరగా, అంత బాగా యెలా తయారయావు. ఆడవాళ్ళ అలంకరణ మొదలుపెడితే చుక్కలు పొడుస్తాయి అన్నమాటని అపవాదు చేసేసావు కదా! యూ ఆర్ లుకింగ్ లవ్‌లీ" అతను మాట్లాడుతూ వేసుకుంటూంటే టై నాట్ సరిగ్గా పడలేదు. స్వప్న దగ్గరకి వచ్చి తను వేసింది.


"థ్యాంక్ యూ!"

స్వప్న బైలుదేరబోతుంటే, అతను 'ఏయ్ యిలారా' అని పిలిచాడు. స్వప్న దగ్గరకి వచ్చింది. అతను స్వప్న చుబుకం పట్టుకుని, ఎత్తి నుదుటమీద సుతారంగా చిన్నగా ముద్దుపెట్టుకున్నాడు. 'నిన్ను చూస్తుంటే ఏమనిపిస్తోందో తెలుసా?'

"ఏమనిపిస్తోంది!" కళ్ళతోనే అడిగింది.

"పార్టీ! గిర్టీ జాన్తానై! వెళ్లి వీధితలుపు గడియపెట్టిరావాలని అనిపిస్తోంది. 'ఊ! పద! ఆలస్యం చేసావంటే, అన్నంతపనీ చేస్తాను తెలుసా?' బెదిరిస్తూ అన్నాడు. అతని ధోరణే అంత! ఉదయం టిఫిన్ పెడితే, 'ముందు నిన్ను కొరుకుతానని' అంటాడు. కాఫీ యిస్తే 'నిన్ను తాగేస్తాను' అంటాడు.

ఇద్దరూ వచ్చి కారులో కూర్చున్నారు! సుధీర్ ఇంట్లో వుండే, ఆ సరసత్వం మాయమైంది. మృదుగంభీరత్వం అతని ముఖంలో గూడుకట్టుకుంది. "స్వప్నా! మనం పెళ్ళి అయింతర్వాత, వెళ్తున్న మొట్టమొదట పార్టీ! అక్కడ రకరకాల మనుష్యులుంటారు. ఒంటరిగా ముడుచుకుపోయినట్లుగా కూర్చోకు. నలుగురితో కలుపు



గోలుగా తిరుగు."

స్వప్న తల వూపింది.

జడ్జిగారి కొడుకు పెళ్ళి రిసెప్షన్! ఆడంబరంగానే వుంది. లైట్లతో ఆ చోటంతా మిలమిలలాడుతోంది. ఆడవాళ్ళు చాలామంది వచ్చారు. వారి మెళ్ళలో నగలు ధగధగలాడుతున్నాయి. పట్టుచీరెలు రిసరిసలు, విన్పిస్తున్నాయి! ఫారిన్ సెంట్ల పరిమళాలు గాలిలో తేలివస్తున్నాయి! వెళ్ళగానే సుధీర్‌ని చాలామంది చుట్టుముట్టారు!

స్వప్నని అతను ఒకరిద్దరు ఆడవాళ్ళకి పరిచయం చేశాడు. వారు ఎంతో మర్యాదగా స్వప్నని లోపలకి తీసుకువెళ్ళారు.

వాళ్ళలో ఒకావిడ స్వప్నని ఒక జడ్జీగారికి పరిచయం చేసింది. ఆయన స్వప్నని క్షణంసేపు తీక్షణంగా చూసాడు. ఆ తర్వాత ముఖం తిప్పేసుకున్నాడు. స్వప్నకి చిరుచెమటలు పట్టాయి. ఆయన ఎవరో కాదు. ఆ రోజు కోర్టులో తన కేసు సుధీర్ వాదిస్తుంటే, విన్న జడ్జీయే.

స్వప్నకి ఆ క్షణంలో ఆ లైట్లు, చీరెల రిసరిసలు, గాజుల గలగలలు అన్ని మాయమైనాయి! ఆ ఆవరణ అంతా, న్యాయస్థానం అయినట్టు మిగతావారంతా, ప్రేక్షకులుగా, ఆయన తీర్పు చెప్పే ముందు, తనని తీక్షణంగా, నిశితంగా పరిశీలిస్తున్నట్లుగా

అనిపించింది.

ఆయన ముఖం తిప్పుకుని వెళ్ళటం, స్వప్న మనసు చివుక్కుమంది. ఆడ వాళ్ళలో కూడా స్వప్న ఎవరో తెలిసినట్టుంది! స్వప్నకి దూరంగా తొలిగి, స్వప్నవైపు చూస్తూ గుసగుసలాడసాగారు.

ఆ తర్వాత పార్టీ పూర్తి అవటానికి గంటపైనే పట్టింది. ఆ గంట ముళ్ళమీద నిలబడినట్టుగా గడిపింది స్వప్న.

తిరిగి వచ్చేటప్పుడు, సుధీర్ చాలా సీరియస్‌గా వున్నాడు.

ఇంటికి రాగానే అడిగాడు. "నేను చెప్పిందేమిటి! నువ్వు చేసిందేమిటి!"

"ఏంచేసాను."

"ఏం చేశావా? పిరికిదానిలా భయపడుతూ, తప్పుచేసినదానిలా, సిగ్గుపడుతూ ఒకమూల నిలబడ్డావు. ఎవ్వరితోనూ కలవలేదు!"

స్వప్నకి చాలా కోపం వచ్చేసింది. ఇంతక్రితంనుంచి బిగబట్టుకుంటున్న బాధ లావాలా పొంగి పొర్లింది. "అవును. అవును. నేను పిరికిదాన్ని! వాళ్ళంతా నన్ను పురుగుని చూసినట్టు చూస్తే బాగానే వుంది."

"స్వప్నా!"

"నన్నసలు మీరెందుకు పెళ్ళిచేసుకున్నారు! మీరు చేసుకుంటానన్నా నేనెందుకు ఒప్పుకున్నాను! నేను—మీగురించే ఆలోచించానే గానీ, మీ చుట్టు వున్నవాళ్ళని గురించి ఆలోచించలేదు. వాళ్లు జన్మలో నన్ను క్షమించరు. నేను జైలుకెళ్లానని, నేను మీరు మర్చిపోయినా, వాళ్ళు మర్చిపోరు. మనల్ని మర్చిపోనీరు. భగవంతుడా. రేపు నాకు పిల్లలు పుట్టినా మీ అమ్మ హంతకురాలు అంటారు కాబోలు. అప్పుడు వాళ్ళు నన్నుచూసి సిగ్గుపడ్తారు కాబోలు. ఛి. ఛీ—"

"స్వప్నా!" సుధీర్ చప్పున దగ్గరకి వచ్చాడు.

"నేను మిమ్మల్ని చేసుకోవటం పొరపాటు! పొరపాటు! పొరపాటు!" ఆవేశంగా అంది.

సుధీర్ చప్పున స్వప్న నోరు మూసేసాడు. "దయయుంచి అలా అనకు! అలా అనకు! ప్లీజ్" అతని కంఠం వణికింది.

స్వప్నని గాఢంగా గుండెలకి అదుముకున్నాడు.

స్వప్న హఠాత్తుగా ఏడవసాగింది. (సశేషం)

జ్యోతి నవలల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన నవల


మానవుడు

వచ్చే సంచిక నవలానుబంధంలో చదవండి!

ప్రయాణం

నా జీవితాశయ శిఖరాగ్రం నుండి చూస్తున్నాను,
దూరం, దుర్గమం నా దారి,
అయినా నా పథాన్ని ఆనందంగా అవలోకిస్తున్నాను,
నా మనో ఆకసంలో భవిష్యత్తారకల జిలుగు వెలుగులు దర్శిస్తూ,
నా బతుకుదారిని ప్రతి కిలోమీటరూ కొలుస్తున్నాను—
మనిషి తన యానంలో ఎన్నో సంఘర్షణల్లో వున్నాడు,
ఎన్నో సుఖ మరీచికా నిశ్రేణి కలలో
కృష్ణాజినంలా ఉంగలు చుట్టుకుపోతున్నాడు,
నా యానము యిలాగే,
అజస్ర ప్రజానీక ఛీత్కార గుంజాత్ప్రవాహ ఘోషలా వుంది,
కడు భారంగా వుంది—సారహీనంగా వుంది,
అయినా నా మనస్సహారాలో ఒయాసిస్సులు దర్శిస్తూ,
నా బతుకు దారిని ప్రతి సెంటీమీటరూ కొలుస్తున్నాను—
మజిలీలయితే చాలా వున్నయ్,
అయినా నాది ఒకే ఒక గమ్యం, నా కది కడు రమ్యం,
అందుకే నా పథాన్ని ఆనందంగా అవలోకిస్తున్నాను,
నా బతుకుదారిని నిర్విరామంగా కొలుస్తున్నాను—
జీవన మహా రౌరవ నరక భీషణ ప్రేంఖనంలోంచి బయటపడి,
మానవజాతిని ఆవాహన చేస్తున్నాను,—
మీ బతుకు గుండె గాయాలకు
బ్యాండేజీ కడ్తాను రండి,
మీ సమస్యల్నీ అపజయాలనూ వదలి రండి,
అదిగో మానవతా సుమవాటిక గుబాళిస్తున్నది!
అందులోని యీ అనంత జనసందోహ సహస్రదళాల,
ప్రతి రేకుతో పల్లవిస్తాను—

—కమలాకాంత్



సరికొత్త సైంటిఫిక్, రొమాంటిక్ సీరియస్ సీరియల్



"అయితే ఉద్యోగం వచ్చిందన్న మాట"

అన్నాడు మాలతి తండ్రి పైపు చివర నుసిని చిటికెన వేలితో దులుపుతూ.

రమణ మాట్లాడలేదు.

"....ఎంత జీతం___"

దీనికి సమాధానం చెప్పలేదు అతడు. అదంత పెద్ద సంఖ్య కాదు.

మాలతి తండ్రే కుర్చీలోంచి లేస్తూ అన్నాడు.

"రెండొందలు. . .మూడొంధలు. కాకపోతే ఐదొందలు. అంతేగా. అది మా వంటివాడి జీతం."

రమణ మొహం ఎర్రబడింది.

"ఇంకెప్పుడూ యిటువైపు రాకు" అన్నాడాయన. "మాలతికి సంబంధాలు చూస్తున్నాం. నీవల్ల దాని కేదైనా అపకారం జరిగిందంటే, నీ రక్తం కళ్ళ చూడాల్సి వస్తుంది" చాలా మామూలుగా సామాన్యంగా అన్నాడు.

అంత వ్యథలోనూ రమణకి నవ్వొచ్చింది. వెళ్ళబోతూ అన్నాడు. "అపకారం చెయ్యాలన్న ఆలోచన నాకెప్పుడూ లేదండీ. అదే వుంటే మళ్ళి యిలా మీ ముందు నిలబడే అవసరమే వచ్చేది కాదు. మాలతికి మైనారిటీ తీరిపోయిందని నాకు తెలుసు. మేమిద్దరము పెళ్ళి చేసుకోవాలనుకొంటే మీ డబ్బుగాని, మీ వెనుకున్న గూండాలుగాసీ దాన్ని ఆపుచేయలేరు. అయితే యీ వివాహం జరగకుండా ఆపుతున్నది—మనిషి నైతిక విలువలకి నేనిస్తున్న గౌరవం. అంతే—"

అతడు కదిలి బైటకొచ్చేడు.

పోర్టికోలో మాలతి నిలబడి అతడి గురించే ఆతృతగా చూస్తూంది. ఆమె కళ్ళల్లో ఏదో చెప్పాలన్న తపన. అతడు ఆగేడు. ఆమె అతడివైపు చూసింది. ఇద్దరి కళ్ళూ క్షణంసేపు కలుసుకొన్నాయి.

జీవితం క్షణికం అయితే కావొచ్చుగానీ, క్షణం అస్తిత్వం లేనిది కాదు.

అతడు తల వంచుకొని ముందుకు

నడిచేడు.

మనసంతా వికలమైంది.

చేతులు రెండూ ప్యాంటు జేబుల్లో పెట్టుకొని నడవటం సాగించేడు.

ప్రొఫెసర్‌తో కొంచెంసేపు గడపటమే అతడికి ఈమధ్య సంతోషాన్నిస్తూంది.

ఇంటి ఆవరణలోకి ప్రవేశించేడు.

గ్రీన్‌విచ్ — ఉదయం 6-30

గడియారం పన్నెండు కొట్టింది. కాళ్ళు చాపి, వెనక్కి వాలి కూర్చున్నాడు ప్రొఫెసర్. అతడి మొహం వాడిపోయి వుంది.

"అయితే వెళ్ళిపోక తప్పదా గ్రాడ్యుయేటూ" అన్నాడు.

రమణ మాట్లాడలేదు.

"అవున్లే. అక్కడ జీతం వస్తుందిగా. అయితే యింతకీ ఎప్పుడు వెళ్తున్నావు?"

"ఎల్లుండి చేరదామనుకొంటున్నాను."

"నా దగ్గర పని చేసినట్టు సర్టిఫికేట్టు ఇమ్మంటావా?"

రమణ నవ్వాపుకొని, "వద్దు" అన్నాడు.

ప్రొఫెసర్ లోపల్నుంచి ఓ చెక్కు పట్టుకొచ్చేడు. "ఇంతకన్నా ఏమీ యివ్వలేను. ఉంచుకో" అన్నాడు. రమణ ఆ చెక్కుని చూశాడు, 'సైన్సు టుడే' వాళ్ళు పంపిన చెక్కు అది. ఈ మతిలేని ప్రొఫెసర్ కుదురుగా కూర్చొని ఒక రాత్రంతా వ్రాసి సంపాదించిన డబ్బు. తన కోసం.

అతడికి కళ్ళవెంట నీరొచ్చింది. ఆ క్షణం అన్నీ వదిలేసుకొని యిక్కడే వుండిపోదామా అనుకొన్నాడు. కానీ జీవితం సెంటిమెంట్ల కథ కాదు. ఇంట్లో పరిస్థితి వెన్ను తట్టి లేపుతోంది. మవునంగా చెక్కు అందుకొన్నాడు.

అతడి మనసు శూన్యమైంది.

* * *

శూన్యమైన విశ్వంలో ఇన్ని కోట్ల కోట్ల కోట్ల గ్రహాలూ, నక్షత్రాలూ ఎలా ఏర్పడ్డాయి? అన్న ప్రశ్నకి చాలామంది శాస్త్రవేత్తలు రకరకాల థియరీలు చెప్పేరు. ఏదీ సంతృప్తికరంగా లేదు. ప్రకృతిని శోధించటానికి మనిషి మేథస్సు సరిపోవటం లేదు. మనం చూసేది ఒక సూర్యుణ్ణి. విశ్వంలో మనకి కనపడని సూర్యుళ్ళు కోట్లు.

మనం 'ఆకాశ గంగ' అని పిలిచే నక్షత్రాల సముదాయం కొన్ని లక్షల నక్షత్రాల గుంపు. అందులో దాదాపు రెండువందల బిలియన్ల నక్షత్రాలు వున్నాయని అంచనా.

ఇన్ని కోట్ల నక్షత్రాలూ ఒక బిందువుచుట్టూ పరిభ్రమిస్తున్నాయి. భూమి తనచుట్టూ తను తిరగటానికి ఒకరోజు పట్టినట్టే, ఇవి ఒకసారి తిరగటానికి రెండు మిలియన్ల సంవత్సరాలు పడుతుంది.

* * *


రమణకి ఆ ఆవరణలో నచ్చేది అన్నిటికన్నా ఒకటుంది. అది టెలిస్కోప్. చిన్న పిల్లవాడు ఆటవస్తువుతో ఆడుకొన్నట్టూ అతడు తరచు దాన్లోకి చూస్తూ వుండటం అలవాటు చేసుకొన్నాడు. ముఖ్యమైన నక్షత్రాలనీ, చంద్రుడిలో లెయాబ్‌నిట్జ్ కొండనీ గుర్తించటం నేర్చుకొన్నాడు.

ఆ రోజు మంగళవారం.

ప్రొఫెసర్ తన మామూలు ధోరణలో లెక్కలు వేసుకొంటూ కూర్చొన్నాడు. రమణ స్కోప్‌లో చూస్తూ వుంటే ఒక బంతి లాంటి ఆకారం దక్షిణ దిశలో కనబడింది. నారింజ పండు ప్రమాణంలో వుందది. చాలా వేగంగా ఉత్తరదిశగా సాగిపోతోంది. మామూలు కంటికి కనిపించటంలేదు.

కనిపించిన ప్రతిదాని గురించీ మొదట్లో అతను ప్రొఫెసర్‌ని అడిగి తెలుసుకొనేవాడు. ప్రొఫెసర్‌కి యీ విషయాల్లో జ్ఞాపకశక్తి యెక్కువ. ప్రతి నక్షత్రపు పేరునీ, గ్రహాల పేర్లనీ చెప్పేవాడు. కానీ తన ఈ కుతూహలం, ప్రొఫెసర్ పనిని మాటి మాటికి చెడగొడ్తూందని గ్రహించి అడగటం మానుకొన్నాడు. ఆ భావంతోనే నారింజపండు ఆకారపు బంతి గురించి అతడు అడగలేదు.

కానీ మళ్ళీ మరుసటిరోజు అదే సమయా



నికి అది కనబడింది. ఈసారి అది పుట్‌బాల్ సైజులో వుంది. కానీ టెలిస్కోప్ నుంచి కాకుండా మామూలుగా కనపడటంలేదు. మరింత వేగంతో అది ఉత్తరదిశగా సాగిపోతోంది. ఈసారి యిక అతడు కుతూహలం ఆపుకోలేక ప్రొఫెసరుని పిల్చి చూపించేడు.

ప్రొఫెసర్ చాలాసేపు దాన్ని గమనిస్తూ వుండిపోయేకు. అరగంటలో అది ఉత్తర దిశలో అదృశ్యమైపోయింది.

"ఎన్నాళ్ళనుంచీ దీన్ని చూస్తున్నావు?" టెలిస్కోప్ ఆవరణలోంచి బైటకు వస్తూ అడిగేడు ప్రొఫెసర్. అతడి మొహంలో యే భావమూ లేదు.

"నిన్నట్నుంచి. కానీ నిన్న ఇది ఇంకొంచెం యెక్కువసేపు కనపడింది. కొంచెం చిన్న సైజులో" అన్నాడు రమణ. "ఏమిటది?"

క్షణం మాట్లాడలేదు ప్రొఫెసరు. తరువాత సాలోచనగా అన్నాడు. "ప్రాక్సిమా సెంక్చురీ...."

రమణకి దాని గురించి తెలుసు. భూమికి దగ్గరగా వున్న నక్షత్రం అది. దగ్గరగా అంటే ....సూర్యుడికీ భూమికీ మధ్య వున్న దూరం ఒక అంగుళం అనుకొంటే, భూమికీ ఆ నక్షత్రానికీ మధ్యనున్న దూరం నాలుగుమైళ్ళు. అంత దగ్గర.

"ఇంతకుముందు టెలిస్కోప్‌లో అంత పెద్దదిగా కనిపించేది కాదు, ఇప్పుడెందుకు కనిపిస్తూంది?" అడిగేడు.

"ఇంకో రెండురోజులు పోతే గానీ ఏమీ చెప్పలేను."

ఆ రెండ్రోజులూ రమణ తన ఆఫీసులో చేరే సన్నాహాల్లో వున్నాడు. హెల్తు సర్టిఫికెట్లు ఒరిజినల్స్ చూసుకోవటంతో కాలం గడిచిపోయింది.

ఆ రోజు రమణ అక్కడ పని చెయ్యడానికి ఆఖరి రోజు.

పదకొండు గంటలవేళ, వ్రాస్తున్న కాగితాలలోంచి తలెత్తి, "అర్థమైంది"అని అరిచేడు ప్రొఫెసర్.

రమణ అతడివైపు చూసేడు.

"ప్రాక్సిమా సెంక్చువరీ గురించి" అన్నాడు ప్రొఫెసర్. "భూమికి కొన్ని కోట్ల మైళ్ళ దూరంలో వున్న ఆ నక్షత్రం, నాలుగు రోజుల క్రితం ముప్పైఅయిదు నిముషాలపాటు కనబడింది. అది కనపడే సమయం రోజుకి నిముషంపాటు తగ్గుతూ వస్తూంది. భూమి డయామీటరు దాదాపు ఎనభై లక్షల మైళ్ళు...." అంటూ తన పేపర్లవైపు చూస్తూ ఆగేడు.

"....దాదాపు ఎనిమిది గంటల కాలం కనపడాల్సిన ఆ నక్షత్రం యింత తొందర తొందరగా వచ్చి వెళ్ళిపోవటానికి కారణం ఏమిటి? చాలా సింపిల్ థియరీ. ట్రైనులో వెళ్తున్నప్పుడు దూరంగా ఉన్న చెట్టు దగ్గరగా ఉన్న చెట్టుకన్నా యెక్కువసేపు కనబడ్తుంది. అంతే కదా—"

రమణ నవ్వేడు. "ఆ నక్షత్రం పూర్వం కన్నా దగ్గరగా వచ్చిందంటారా?" అన్నాడు.

"రావటం కాదు. వస్తూ వుంది. యింకా వస్తూ వుంది. రోజుకి నిముషంపాటూ అది కనపడటంలో తేడా వస్తూంది కదా! ఎనిమిది గంటలు కనపడేదల్లా అరగంటే కనబడ్తూం దిప్పుడు. అంటే చాలాకాలం క్రిందటే అది తన ప్రయాణం ప్రారంభించి వుండాలన్న మాట. దాదాపు నెల రోజుల క్రితం. ప్రస్తుతం భూమిచుట్టూ అది ఇరవైఅయిదు నిముషాల్లో ప్రదక్షిణం చేస్తూంది. అంటే పదివేల మిలియన్ల మైళ్ళ దూరానికి వచ్చిందన్నమాట."

"ఇంత పెద్ద మార్పుని యింత వరకూ యెవరూ గమనించలేదంటారా?" అడిగేడు రమణ.

"ఆ అనుమానం నాకు నిన్ననే వచ్చింది. కొన్ని పాత సామాన్లుంటే అమ్మేసి, గ్రీన్‌విచ్ అబ్సర్వేటరీకి, మాంచెస్టర్ యూనివర్సిటీలో మౌంట్‌కి ఫోన్ చేసేను."

"ఏమన్నారు వాళ్ళు—?"

ప్రొఫెసర్ పైకప్పుకేసి క్షణంపాటు చూసి కళ్ళు దించుతూ "దాదాపు నెలరోజుల క్రితం అబ్జర్వేటరీస్ అన్నీ మూసెయ్యమని ఆర్డరొచ్చిందిట" అన్నాడు.

వీడ్కోలు రోజు

ఇద్దరూ చాలాసేపు మాట్లాడలేదు.

గది అస్తవ్యస్తంగా వుంది. ప్రొఫెసర్ వర్క్ చేసిన కాగితాలు చెల్లాచెదురుగా పడి వున్నాయి. ఎలుక ఒకటి కాళ్ళ సందులోంచి పరుగెత్తుకు వెళ్ళిపోయింది.

నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ ప్రొఫెసర్ లేచి, "పద. టీ తాగుదాం" అన్నాడు.

ఇద్దరూ బైటకొచ్చేరు. తలుపు దగ్గరకి లాగగనే ఆటోమేటిక్ లాక్ పడిపోయింది. బైట చిన్న నాబ్ తిప్పి, తలుపు దగ్గరగా వేస్తే లాక్ పడిపోయే యేర్పాటున్న తలుపు అది.

రోడ్డు నిర్మానుష్యంగావుంది. బాగా ఎండగా వుంది.

"ఈమధ్య నాకు మాటిమాటికి బైటకి రావాలనిపిస్తోంది" అన్నాడు ప్రొఫెసర్. "ఇంతకు ముందు ఆర్నెల్ల కొకసారి ఇంట్లోంచి బైటకి అడుగుపెట్టేవాణ్ణి. ఇప్పుడు చూడు....క్రిందటి నెల వచ్చాను. మళ్ళీ యిప్పుడు రావాలనిపించింది."

"నేను మీకు కలవాలని వ్రాసిపెట్టి వుంది. ఆ రోజు అందుకే వచ్చారు...." అన్నాడు రమణ.

"మళ్ళీ యీ రోజు నిన్ను సాగనంపటానికి వస్తున్నాను."

రమణ మాట్లాడలేదు.

ఇద్దరూ ఇరానీ హోటల్లో కూర్చొన్నారు. రెండు సింగిల్ చాయ్‌లకు ఆర్డరిచ్చేరు. హోటల్ రష్‌గా లేదు. నాలుగు రోడ్లు కలిసే చోటులో వున్నా, పక్కనే యింకో పెద్ద హోటల్ వుండటంవల్ల దీని కెవరూ రారు.

గల్లాపెట్టెదగ్గర కూర్చొన్నవాడు కునికిపాట్లు పడుతున్నాడు. రమణ చుట్టూ చూసి, తల తిప్పేసరికి ప్రొఫెసర్ నీటిచుక్కలో చూపుడువేలుముంచి, టేబిల్‌మీద బొమ్మ వేస్తున్నాడు. ఇంతలో టీ వచ్చింది. దాంట్లో యింకో వేలు ముంచి యింకో చుక్క పెట్టేడు. "ఇది భూమి" అన్నాడు.

ప్రొఫెసర్ సంగతితెలిసిన రమణ మౌనంగా టీ తాగసాగేడు.

"బ్రెస్సెల్ థియరీ సంగతి తెలుసునా?" అడిగేడు ప్రొఫెసర్. తెలీదన్నట్టు తల అడ్డంగా ఊపేడు రమణ.

"ఒక నక్షత్రం మనకి యెంత దూరంలో వున్నదీ తెలుసుకోవటానికి అతడు లెక్క చెప్పేడు. ఇదుగో యీ పచ్చటి చుక్క భూమి అనుకో. ఈ నీటిచుక్క నక్షత్రం. ఈ రోజు అది ఇరవైయెనిమిది నిముషాలు కనబడింది. నిన్న ఇరవైతొమ్మిది నిముషాలు. దీని స్థానభ్రంశం, సూర్యుడు భూమికి దూరంగా వున్న రోజు జరిగి వుంటుంది. అంటే యే రోజు?"

"జూన్ ఇరవైవొకటో తారీఖు."

"కరెక్ట్" అన్నాడు. "ఈ నక్షత్రం దాదాపు ముప్పైఅయిదు రోజుల్లో కొన్ని కోట్లమైళ్ళు ప్రయాణం చేసి ఉత్తరం నుంచి దక్షిణ దిశగా వెళ్తోంది. అయితే ఓ అనుమానం వుంది. మనం మామూలు టెలిస్కోప్‌లో కనుక్కొన్న ఈ విషయాన్ని అంతకన్నా అధునాతనమైన పరికరాలు అంటే అల్ట్రావాయిలేట్, ఎక్స్‌రే, రేడియో, టెలిస్కోప్‌లలో మిగతా వాళ్ళు యెందుకు కనుక్కోలేదు?....కొంచెం షుగర్ వ్వటా వెయిటర్ బాబూ—ఇదిగో ఈ నక్షత్రం యీ ఏంగిల్‌లో వస్తూంది. భూమి యిటు వెళ్తోంది...."

వెయిటర్ పంచదార కప్పు తెచ్చి బల్ల మీద పెట్టి వెళ్ళిపోయేడు. నవ్వుల పట్టినట్టూ దాన్ని కొంచెం తీసి బల్లమీద పోసేడు. "ఇది సూర్యుడు" అన్నాడు.

ఈ పిచ్చి చేష్టల్ని యెవరన్నా చూస్తున్నారేమోనని కనుకొలుకుల్లోంచి చుట్టూ చూసేడు రమణ.

"ఈ నక్షత్రం యిలా వెళ్ళే సమయానికి...." అంటూ ప్రొఫెసరు గీత గీసేడు. "సూర్యుడికి ఈ పక్కగా భూమి వస్తుంది. ఇంకోలా చెప్పాలంటే భూమికి దాదాపు యాభై లక్షలమైళ్ళ దూరంనుంచి ఈ నక్షత్రం పక్కగా దూసుకుపోయి అనంతమైన విశ్వంలో కలిసిపోతుంది. నెలరోజులు ప్రయాణం చేసిన ఆ నక్షత్రం దాదాపు నాలుగు కోట్ల కోట్ల కోట్ల మైళ్ళు పయనించింది. ఆ వేగం అలాగే కొనసాగితే, అది భూమికి అత్యంత సమీపంలోకి రావటానికి యింకా యిరవై రోజులు. అంటే ఆగస్టు పదిహేడోతారీఖు అవుతుందన్నమాట. నా లెక్క సరి అవుతే—....ఈ టీ చల్లారిపోయింది. ఇంకో టీ తెప్పించు....నా లెక్క కరెక్టయితే సరిగ్గా ఆ రోజు పదకొండుగంటలా పది నిముషాలకి యీ దూసుకుపోవటం జరుగుతుంది."

వెయిటర్ వచ్చేడు. "ఇంకో టీ" అన్నాడు రమణ. వెయిటర్ వెళ్ళిపోయేడు.

"ఆగస్టు పదిహేడు పగలు పదకొండు గంటలా పది నిముషాలనుంచి, పదినిముషాలా మూడు సెకండ్లవరకూ ఆ నక్షత్రపు అయస్కాంత ప్రభావం భూమిమీద పడుతుంది."

వెయిటర్ టీ తీసుకొచ్చేడు.

"పడితే ఏమవుతుంది?...." అడిగేడు రమణ.

"ఏమవుతుంది. భూమి ఫటేలున పేలిపోతుంది—....ఇదిగో వెయిటర్, ఇందులోనూ షుగర్ తక్కువగానే వుంది."

రమణకి ఓ క్షణం ఏమీ అర్థం కాలేదు. ప్రొఫెసర్ స్పూన్‌తో టీ కలుపుతున్నాడు. సాయంత్రం సరదాగా కబుర్లు చెప్పటానికి వచ్చినవాడిలా తాపీగా వున్నాడు. రమణకి నవ్వొచ్చింది. తెరలు తెరలుగా నవ్వొచ్చింది. బలవంతంమీద ఆపుకొంటూ "అయితే మనం దరం చచ్చిపోతామా ప్రొఫెసర్‌గారూ" అని అడిగేడు.

"ఇంకా నిర్ధారణగా చెప్పలేను" అన్నాడు.

ఇద్దరూ లేచి బైటకు వచ్చేరు.

"మళ్ళీ యెప్పుడు కలుస్తావు గ్రాడ్యుయేటూ?" ప్రొఫెసర్ కంఠంలో కనబడిన ఆర్తి అతణ్ణి విచలితుణ్ణి చేసింది. ఏ ప్రాపంచిక విషయమూ పట్టని ఈ వృద్ధుడు, తనమీద యింత అభిమానాన్ని పెంచుకొన్నాడంటే అది తన అదృష్టం. ఈ నెలరోజుల సాంగత్యంలో తనకి తెలియని యెన్నో విషయాలు తెలుసుకొన్నాడు. భూమి గురించీ, నక్షత్రాల గురించీ....

"తొందర్లోనే మీ ఇంటికి వస్తాను."

వృద్ధుడు ఆశీర్వదిస్తున్నట్టూ చెయ్యి పైకెత్తేడు.

"రావాలనే ఆశిస్తాను. వెళ్ళొస్తాను గ్రాడ్యుయేటూ. నీ భావి జీవితం శుభప్రదమగుగాక" అని, తిరిగి, వెళ్ళిపోయేడు. చాలా నెమ్మదిగా, బలహీనంగా నడుస్తూ వెళ్ళిపోతున్నాడు ఆ వృద్ధుడు. అతడు కనుమరుగయ్యే వరకూ అలానే చూస్తూ నిలబడ్డాడు రమణ. తరువాత యింటివైపు కదిలేడు. అతను యిల్లు చేరుకొనేసరికి రాత్రి ఏడయింది. మనసులో యేదో అసంతృప్తి.

....కాళ్ళు కడుక్కొని భోజనానికి కూర్చొన్నాడు.

"రేపు జాయినవుతున్నావా?" వడ్డిస్తూ అడిగింది జానకి. తలూపేడు.

"ఏమన్నాడు మీ అయోమయంగారు?"

"చాలా బాధపడ్డాడు. మళ్ళీ తొందర్లో వచ్చెయ్యమన్నాడు"

జానకి నవ్వి, "జీతం మాత్రం ఏమీ యివ్వడటనా?" అంది. రమణ మాట్లాడలేదు. భోజనం చేసి పుస్తకం చదువుతూ కూర్చొన్నాడు.

దూరంగా తొమ్మిది కొట్టింది.

ప్రకాశరావు యింకా రాలేదు. అతడికి బ్రాకెట్ల పిచ్చి వుంది. క్లోజింగ్ వచ్చే వరకూ రాడు.

వేసవికాలం అయిపోయినా యింకా వర్షాలు కురవటంలేదు. పగలు బాగా ఎండగా వుంటోంది. రమణ పక్క బైట వరండాలో వేసుకొన్నాడు.

రేపట్నుంచీ తనో ఉద్యోగి. నెల తిరిగేసరికి జీతం వస్తుంది. జీతం అంటే వేలు వేలు కాదు. కానీ యింత హీనంగా యిక బ్రతకక్కర్లేదు. వేన్నీళ్ళకు చన్నీళ్ళు తోడు. మరి మాలతి సంగతి యేమిటి? యేదో ఒక పరిష్కారం ఆలోచించాలి.

తల క్రింద చేతులు పెట్టుకొని వెల్లకితలా పడుకొన్నాడు. చల్లటి గాలి అలలు అలలుగా వచ్చి మనసు సేద తీరుస్తోంది. ఆకాశం నిర్మలంగా వుంది. నక్షత్రాలు తళతళా మెరుస్తున్నాయి. కొన్ని మినుకు మినుకుమంటూ, కొన్ని ప్రకాశవంతంగా.

నక్షత్రాలు

కోట్ల కోట్ల నక్షత్రాలు

అలాగే పడుకొని, తల కొద్దిగా పక్కకి తిప్పి చూసేడు.

ఉత్తర దిక్కుగా—మిగిలిన వాటికంటె ప్రకాశవంతంగా ఒక నక్షత్రం.

ప్రాక్సిమా సెంక్చువరీ!

ఆగస్టు ఒకటి

రమణ ఉద్యోగంలో చేరి అప్పటికి నాలుగు రోజులైంది. ఆ రోజు అతనికి ఆ నాలుగు రోజుల జీతమూ వచ్చింది. నలభై రూపాయలు. చాలా తక్కువ. అయినా అందులో యెంత ఆనందం వుందో ఆ మొదటి జీతం అందుకున్నవాళ్ళకే తెలుస్తుంది.

నలభైలో పదిహేను పెట్టి గోపీకి చొక్కా కొన్నాడు. వదినకి యేం కొనాలో తోచలేదు. స్వీట్లు కొన్నాడు. అతడి మొహం ఆనందంతో వెలిగిపోతోంది. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించినంత ఆనందంతో వున్నాడు.

ఇంటి కొచ్చి చొక్కా గుడ్డా, స్వీట్లూ యిచ్చేడు. మిగతా డబ్బులో ఓ అయిదుంచుకొని, మిగతాది వదిన కిచ్చేడు.

"నీ దగ్గరే వుంచవయ్యా" అంది జానకి.

"ఎలాగూ బస్సు ఖర్చులకనీ, లంచ్‌కనీ తీసుకుంటానుగా వదినా" అన్నాడు. ఆమె నవ్వి లోపలికి వెళ్ళిపోయింది.

సాయంత్రం ఆరయింది.

రమణ బట్టలు మార్చుకొని బైటకొచ్చేడు. జేబులో అయిదురూపాయలున్నయ్. హోటల్ కొచ్చేడు. ప్రొఫెసర్‌ని మొదటిసారి కలుసుకున్న హోటల్.

రెండు కేకులు కొన్నాడు.

అవి తీసుకొని ప్రొఫెసర్ పురాతన భవనం వైపు నడిచేడు. అతడు అక్కడికి చేరుకొనేసరికి అరుంబావయింది.

తలుపు తీసేవుంది. లోపలికి నడిచి, తలుపు బలంగా వేసేడు. తరువాత జ్ఞాపకం వచ్చింది-తలుపు బలంగా వేస్తే బైట లాక్ పడ్తుందని. మళ్ళీ తీసి చూసేడు. అదృష్టవశాత్తు లాక్ పడలేదు.

అతడు లోపలకు వెళ్ళేసరికి ప్రొఫెసర్ యథాప్రకారం కాగితాలు ముందేసుకొని కూర్చొని వున్నాడు. రమణని చూసి, "రా! గ్రాడ్యుయేటూ. రా!" అని ఆహ్వానించేడు. "ఆ నక్షత్రం గురించి ఇంకా కొన్ని విషయాలు సేకరించేను."

"నక్షత్రాల సంగతి తర్వాత. ముందీ స్వీటు తినండి. నా మొదటి జీతంతో కొన్నది" అని కేకు అందించేడు.

"రెండూ నేనే తింటే నీకేమైనా అభ్యంతరమా? నేను భోజనం చేసి మూడ్రోజులైంది...."

రమణ చప్పున తల తిప్పుకొని కళ్ళ నీళ్ళు కనబడనివ్వకుండా "తినండి" అన్నాడు రుద్ధమైన కంఠంతో.

అతడు ఆత్రంగా తినటం పూర్తి చేసి, "ఊఁ—చెప్పు. యేమిటి విశేషాలు?" అని అడిగేడు.

"మీరే చెప్పాలి."

ప్రొఫెసర్ తన కాగితాలవైపు క్షణం తదేకంగా చూసేడు. "నేను చెప్పేది ఏదైనావుంటే అది ఆ నక్షత్రం గురించే...." అన్నాడు.

"దాంట్లో వేడి అంతగా లేదన్నదితేలిపోయింది. యెందుకంటే—ఏమాత్రం వేడి వున్నా మనం యీపాటికి మసి అయిపోయి వుండేవాళ్ళం. పోతే అయస్కాంత శక్తి సంగతి తేల్చాలి."

రమణ మాట్లాడలేదు. అతని కిదంతా అర్థరహితంగా కనబడింది. ముందు సంగతి వేరు. అప్పటికి అతడికి ఉద్యోగంలేదు. కానీ ఇప్పుడు యింకా చాలా పనున్నాయి.

అతడా ఆలోచనలో వుండగానే ప్రొఫెసర్ ఓ కాగితం తీసిచ్చేడు. "నేను వ్రాసిన ఉత్తరానికి ఓ కాపీ చేసి వుంచాను" అన్నాడు. రమణ దాన్ని అందుకొని చదవసాగేడు.

"ప్రియమైన ప్రధాన మంత్రి జగదీష్‌చంద్ర గారికి,

నేను క్షేమమే. మీరూ క్షేమమే అని తలుస్తాను. లోగడ నేను మీకో ఉత్తరం వ్రాసివుంటిని. మీరు ఈమధ్య యిటువైపు రాలేదా? పోనీలెండి. మీకో ముఖ్య విషయం చెబుదామని యీ ఉత్తరం వ్రాస్తున్నాను. ప్రాక్సిమా సెంక్చువరీ భూమివైపు వస్తున్నది. ఆ విషయం మీకు చెబ్దామని....మరి వుంటాను.

అభినందనల్తో—

ప్రొఫెసర్ అయోమయం.

పి.యస్: ఆ నక్షత్రానికిగానీ ఆకర్షణశక్తి ఉన్నట్టయితే భూమ్మీది వస్తువులు వెళ్ళి దానికి అతుక్కుంటాయి."

రమణ ఉత్తరం మడిచి యిచ్చేసేడు. లాభంలేదు. ఈ మతిలేని ప్రొఫెసరు మెదడుని యెవరూ సరిచెయ్యలేరు. పదిహేనేళ్ళ అమ్మాయిలు అభిమాన నటులకి వ్రాసినట్టు ఈయన ప్రైమ్మినిస్టర్ ఆఫ్ ఇండియాకి వ్రాస్తున్నాడు. పెర్వర్షన్ అంటే యిదే కాబోలు—

(సశేషం)

జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

తిరిగొచ్చిన గేదె

తల్లావఝల సుందరం

1

పురాణాలు చదివేరా!? లేదా! పోనీ ఇతిహాసాలు!? అది లేదా!—వదిలేయండి. పోనీ వాటిల్ని క్యాష్ చేసుకొన్న సినిమాలు చూసేరా!! చూసే వుంటారు. వాటివల్ల మనం నేర్చుకున్నది ఏమున్నదో అనవసరం కానీ సీతా, సావిత్రి, సుమతి అంటూ పతివ్రతలు, మహా సాధ్వీమణుల లిస్టు వరసగా చదివేయగలం పొరపాటున యెవరేనా అడిగితే! వాళ్ళ భక్తి వాళ్ళను ఎల్లవేళలా కాపాడుచుండును. వాళ్ళను ముట్టుకుంటే మాడిపోగలం. (కావలిస్తే పురాణ సినిమాలు చూడుడు) వాళ్ళు పిలిస్తే దాసిజనం గబుక్కున వచ్చేవారో లేదో గాని నమ్ముకొన్న దేవుడు మాత్రం సాక్షాత్కరించేవాడు. అందులో ధోకా లేదని సదరు పుస్తకాలవల్ల, పందిళ్ళలో హరికథలవల్ల తెలుస్తోంది.

ఎందరో సాధ్వీమణులు, పతివ్రతలు యీ గడ్డమీద పుట్టడంవల్లే స్త్రీజాతి వాళ్ళ పేర్లు తల్చుకొని యీ మాత్రం భయభక్తులతో వుంటున్నారని పెద్దల అభిప్రాయం. అలాంటి సదభిప్రాయమే కావమ్మగారికి కూడా వుంది. ఆవిడకు వుండడంలో తప్పులేదు. కారణం ఈ శతాబ్దంలో ఆ కోవకు చెందిన మహా భక్తురాలు. ఆవిడ భక్తిగురించి, ఆవకాయ గురించి తెలీనివారు బహు అరుదు. ఆవిడ పుట్టుకకు ముందు వాళ్ళ అమ్మగారికి దేవుడు కలలో కన్పించి నీకు పుట్టబోయే బిడ్డ పరమ భక్తురాలౌతుందని చెప్పి మాయం అయ్యేడుట!

రామాయణంలో సీతమ్మవారికి కల్గిన కష్టాలా కావమ్మగారు కూడా చాలా బాధలు పడ్డది. పెళ్ళయిన కొత్తల్లో కొంతకాలం భర్త ఎడబాటు—ఆ తర్వాత ఆయన నమ్ముకొన్న పెళ్ళాన్ని వదుకొన్న సులకమంచాన్ని వదిలేయక తప్పింది కాదు.

"భగవంతుడు చిన్నచూపు చూసేడు—" అని అనుకొన్నారు కావమ్మగారు వంశ పారంపర్యంగా వస్తున్న వైధవ్యాన్ని తల్చుకొని. ఆ రోజునుంచి ఆమె ఏకాకి. ఉన్న ఒక్కగానొక్క కూతురు కుమార్తును కని, పట్నంనుంచి వచ్చిన ఓ హెల్త్ విజిటర్ కుర్రాడ్ని మోహించి ఓ అర్ధరాత్రి హాయిగా లేచిపోయింది. వున్న ఊళ్లో తలెత్తుకోలేక మనవడ్ని తోడు తీసుకొని ఆ ఊరు ఈ వూరు తిరిగి ఆఖరికి విప్రుల్లపల్లిలో స్థిర నివాసం ఏర్పరుచుకొన్నారు.

అప్పటికే చుట్టుపక్కల గ్రామాల్లో కావమ్మగారి భక్తి గురించి, కూతురు లేచి పోవడానికి గల వైనాలు అందరికీ చూచాయగా తెల్సు. దాంతో ఆ గ్రామంలో కాలు పెట్టగానే సాక్షాత్తు మానవ రూపంలో వున్న దేవతే తమ గ్రామం వచ్చిందని సంబరపడి ఓ చిన్న యిల్లు సంవత్సరానికి సరిపడ్డా గింజలు యేర్పాటు చేసేరు.

సోమశేఖరశర్మ గారింట్లో వాళ్ళ మనమరాలు అన్నప్రాసన రోజున స్టీలు చెంబా పోయింది—కరణం గారికి కాపు వీధిలోవున్న రెండో ముండ నగలతో సహా మాయం అయింది—కొత్తగా వచ్చిన మేష్టారిగారి అమ్మాయి సిగ్గుబిళ్ళ పోయింది. కానీ అవన్నీ మళ్ళా యెలా దొరికేయి అన్న అనుమానం వస్తే సమాధానం కావమ్మగారు. లేచిపోయిన పెళ్ళాం దగ్గరనుంచి—గట్టు దాటిన గేదెల వరకు అవి యెలా పోయింది? యెలా దొరికేది? క్షణంలో చెప్పగల్దు. ప్రతిఫలంగా అరిటి




పండు కూడా ఆశించదు. దాంతో ఆమె పేరు ప్రఖ్యాతులు చుట్టుపక్కల గ్రామాల్లో కూడా వ్యాపించేయి.

ఆవిడ మనవడ్ని అందరూ 'గుండు వెంకు' అని ముద్దుగా పిలుస్తారు. వాళ్ళింటి పేరు గుండు కాదు. అలా అందరూ పిల్చినప్పుడల్లా బామ్మమీద చచ్చేంత కోపం పుట్టెడు దుఃఖం వస్తుంది వెంకుకి. అతని గుండు నిత్యనూతనంగా యెప్పుడూ తళతళలాడే కొత్తరూపాయి బిళ్ళలా మెరుస్తుంటుంది. ఎడారిలో పూలమొక్కలు మొలవొచ్చు—బట్టనెత్తిమీద వెంట్రుకలు మొలవొచ్చు—మాచకమ్మ పెద్దమనిషి కావచ్చు. కానీ అతని గుండుమీద జుట్టు మాత్రం రాదు. శాస్త్రరీత్యా వస్తుంది కానీ మొలక దశలోనే కావమ్మగారు "ఫలానావారి చెంబా దొరికితే స్వామీ! నీకు నా మనవడి నీలాలు సమర్పించుకొంటాను—" అని లంపం ఎరచూపడం—పోయిన వస్తువు దొరకడం—మంగలి అప్పన్నకి పచ్చడి పెట్టి, వెంకుకి నున్నగా గుండు గీయించటం టకటకా జరిగిపోతాయి.

అసలు వెంకుకి జుట్టు రావడం మంగలి అప్పన్నకి కూడా యిష్టంలేదు. "ఎంత నెడ్డా బేవనోల్ల పచ్చడి నేనా బాగుంటుంది—" అని అందరితో అంటాడు. మరి పచ్చడి కావాలంటే అనునిత్యం కావమ్మగారు మొక్కు-

రచయిత గురించి



తల్లావఝుల సుందరం పుట్టింది పెరిగింది ఒంగోలులో. ప్రస్తుత నివాసం, ఉద్యోగం హైద్రాబాదులో. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ లిమిటెడ్‌లో జూనియర్ అసిస్టెంటు. అడపదడపా రాసిన కథలన్నీ అన్ని ప్రముఖ పత్రికల్లోనూ ప్రచురితమైనాయి. మొదటిసారి మొదటి బహుమతి 'ఉదయాగమం' 77' జ్యోతి దీపావళి నవలల పోటీలో లభించింది. బీనాదేవి గారి రచనలంటే చాలా ఇష్టం—అలాగే నాటకాలువెయ్యడం అన్నా-స్నేహితులతో కాలక్షేపం అన్నా మరింత ఇష్టం.

తూనే వుండాలి. వీళ్ళిద్దర్నీ తల్చుకొన్నప్పుడల్లా వొళ్ళు మండి, చేతిలో కత్తి వుంటే ఒకే పోటుతో యిద్దర్నీ పొడిచేద్దామన్న చిన్న కోరిక వెంకుకి లేకపోలేదు

స్కూల్లో అందరూ సరదాగా అతని గుండు మీద మొట్టికాయలు మొట్టి పారిపోతుంటారు. ఆఖరికి వొంటిజడ చీమిడిముక్కుల పార్వతి కూడా వెక్కిరిస్తుంది.

వెంకుకి మొట్టమొదటిసారి టూరింగ్ టాకీసులో చూసిన పాతాళభైరవి సినిమా అంటే చెడ్డ యిష్టం. సినిమా కథ అంతగా గుర్తులేకపోయినా ఎన్టీవోడి జుట్టు భుజాలదాకా వుంగరాలు తిరిగి వుండడం అతని చిన్నారి మనసు మీద ముద్ర వేసేయ్. ఆ తర్వాత పలుమార్లు కలల్లో ఎన్టీవోడు వుంగరాల జుట్టు దువ్వుకొంటూ కన్పించేడు.దాన్తో పిచ్చెక్కిపోయింది.

పట్నంలో చదువుకొంటున్న కరణంగారి మూడో అబ్బాయికి వుంగరాల జుట్టే! తనతోటి సదాశివంకి వుంగరాల జుట్టే!! మరి తనకో?!! ఛీ...ఛీ ..ఈ బామ్మ ముండ చచ్చినా బాగుండును!—అని పదే పదే ప్రతిరోజూ అనుకోకుండా వుండలేకపోయేడు వెంకు.

యెప్పుడూ యెవరో ఒకరు రావడం యేదో పోయిందనడం తన్ని అడక్కుండానే తన జుట్టు అర్పించుకొంటానని బామ్మ మొక్కుకోవడం గొప్పగా చిరాకనిపించింది. చాలా సార్లు బ్రతిమలాడేడు. కానీ ఆవిడ "బొచ్చు కన్నా భక్తి యెక్కువరా వెధవా! ఆ స్వామి దయలేకపోతే మనం యిలా వుండగలమా?! తప్పు నాయనా అలా అనకూడదు. తప్పు క్షమించమని దేవుడికి—" అని ఆవిడ మాట పూర్తిచెయ్యకముందే "బామ్మా! మళ్ళీ దేవుడికి మొక్కుకోకే వచ్చిన కొంచెం జుట్టు తీయించకే—" అని కాళ్ళమీద పడ్డాడు.

ఆవిడ "అపచారం...అపచారం..."అంటూ చెంబుడు నీళ్ళు నెత్తిమీద దిమ్మరించుకొని దేవుడ్ని రిక్వెస్టు చేసింది. "చిన్న కుంక తెలీక వాగేడు వొదిలేయ్ స్వామీ!" అని. అప్పటికి ఆ గండం గడిచింది. ప్రాణం కుదుటపడింది. తెల్లగా మెరిసే గుండుమీద నల్లగా మిల మిలలాడే జుట్టును చూసుకొన్నప్పుడు అతని ఆనందానికి అవధి వుండేది కాదు.

దిన దిన ప్రవర్ధమానమౌతున్న వెంట్రుకల్నీ, నిజమౌతున్న కలల్నీ తల్చుకొని

మనసు ఆనందంతో వురకలు వేసింది—వెంకుకి.

కానీ అతగాడ్ని 'గుండు వెంకు' అని పిలవడం మానకపోవడంతో దారుణంగా కోపం వచ్చింది కానీ అతని సంతోషం కోపాన్ని మింగేసింది.

2

ఆ ఉదయం ముప్పైరెండోసారి తల దువ్వుకొంటూ నవ్వుకొన్నాడు. విరిగిన అద్దం ముక్కతో వెంకు నవ్వు తెగిపోయింది. నల్లని ఆముదం పట్టించిన జుట్టు ధగ ధగ మెరుస్తూ గాలికి కదిలే వరి మొలకల్లా మెత్తగా కదులుతుంటే వెంకు అదోలా అయిపోయి కుంచించుకు పోయేడు. తన జుట్టు చూసి తనకే ముద్దేసింది. మరో కొద్దిరోజులు పోతే దువ్వెనకూడా దూరలేనన్ని వుంగరాలు...పాతాళభైరవి ఎన్టీవోడిలా. ఆ తలంపే యెంతో ఆనందాన్నిచ్చింది. మూరెడు పొడవున్న యిత్తడి గ్లాసులో బిందెడు కాఫీ చల్లారిపోయింది అప్పటికే!

"అయినా యిదేం పోయేకాలంరా! పొద్దస్తమానం అద్దం పట్టుకొని వదలవేం?! శాస్త్రిగారింటికి పోయి కరివేపాకు పట్టుకురారా అంటే అలా సూడిగేదలా వులక్కుండా పలక్కుండా వుంటావేం?: ముందు కదులు—" అన్న బామ్మ మాటలకి అద్దాన్ని వదలక తప్పలేదు వెంకుకి.

ఆఖరుసారి మళ్ళీ చూసుకున్నాడు.

"కావమ్మగోరు, కావమ్మగోరు—" అన్న కేక ఆ యింటిలో ప్రతిధ్వనించింది. వెంకుకి గుండె ఆగింది. వయ్యారంగా కదులుతున్న జుట్టు నిక్క బొడుచుకొని చూరుకేసి చూస్తోంది.

అలాంటి పిలుపు వినిపించి అప్పటికి నాలుగు నెలలైంది. అతని గుండెలో గునపం గుచ్చుకొన్నట్లయింది. యేదో అనుమానం మెదడ్ని చుట్టేసింది. వణికిపోయేడు. పడబోయే అడుగు పడలేదు. ధైర్యం కూడదెచ్చుకొని బయిటకొచ్చేడు.

వరండాలో కావమ్మగారు శివసాయిధ్యం పొందినట్లు మఠం వేసుకొని, కళ్ళు మూసుకొని వింటున్నారు.

"అది అమ్మగోరు. . .పిచ్చిముండ మా సక్కగా వుండేదండి. నెత్తిమీద అరచేయి ఎడల్పున తెల్లటి మచ్చ—కుడికాలుమీద కూడా అలాగే వుంటుంది. సక్కగా డిల్లీ గేదెనాగ కలకల లాడుతుంటది. ఒక్క చెనం నా గొంతుక యినబడకపోతే అల్లల్లాడి పోయేది. మరెెల్లి పోనాదో! ఏటో! మరీ పూట గడ్డేనా గతికిందో నేదో! కావమ్మగోరు తమరుగోరే రచ్చించాలి. ఆ పిచ్చితల్లి ఎెల్లి పోనాదో తమరే సెప్పాల...నేకపోతే దాన్తోపాటు నాను కూడ్నేక యిలాగే సచ్చిపోతా!!"—వచ్చిన ముగ్గుర్లో మధ్యవక్తి తనకి జరిగిన దారుణం గురించి వివరించేడు. కావమ్మగారిలో చలనం లేదు.

ఎదురుగా వున్న ముగ్గురు ప్రాణం వున్నా పోయినట్లు చూస్తున్నారు. ఆమె నోటినుంచి రాబోయే మాటకోసం ఆతృతగా వున్నారు. గుమ్మంలో వున్న వెంకుకి పూనకం వచ్చేలా వుంది. అతని కళ్ళముందు రకరకాల క్రాఫ్‌లు గిర్రున తిరిగేయి. నల్లగా వత్తయిన జుట్టు గాల్లో కదుల్తూ కన్పించింది. మధ్య మధ్య నూనెకి మెరుస్తున్న తెల్లని గుండు అక్కడక్కడ మచ్చల్తో...!! కళ్ళవెంట కన్నీరు జల జలా రాలిపోతున్నాయి. అప్రయత్నంగా చెయ్యి నెత్తిమీద కెళ్ళింది. మెత్తటి జుట్టులో మునివేళ్ళు దూరేసరికి స్వర్గంలో కాలు పెట్టినట్టు పరీక్ష రాయకుండానే ఫస్ట్ క్లాసు పాసైనట్లనిపించింది. ఆ ఆనందం క్షణికం.

కావమ్మగారు మౌనం విడనాడేరు.

"సుబ్బయ్యా! నీకేం భయంలేదు. నీ గేదె తూర్పుదిశవైపు వెళ్ళింది. భగవంతుడి దయ వల్ల తిరిగొస్తుంది—" అని చెప్పి పూజ గదిలోకి వెళ్ళేసరికి గుమ్మంలో వున్న వెంకు కన్నీటిని ఆపుకోలేకపోయేడు. విసురుగా తనుగూడా పూజగదిలోకి పరుగెట్టేడు.

"స్వామీ! ఆ గేదెను క్షేమంగా వారికి

ఢక్కించు. ఆ గేదె తిరిగొచ్చిన వుత్తరక్షణం నా మనవడి నీ. . ."

"బామ్మా!—" అన్న కేకకి కావమ్మగారి ముసలి గుండె క్షణం ఆగి మళ్ళీ కొట్టుకో బోయింది.

"బామ్మా! నువ్వు మొక్కుకే. ఈసారి నా జుట్టు దేవుడికి స్తే నే చస్తా!! ఈ ఒక్క సారేనా నా మాట వినే. పాడు గేదె పోతే మాత్రం ఏం?! యెంతో జాగ్రత్తగా పెంచుకొంటున్న జుట్టు చూడు! ఎంత బాగుందో!! నువ్వు చెప్పినట్టు గదె తిరిగొ స్తుందే బామ్మా. మొక్కు కోకే!!. . ."

"తప్పు నాయనా అలా అనకూడదు. దేవుణ్ణి కాదంటే కళ్ళు పోతాయి. ఈ జుట్టు పోతే మళ్ళీ వస్తుంది."

"బామ్మా! ఈసారి మొక్కేవంటే నేను యింటినుంచి పోతా!"

"నా మాట విన్రా! ఈ ఒక్కసారి యిలా కానీయ్. ఆ తర్వాత నీ యిష్టం. ప్రభూ! నా మనవడి నీలాలు సమర్పించుకొంటాను."

"బామ్మా!!" గాంఢ్రించేడు.

"ఇంక నా వల్ల కాదు. మాటిచ్చిం. తర్వాత వెనక్కి తీసుకోలేను."

"నేచ చచ్చినా నా జుట్టు తీయించు కోను. . . ."

"తప్పు. చెంపలేసుకో! అలా అనకూడదు! ఈ తప్పు క్షమించమని. . ."

"బామ్మోయ్!!—" అని అవాక్కయి పోయాడు.

గోడమీదవేలాడుతున్న దేవుడు దెయ్యంలా కనబడ్డాడు. ఉక్రోషం పెరిగిపోయింది. మూతి యెన్ని వంకర్లు తిరిగిందో అతనికే తెలీలేదు. కసిగా కాల్తో తలుపు తన్నేడు. ధడేల్‌మంది. కావమ్మగారు మాత్రం యోగసమాధిలోకి వెళ్ళి పోయేరు.

శ ప ధ ం చేసిన వీరపుత్రుడిలా దూసు కొచ్చేడు.

బయట భయభక్తులతో వున్న ముగ్గురు భూమిలోంచి సడన్‌గా బయటకొచ్చిన చెట్లలా దిగులుగా చూస్తున్నారు.

చొక్కాతో మొహం తుడుచుకుంటూ కొర కొరా ముగ్గురికేసి చూసేడు వెంకు. లెక్కలు మేష్టార్ని చూసినంత అసహ్యం వేసింది. దూరంగా పోయి రాయి తీసి విసిరికొట్టేడు కసిగా. అతని దురదృష్టం అది ఇంటి పెంకుల మీద పడింది.

ఉక్రోషం పట్టలేక నిప్పుతొక్కిన కోతిల్లా వరుగు లంకించుకొన్నాడు గుండు వెంకు.

ర ర ర

చింతాక్రాంతుడై వికలిత మనసుతో— చెదిరిన క్రాఫ్‌తో కాలుతున్న కడుపుతో నీర సంగా పొలంగట్టుమీద కూర్చున్న వెంకుకి చచ్చిపోవాల్న కోర్కె మొట్టమొదటిసారి కలి గింది. తన కింక జుట్టు వుండే యోగం లేదు. అలా వుండాలంటే ఒకటే మార్గం....బామ్మ చచ్చిపోవాలి! ఎస్టీవోడు వరిచేలో నుల్చొని జుట్టు సద్దుకొంటున్నాడు—ఆకాశంలో నీలి మేఘశ్యాముడు కిరీటం నెమలి ఈక లేకుండా భుజాలదాగా జుట్టు వేలాడేసుకొని కళ్ళముందు మెదిలేడు. ఏడుపుతోపాటు వెక్కిళ్ళు కూడా వచ్చేయి వెంకుకి.

చిరుచీకట్లు పడబోతున్నాయి.

పడమర సూర్యుడు వెంకు బాధను చూడ లేక భూమిలోకి దిగబడిపోయేడు.


మరోసారి నుదుటిమీదకి వచ్చిన జుట్టును స్పృశించి ఘొల్లుమన్నాడు.

సరిగ్గా అదే సమయం అతని కన్నీటిపొరల తెరల మాటునుంచి తన దృష్టి పచ్చటి వరిచేల మధ్య దొర్లుకుంటూ వస్తున్న నల్లరాయిలాంటి గేదెమీద పడింది. గబుక్కున లేచి నుల్చొ న్నాడు. రెండు కొమ్ముల మధ్య తెల్లటి మచ్చ....వెంకుకి కోపం, ఆనందం ఒకేసారి కల్గేయి. గబ గబా గేద దగ్గరకు పరిగెట్టేడు.

అదే మచ్చ! అదే గేదె!!....ఖచ్చితంగా సుబ్బయ్య గేదే అది. తోక దగ్గర కుడికాలు మీద కూడా తెల్లటి మచ్చ!

....వెకిలిగా నవ్వుతూ కత్తికి పదునుపెడ్తూ అప్పన్న!

—చెంబుతో నీళ్ళు పట్టుకొని వరాలు పొందిన భక్తురాల్లా కావమ్మ....



అప్పన్న కసిగా నరికేస్తున్నాడు జుట్టును. నేలమీద పడివున్న జుట్టును చూస్తూ చిరునవ్వు చిందిస్తూ కావమ్మ.

మరో పదినిమిషాల్లో ఆ గేదె వూళ్ళోకి వస్తుంది! తన వుంగరాల జుట్టు ముక్కలు ముక్కలుగా మారిపోతుంది. తన ముద్దుల జుట్టు—ఠీవిగా ఆకాశంవైపు చూడని రింగుల జుట్టు....అమ్మో! వొద్దు. నల్లని, మెత్తని క్రాఫ్ కర్కశంగా కత్తెర మధ్య నలిగి పోతోంది.

మెరుపులా వెంకుకి ఆలోచన మెరిసింది.

గట్టుపక్కన కాలవలో బురద తీసుకొని మచ్చమీద పూసేడు. సంతృప్తిగా వూపిరి పీల్చుకొన్నాడు. మచ్చ కనబడటంలేదు. ఇంక ఆ గేదెను ఎవ్వరూ పోల్చుకోలేరు.

చేతికి దొరికిన పుల్లతో అదిలించి నడక సారించేడు.

మెల్లగా చీకటి వూరిమీద వాలిపోయింది.

వెంకుకి కాళ్ళు పీకుతున్నాయి. అడుగు పడటంలేదు. పట్టుదల వెన్ను చరిచింది.చీకట్లో యెటు వెళ్తున్నాడో తనకే తెలీటంలేదు. చుట్టు పక్కల యెక్కడా వూరు జాడ కనిపించటం లేదు. పాడు గేదె గబగబా నడవదు!! వొళ్ళు మండి రాళ్ళతో కొట్టేడు. నీరసం వచ్చింది.

ఒక్కసారి బామ్మ గుర్తొచ్చేసరికి మళ్ళీ ఓపిక కూడదెచ్చుకొన్నాడు. తనకి వుంగరాల జుట్టు కావాలంటే ఆ గేదెను తిరిగి రాలేనంత దూరం తోలుకుపోయి వదిలెయ్యాలి. అప్పుడు దాని క్కూడా దారి తెలీదుగా?!!

నిగనిగ లాడే జుట్టు....సదాశివంగాడికన్నా నల్లగా పొడుగ్గా, చక్కగా శెట్టికొట్లో వేగోడిల్లా వుంగరాలు....యస్టీవోడికన్నా బ్రహ్మాండంగా. కాల్లో ముల్లు దిగేసరికి ఆలోచన్లని వదిలెయ్యక తప్పలేదు. క్షణం కూర్చుని ముల్లును పీకి కాసేపు విశ్రాంతి తీసుకొని మళ్ళీ బయల్దేరేడు. గతుకుల గట్లమీదనుంచి చేల మధ్య నుంచి గమ్యం లేనివైపు....మధ్య మధ్యలో గడ్డి తింటున్న గేదెను చూడగానే వొళ్ళు మండింది తనకి తిండానికి ఏవీ లేనందుకు.

చాలా దూరంగా మిణుకు మిణుకుమంటూ కనిపిస్తున్నాయి దీపాల కాంతి. బహుశా ఏదో వూరై యుండొచ్చు. ప్రాణం తిరిగొచ్చింది వెంకుకి. అప్పటికి యెన్ని గంటలనుంచి అలా నడుస్తున్నాడో తల్చుకోగానే ఆశ్చర్య కలిగింది నీరసంతోపాటు. ఈ బాధల్ని ఓపిగ్గా భరిస్తే తనకి జుట్టు వుండడం ఖాయం.

కనిపిస్తున్న దీపాల కాంతిని కొండ

గుర్తులా పెట్టుకొని ఆ దారివైపు గేదెను తోలుకుంటూ బయల్దేరేడు గుండు వెంకు.

3

గుమ్మంలో నీరసంగా అడుగుపెట్టిన వెంకుకి గుండాగిపోయింది. దాని క్కారణం తను తెల్లవార్లు తోలుకెళ్ళి దూరంగా ఏదో వూర్లో వొదిలేసిన గేదె తిరిగి కళ్ళముందు ప్రత్యక్షం కాలేదు. కానీ కావమ్మగారు వీధరుగుమీద శోక సముద్రంలో మునిగిపోయి కొంగుతో ముక్కు-తుడుచుకొని అలిసిపోయి ఏడ్చే ఒపిక లేనట్లు చూస్తున్నారు. అరుగుకింద దూరంగా మోకాళ్ల మీద తల పెట్టుకొని పక్కింటి శవం దగ్గర పరామర్శకుడిలా మంగలి అప్పన్న-గుండెలో రాయి పడింది.

ఆకలికి అలసటకి మనిషి సగం అయిపోయేడు వెంకు.

వెంకును చూడగానే బావురుమంది బామ్మగారు.

"పిచ్చి నాయనా! ఎక్కడికి పోయేవురా!? నిన్న ప్రొద్దుటి నుంచి కనబడకపోతే నా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని నీకోసం చూస్తున్నాను. బంగారు కొండే! అంతే చాలు నువ్వు క్షేమంగా వచ్చేవు—" గట్టిగా కౌగలించుకొని భోరుమని కడవలకొద్దీ కన్నీరు కార్చింది.

వెంకులో చలనం లేదు. కోపం తగ్గలేదు. అరుగు మీద మాటా పలుకూ లేకుండా పడ్డాడు.

"మా అమ్మ చచ్చిపోనూ నిన్నటి నుంచి ఎంగిలి పడ్డావురా?!! నే చచ్చిపోనూ ఎంతలా అయిపోయేవురా నాయనా?!"

ఆవిడన్న ప్రతి మాటకు రియాక్షన్ యిస్తున్నాడు అప్పన్న. ఆవిడతోపాటు వాడికూడా దుఃఖం వరదైపోయింది. కానీ దృష్టి మాత్రం నల్లటి వెంకు జుట్టుమీదే.

"ఒరే అప్పన్నా! నిజంగా వాడు వున్నాడ్రా! వాడ్ని నమ్ముకొంటే ఎవ్వరూ అన్యాయం అయిపోరు. నిన్నంతా వీడు కనబడకపోతే మొక్కుకున్నా."

"బామ్మా! ఏవనే!!" భయంగా అన్నాడు వెంకు.

"అదేమిట్రా ఏవనేమిటి! తప్పు లెంప లేసుకో! నువ్వు కన్పిస్తే నీ తల నీలాలు...."

"బామ్మా!!—"అని హతాశుడై వెల్లికితలా పడిపోయేడు. కావమ్మగారు రాగిచెంబుతో నీళ్ల చల్లేరు. కదలికలేదు. విసనకర్రతో విసురుతున్నాడు అప్పన్న. కావమ్మగారికి యేం చెయ్యాలో పాలుపోలేదు. హడావిడిగా ఆతృతగా పూజ గదిలోకి పరిగెట్టింది.

వెంకుకి వంటిమీద స్పృశలేదు. కదల్లేని శవంలా పడున్నాడు. జుట్టు నిమురుతూ విసురుతున్నాడు అప్పన్న—ఉన్నట్టుండి మధ్య మధ్యలో వెంకు ఛాతీ ఎగిరెగిరిపడుతోంది.

గోడ మీద ఏడుకొండలవాడు నామాల చాటునుంచి కావమ్మగార్ని తదేకంగా చూస్తున్నాడు.

ఆఖరి సీన్లో హీరోయిన్లా దేవుడ్ని తిడుతూ పద్యాలు పాడటంలేదు కావమ్మగారు —పటం తల్లక్రిందులవ్వలేదు — అక్కడున్న దీపం ఆరబోయి వెలగటం లేదు—భయంకరంగా వయొలిన్ శబ్దాలు, రేకుల శబ్దాలు వినబడటం లేదు.

కావమ్మ సంపూర్ణ విశ్వాసంతో, అచంచలమైన భక్తితో భగవంతుడ్ని వేడుకుంటోంది మనవడ్ని కాపాడమని.

అరుగుమీద వెంకు కళ్ళు తెరచి ఈ పాప పంకిలమైన జగత్తును చూట్టం యిష్టం లేనట్లు కళ్ళు తెరవకుండా పడున్నాడు.

క్ష క్ష క్ష

చీకటి చీలి తూర్పున ఉదయించిన ఉదయ రేఖలు విప్రుల్లపల్లి మీద పరచుకొన్నాయి. ఊళ్ళో కోళ్ళు జాతీయగీతం పాడినట్టు యిష్టం వచ్చినట్లు అరుస్తున్నాయి. పల్లె కావడంతో వూరంతా అప్పటికే హడావిగా వుంది.

కావమ్మగారు అప్పటికే చెరువులో మునిగి తడిగుడ్డల్తో భగవన్నామ స్మరణలో మునిగిపోయింది.

వీధరుగుమీద నులక మంచంలో వెంకు వొళ్ళు తెలీకుండా నిద్రపోతున్నాడు.

"కావమ్మగోరూ, కావమ్మగోరూ!"

పూజగదిలో ప్రార్ధనలో పారవశ్యం చెందుతున్న కావమ్మగారికి పిలుపు చెవిలో వినబడే సరికి సుప్రభాతాన్ని అర్ధంతరంగా ఆపి బయట కొచ్చేరు.

"ఏం సుబ్బయ్యా! ప్రొద్దుటే వచ్చేవు. నీ గేదె...."

"అదే ఆమ్మగారు మీరు చెప్పింది జరక్కుండా పోతుందా!! మీరు చెప్పినట్టు అది తూర్పునే ఎల్లిందండి. అలాగె ఎల్లి బగమంతుడి దయవల్ల మా బామర్ది వూరు సేరిపోనాదండి. సిత్రం సూడండి. మా బామర్ది కొట్టంలోనే మేత్తోందటండి. ఆడు మానావు ఆచ్చెర్యపోయి ఇదేటి!? ఈ తెల్ల మచ్చల నల్లగేదె ఈ చోటకు మొత్తంమీద మా బావకే గదా వుందని తోలుకొచ్చేసాదండి."

"నే చెప్పలేదూ స్వామి దయ కలగాలే కాని ఇవన్నీ ఓ లెక్కా!"

"అవునమ్మగారు. నేకపోతే మూడూర్లవతల మా బామర్దిదగ్గరకే పోయిందంటే నిజంగా పైన ఆయన సల్లని సూపేనమ్మా! కావమ్మగోరు మీ మేలు ఈ జనమలో మర్చిపోలేను. నా పేణం నాకు దక్కింది. మరి సెల విప్పించండి."

"ఎంత మాట నాయనా! నాదేముంది? వాడి దయ" మరోసారి దణ్ణం పెట్టుకొని శెంపలేసుకొన్నారు కావమ్మగారు.

ఆవిడ ఆనందానికి అవధిలేదు.సంతోషంతో వుక్కిరి బిక్కిరై పోయేరు. ఏం చెయ్యాలో పాలుపోలేదు. గబగబా మంచంలో వెంకుని నిద్ర లేపేరు.

బద్ధకంగా వొళ్లు విరుచుకుంటూ దుప్పటి తొలగించేడు వెంకు.

"నా పిచ్చికొండా! ఇంక నిద్ర ఏమిట్రా?!! ఇది విన్నావా!!"

"ఏది?!!" అన్నట్టు ఆవులించేడు.

కావమ్మగారి దర్శనం చేసుకోడాని కొచ్చిన అప్పన్న నమస్కారబాణం విసిరేడు.

"ఓరే! అప్పన్నా ఇది విన్నావా?!"

"ఏటమ్మగోరు అది?!—" వినయం వుట్టిపడింది.

"అదేరా! మన సుబ్బయ్య తెల్లమచ్చల నల్లగేదె లేదూ?"

"ఆఁ ఏమైంది?!—" వెంకుకి ఆదుర్దా.

"ఏమీ కాలేదు. మొన్న పోయింది కదా! అది తిరిగి తిరిగి వాళ్ళ బావమర్ది వూరే చేరిందట. యెంతదృష్టవంతుడో చూడు! క్షేమంగా యిప్పుడే దిగవిడ్చి వెళ్ళేట్ట. ఎంతైనా దాని జాతకం.... సుబ్బయ్య నా మీదుంచిన నమ్మకం...."

"బామ్మా! నువ్వు చెప్పేది....!"

"నిజంరా! ఇప్పుడే తోలుకొచ్చేట్ట వాళ్ళ బావమర్ది."

పరగడుపునే విషం పుచ్చుకొన్నట్లయింది వెంకుకి. కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగేయి. చిందరవందరగా వున్న జుట్టులోకి అప్రయత్నంగా చేయివెళ్ళింది. వున్నట్టుండి "బామ్మా!" అంటూ గట్టిగా అరిచేడు. అర్ధంకాక అయోమయంగా చూసేరు కావమ్మగారు.

మహా సంతోషంగా పెట్టె సర్దుతున్నాడు అప్పన్న.

కావమ్మగారు మెటికలు విరిచి సా... నిద్ర లేచొచ్చిన దేవుణ్ని చూసినట్టు ... త్వంతో మునిగిపోయి వెంకుని దగ్గరకు ... కొన్నారు.

వెంకు కళ్ళముందు తెల్లమచ్చల నల్ల గేదె వెకిలిగా ఇకిలిస్తూ కన్పించింది.

—జుట్టు చిక్కు తీసుకుంటూ ఎస్టీవోడు కన్పించేడు.

—మొట్టికాయలు మొట్టేడు నున్నటి గుండుమీద సదాశివం.

గబుక్కున ఇహంలోకి వచ్చేడు. నవ్వుతూ జుట్టును సర్దుతున్న అప్పన్నను—భగవన్నామ స్మరణ చేస్తున్న బామ్మను చూసి మరోసారి గట్టిగా అరిచి మంచంలోకి కూలి పోయేడు గుండు వెంకు. □

అంకితం

మంచి స్నేహానికి కొండ గుర్తు!
మంచి హాస్యానికి ఐ. యస్. ఐ. గుర్తు.
గురుడు ఆదివిష్ణుకు ఇది చిరు కానుక!

—రచయిత

సీరియల్



ఒక నిర్ణయానికి వచ్చిన మీరా నాలుగు అవుతుండగా లేచి ఇవతలకి వచ్చింది.

మీరా జడ విప్పుకొంటోంటే కాంతమ్మ అంది "పోని ఈ పూట మానేయకూడదూ."

"చెప్పేసి వస్తాను. అక్కడ వుండను" అంది. మొదటే తల్లికి చెప్పడం మీరాకి ఇష్టం

లేదు. మీరా జడ వేసుకుని తయారయి అక్కడికి వెళ్లేసరికి నాలుగున్నర అయింది.

శేఖరం అప్పుడే నిద్ర లేచినట్టున్నాడు—హాల్లో కొచ్చేడు.

మీరా తల వంచుకుని గబగబా లోపలకి వెళ్ళిపోయింది.

శాంతమ్మగారు స్టౌవ్‌దగ్గర వుంది. స్టౌవ్‌మీద నూనె మూకుడు వుంది. శాంతమ్మగారు గోధుమపిండి వుండలు చేస్తూంది.

మీరా, "మీరు లేవండమ్మా, నేను చేస్తాను" అంది. 'ఇదీ బాగానే వుంది. తను చెప్ప బోయేది చక్కగా అతుకుతుంది' అనుకుంది.

పూరీలూ, కూరా చేయడం అయినాక స్టవ్‌మీద నీళ్ళు పడేసి "టీ చేయమంటారా కాఫీయా?" అని అడిగింది.

"అబ్బాయి మధ్యాన్నం కాఫీ తాగడు. అసలు పొద్దున్న ఒక్కసారి తప్పితే మళ్ళీ కాఫీ తాగడు" అని చెప్పిందావిడ.

శాంతమ్మగారు టిఫిను తీసుకోకపోయినా శేఖరం టిఫిను తీసుకునేటప్పుడు పక్కనే కూర్చుంది. మీరా టిఫినూ మంచినీళ్ళూ టేబుల్‌మీద పెట్టేసి లోపలికి వెళ్ళిపోయింది.

అతను టిఫిను తీసుకోవటం అయేసరికి టీ తీసుకొచ్చి పెట్టి వెళ్ళిపోయింది.

శేఖరం వెళ్ళిపోయాక మీరా అక్కడికి వచ్చింది.

అప్పటికే బియ్యం కడిగి స్టవ్‌మీద పడేసింది.

శాంతమ్మ కుర్చీలోంచి లేవబోతోంది.

"అమ్మా.... మీరేమీ అనుకోకపోతే...." అని ఆగిపోయింది.

ఆవిడ మళ్ళీ కుర్చీలో కూర్చుంటూ, "ఏమిటి మీరా?" అని అడిగింది.

"మీ కసలు నాలుగురోజుల క్రితమే చెప్పాలనుకున్నాను. మీకు అప్పుడు ఒంట్లో బాగుండ లేదు. అందుకని చెప్పలేదు. మా అమ్మ బొత్తిగా లేవలేక పోతోందమ్మా! ఈరోజు పొద్దున్నా సాయంత్రం రావటం అందుకే ఆలస్యమయిందీ,"

ఆలస్యంగా వచ్చినందుకు తను యేమయినా అనుకుంటుందనుకుని మీరా బాధపడుతోం దను కుందావిడ. "దానికేం మీరా! యెప్పుడేనా పొద్దుపోకుండా వుంటుందా!" అంది.

"అది కాదండీ! ఎనిమిదింటికి రావటానికి కూడా కుదరదు. నేను ఏ తొమ్మిదింటికో వస్తే ఏం లాభం చెప్పండి."

ఆవిడ అర్థం కానట్టు చూసింది.


"జానకి పిన్నిగారు అయిదారు రోజుల క్రితం వచ్చారట—మీకు యిబ్బంది లేకుండా ఆవిణ్ణి...."

శాంతమ్మగారికి అర్థమయింది.

"ఆ, ఆవిడ యిల్లు చూస్తానందిట. జానకి తీసుకొచ్చింది" అని ఆవిడ ఆలోచించింది. నాలుగురోజుల క్రితం ఏం చెప్పలేదు. అమ్మాయి పురిటికి వస్తుంది. నీకు చేతినిండా పనే అంటే కూడా నాకు పని వుంటే కాని తోచదంది. ఇప్పుడెందుకు ఇలా మాట్లాడుతోంది? చినబాబు వచ్చి నందుకు ఏమైనా భయపడుతోందా? లేకపోతే అమ్మాయీ, చినబాబూ అదనంగా ఇద్దరుంటారు చాకిరి ఎక్కువనా? మొదట తను జానకితో చెప్పిందే! జానకి చెప్పలేదా?

"మీరా! యిలా కూర్చో!" అంది శాంతమ్మగారు శేఖరం ఖాళీచేసిన కుర్చీ చూపిస్తూ.

"చెప్పండి, ఫరవాలేదు" అంది నిలబడే.



"కూర్చో! ఎంతోకాలం కాకపోయినా నువ్వు ఇన్నాళ్ళూ ఇంట్లో మనిషిలా మసిలేవు మీరా. అది పురస్కరించుకుని నిన్ను రెండు మాటలు అడుగుతాను. నేనేమీ అనుకోను, సరిగ్గా సమాధానం చెప్పు."

మీరా గుండెలు కొట్టుకున్నాయి. ఏమిటా రెండు సంగతులు?

తల్లికోసం గుమ్మంవరకూ వచ్చిన శేఖరం గుమ్మం అవతలే ఆగిపోయాడు.

"నాలుగురోజుల క్రితమే చెప్పాలనుకున్నావు. అది నేను నమ్మను మీరా,"

మీరా తల వంచుకుంది.

"అమ్మాయి వస్తుంది, నీకు చేతినిండా పనే అంటే నువ్వేమన్నావో జ్ఞాపకంలేదా? ఇంకేదో కారణం వుంది."

మీరా ఏం లేదని చెప్పాలనుకుంది. తల్లి సుస్తీయే కారణం అనాలనుకుంది. ఆవిడలా అన్నీ గ్రహించినట్టుగా మాట్లాడేస్తుంటే భయమేసింది. శాంతమ్మగారంది మళ్ళీ, "అబ్బాయి వచ్చేడని ఏమయినా భయపడుతున్నావా? నాలుగురోజులు చూస్తే నీకే తెలుస్తుంది. అలాంటి భయాలేం పెట్టుకోకు."

మీరా పై పంటితో కింద పెదవిని రక్తం చిమ్మేలా నొక్కిపెట్టింది.

"అమ్మాయి పురిటికి వస్తుంది—పనీ అదీ యెక్కువే వుంటుంది — జీతం పెంచుతాను........"

మీరా ప్రాణం సిగ్గుతో చచ్చిపోయింది. ఛీ, ఛీ! తనేమని మానేస్తోంది—ఆవిడేం అర్థం తీసుకుంది. గబగబా అంది "అది కాదండీ! ఒక్క మనిషి వస్తే, పదిరూపాయలు ఎక్కువ అడుగుతారా ఎవరయినా. మీరు ఒక్కరూ అయితే—మీరు పూజ అయితేగాని ఏం తీసుకోరు. అమ్మాయిగారు వస్తారుకదా—ఉదయం తొందరగా రాకపోతే మీకేం సుఖం చెప్పండి. అప్పుడు మీరు ఇబ్బంది పడకుండా ఇప్పుడే చెప్తే ఆవిడని మాట్లాడుకుంటారని చెప్పానండీ .... ఈరోజు చూశారుకదా! రోజూ ఇలా వస్తే మీకేం సుఖం! నేను రోజూ తొమ్మిదింటికికూడా రాలేనేమో! అమ్మ అసలు మంచం దిగలేదండీ!"

"అందుకేనా?" అడిగింది శాంతమ్మగారు.

మీరా తప్పనిసరిగా "అందుకే" అన్నట్టు తల వూపింది.

"మీరా!"

మీరా ఆవిడ కళ్ళల్లోకి చూసే ధైర్యంలేక కొద్దిగా ముఖం ఎత్తింది.

"అదే కారణం అయితే నువ్వేం బాధపడకు."

మీరా ముఖం దించుకుంది.

మళ్ళా అందావిడ. "మొదట నిన్ను చూసి పెద్దవాళ్ళు చేసినంత నిదానంగా—బాధ్యతగా నువ్వు చేయగలవా అని అనుకున్న మాట నిజమే! కాని, ఇప్పుడు?"

మీరా ఆవిడకేసి చూడాలనుకుని, మళ్ళా విరమించుకుంది.

"నీ లాంటి మంచివాళ్ళు నాకు దొరికే వరకూ నిన్ను పంపాలని లేదు—పంపను కూడా."

'ఈవిడకి తన బాధ యెలా అర్థమౌతుంది?'

"ఇంట్లో ఏ కూతురో—కోడలో—నాకు ఒంట్లో బాగుండకపోతే ఆదరంగా చేసిపెట్టినట్లు చేస్తున్నావు."

మీరా ముఖం ఎర్రగా అయింది. అక్కడనించి పారిపోవాలనిపించింది.

"నువ్వు ఎవరూ అని ఎవరేనా అడిగితే నేనేమని చెప్తానో తెలుసా?"

మీరా గుండెలు దడదడలాడాయి.

"మాకు తెలుసున్నవాళ్ళమ్మాయి అని చెప్తున్నాను. నువ్వసలు పరాయిపిల్లగా నాకెప్పుడూ అనిపించలేదు మీరా! నువ్వలా కలిసిపోయావు."

ఇంక ఈవిడని ఒప్పించడం తన తరంకాదు. ఆవిణ్ణి ఎదిరించి—కాదని తను మానలేదు—ఈ వూళ్ళో వుండగా.

శాంతమ్మగారు కుర్చీలోంచి లేస్తూ అంది. "నువ్వు వెళ్ళేటప్పుడు కాఫీ డికాక్షను తీసి వెళ్ళు. ఫిల్టరుందిగా!"

మీరా బలవంతంగా తల వూపింది.

మీరా వంట గదిలోకి వెళ్ళిపోయింది.

'ఎలాగయినా అమ్మని వప్పించాలి. ఈ వూళ్ళో వుండగా తను రాకుండా వుండడానికి లేదు—ఆవిడ ఏ మనిషినయినా ఇంటికి పంపిస్తుంది—అది తన కసలు ఇష్టంలేదు. తన సంగతి లోకం అందరికీ తెలిసినా భరిస్తుంది—వాళ్ళెన్ని మాటలన్నా సహిస్తుంది కాని....—ఈ కుటుంబానికి మాత్రం తెలియకూడదు—తెలిస్తే తను భరించలేదు. అమ్మతో దెబ్బలాడయినా సరే ఈ వూరినించి వెళ్ళిపోవాలి.'

అమ్మ తను ఉద్యోగం చేయడానికి ఒప్పుకోక—అసలు ఈ వూరినించి కదలడానికి ఒప్పుకోనప్పుడు ఇక్కడ నిశ్చింతగా వుందనుకుంది. తల్లిని ఇంకా బాధించడం ఎందుకనుకుంది. శాంతమ్మగారికి ఇంక మనిషి ఆసరా అక్కర్లేదూ అన్నంతవరకూ తను యిక్కడే వుండాలనుకుంది.

బామ్మ అన్నట్లు ఆ దేవుడే వుంటే—తను ఇలా మొండితనంతో నిశ్చింతగా వుండడం ఇష్టం లేనట్టుంది........

ఆలోచనలో వున్న మీరా శేఖరం రావడం గమనించలేదు.

శేఖరం ఎన్నో అనుకొని వచ్చాడు. తీరా వచ్చాకా మీరాతో ఎలా మాట్లాడాలో అర్థం కాలేదు. గొంతు తడారిపోయినట్లుగా అయింది. నెమ్మదిగా కూజాలోని నీళ్ళు గ్లాసులో ఒంపుకుని కొద్దిగా తాగాడు.

మీరాతో చాలా మృదువుగా మాట్లాడాలనీ—ఆప్యాయంగా పలకరించాలనీ వచ్చాడు. తీరా వచ్చాక ఎలా పలకరించాలి ఎలా మాట్లాడాలనే సమస్యలో పడిపోయాడు.

తను వచ్చినట్టు మీరా గ్రహించలేదు అనుకున్నాడు. తనవైపు వీపుపెట్టి నిలబడ్డ మీరాని పరీక్షగా చూశాడు. సన్నగా వుండే మీరా ఇంకొంచెం సన్నబడింది—ఇంకొంచెం పొడుగయినట్టుగా కనిపిస్తోంది.

ఇదివరకు తమాషా కబుర్లు చెప్పి అరుణని నవ్వించే మీరా కాదు ఈ మీరా.

గంభీరంగా వుండే ఈ మీరాని చూస్తే ఆ రోజుల్లో మీరా అన్ని తమాషా కబుర్లు చెప్పి నవ్వించేదంటే ఎవరూ నమ్మరు.

శేఖరం వంటగది గుమ్మంవరకూ వచ్చి ఆగిపోయాడు.

ద్వారబంధంమీద చేతులాన్చుకుంటూ, "మీరా!" అన్నాడు.

మీరా ఉలిక్కిపడింది—కళ్ళు వెడల్పయ్యాయి.

భయంతో కాదు; అదురుపాటుతో—

బిగుసుకుపోయినట్టు అలాగే నిలబడిపోయింది.

ఒకసారి "మీరా" అనడానికి అతను చాలా ప్రయత్నం చేయాల్సి వచ్చింది. ఇప్పుడు అతనిలో ఇందాకటి తడబాటు లేదు.

"మీరా!" అని మళ్ళీ సాధ్యమైనంత మృదువుగా పిలిచాడు.

మీరా పలకలేదు—కనురెప్పలు మూయలేదు—వుడికే అన్నాన్ని శ్రద్ధగా తిలకిస్తున్న దానిలా నిలబడింది.

శేఖరం చొరవచేసి గడప దాటి లోపలకి రెండడుగులు వేశాడు.

"మీరా! మాట్లాడదలుచుకోలేదా?"

"..............."

"పోనీ! మాట్లాడకపోతే—నేను చెప్పింది విను."

"..............."

"నా గురించి నువ్విక్కడ మానేయనక్కరలేదు. నాలుగు రోజులపాటు వుండిపోయే వాడిని—అమ్మని చూడ్డానికి వచ్చినా నాలుగయిదు రోజులకంటే వుండను."

మీరా కదల్లేదు—మెదల్లేదు.

శేఖరం వెనక్కి తిరిగి వచ్చేశాడు.

శాంతమ్మగారు వరండా మెట్లక్రింద కుర్చీ వేయించుకుని కూర్చుంది. శేఖరానికి కూడా అక్కడే కుర్చీ వేయించింది. కానీ, శేఖరం కూర్చోలేదు. మొక్కల మధ్య తిరగసాగాడు.

మీరా అన్నీ సర్దేసి శాంతమ్మదగ్గరకొచ్చి, "నేను వెళ్తున్నానమ్మా" చిన్నగా అంది.

ఎంత చిన్నగా అన్నా ఆ మాట శేఖరానికి వినపడింది. అయినా అతను యిటు చూడలేదు.

"మధ్యాహ్నం వెళ్ళినప్పుడు సంచీ మర్చిపోయావా?" అని, "అప్పీ! అక్కడ సంచీ పెట్టేను తీసుకురా" అంది.

'ఛీ!....అతను తెచ్చినవి—అతని ఎదురుగుండానే తీసుకెళ్ళాలా?' కంపరం పుట్టింది మీరాకి.

అప్పి పరుగున వెళ్ళి తిరిగి సంచీతో వచ్చింది.

మీరా ఏదో చెప్పబోయింది. కాని శాంతమ్మగారు వినిపించుకోలేదు. "నీకు మొహమాటం

ఎక్కువ. నాకు తెలియదా? అమ్మగారికని యిచ్చేను. ఇంత సువ్వేం అనకు" అంది.

భుజాల నిండుగా కొంగు కప్పుకుని గేటు దాటుతోన్న మీరాని శేఖరం ఒక క్షణం చూశాడు. ఇంత నిర్లిప్తంగా పెద్దమనిషి తరహాగా ఎప్పుడూ చూడలేదు. అరుణని నవ్విస్తూ—తనని చూస్తూనే నిర్లక్ష్యంగా ముఖం తిప్పుకునే మీరా ఎక్కడ........

శేఖరం వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"మీరాకి చాలా మొహమాటం. పొద్దున్న పళ్ళు తీసుకెళ్ళమని ఇస్తే వంటగదిలోనే ఉంచేసింది" అంది శాంతమ్మగారు.

అది మొహమాటమో—మరేమిటో శేఖరానికి తెలియంది కాదు.

"చాలా బుద్ధిమంతురాలు—నెమ్మదస్తురాలూను! మొదట ఈ అమ్మాయి ఏం చేస్తుందిలే అనుకున్నాను. బొత్తిగా లేవలేక "సరేలే" అన్నాను—పాపం ఏం చదువుకోలేదుట" అంటూ మీరా తల్లికి ఏమని చెప్పి వప్పించి ఇక్కడ జేరిందో అన్నీ చెప్తోంది.

శేఖరం చాలా బాధపడ్డాడు! 'ఏమీ చదువుకోలేదని చెప్పి ఇక్కడ జేరిందా!!'

"ఆ నడకా అదీ—కొంచెం ఇందిర నడిచినట్టు వుంటుందిరా! మీరాని చూస్తే చప్పున నాకు ఇందిరే గుర్తుకొస్తుంది."

శేఖరం ఏం మాట్లాడలేదు. తల్లి మాటలు శ్రద్ధగా వింటున్నాడు.

ర ర ర

అప్పుడే వీధి దీపాలు వెలిగాయి. మీరా గబగబ నడుస్తోంది.

ఓ యింటిముందు "అమ్మా! ఇంత అన్నం పెట్టించండమ్మా! రెండు రోజులాయె అన్నం లేదు తల్లీ!...." మీరా చెవిని పడింది. ఆ ఇంటి ఇల్లాలు కసురుకుంది. "ఆ:. పొద్దుపోవడం భయం—పొద్దు కూకడం భయం. తయారవుతారు" అని. ఇంతలో ఓ చిన్న కుర్రాడు "ఇంకా భోజనాలవలే దబ్బీ! అలా పైకెళ్ళిరా" అన్నాడు.

ముష్టాడికి ఒళ్ళు మండినట్టుంది. "ఆ పైకా బాబూ!" అన్నాడు చేయి ఆకాశంకేసి చూపిస్తూ హేళనగా.

ఆ కుర్రాడు అర్థంకాక తెల్లబోయి చూశాడు.

ఆ ఇంటి ఇల్లాలు విసురుగా వచ్చింది. "ఆ: ఆ పైకే పో! ఛస్తున్నాం. ఒక్కళ్ళా, ఇద్దరా!" అని లోపలికి వెళ్ళి తలుపు మూసుకుంది.

"అమ్మ—దొడ్డ తల్లి. ఇంత ధర్మంచేసే తల్లే" కసిగా అన్నాడు ముష్టివాడు.

మీరా వాణ్ణి పిలిచి సంచిలోని పళ్ళన్నీ యిచ్చేసింది. వాడు చేష్ట లుడిగినట్లు చూస్తున్నాడు....

"తీసుకో! మా ఇంట్లో తినేవాళ్ళు ఎవరూ లేరు" అని గబగబా వెళ్ళిపోయింది.


"ధర్మ తల్లి. పదికాలాలపాటు చల్లగ వుండు తల్లి. ఇంట్లో తినేవోరు లేకపోతే కుళ్ళబెట్టి పారేత్తారు గాని దరమం చెయ్యరు తల్లి ...."

ఇంతక్రితం తిట్టిన నోటితోనే మీరాని నోరారా దీవించేడు ముష్టివాడు.

ఇంటికొచ్చిన మీరా—అన్నం తినకపోతే తల్లి వూరుకోదని కంచంముందు కూర్చుని తిన్నాననిపించి లేచింది.

పని అంతా అయాక వచ్చి తల్లి మంచంమీద కూర్చుంది మీరా.

"అమ్మా! మనం యీ వూరి నుంచి వెళ్ళిపోదాం...." అంది యెలాంటి ఉపోద్ఘాతం లేకుండానే.



"ఈ వేళ యేమయింది నీకు....? పోదాం పోదాం అంటూ మొదలెట్టేవు...." విసుగ్గా అంది.

"రోజూ చెప్పాలనే అనుకుంటున్నాను. ఏదో కాలక్షేపానికి—ఎంతో అంతలే అని వెళుతున్నా కాని—ఇదేం స్థిరమైన ఉద్యోగమా? తర్వాత ఉద్యోగం కావాలంటే దొరుకుతుందా? నీ యిష్టం! హైదరాబాదు అయినా సరే! పోనీ మద్రాసు వెళ్దామంటే అక్కడకే వెళ్దాం. ఆ రెండూ కాదంటే నీ యిష్టం యెక్కడికంటే అక్కడకే వెళదాం—ఈ వూరు మినహాయించి."

"ఈ వూరు కేమయింది? ఎవరూ కన్నెత్తి చూడరు—పన్నెత్తి పలకరించరు. నా ప్రాణానికి హాయిగా వుంది."

మీరాకి తల్లిమీద ఎన్నడూ రానంత కోపం వచ్చింది. "బాంక్‌లో వున్న మూడువేలూ ఎన్నాళ్ళొస్తుందని నీ ఉద్దేశం? రేపావిడ మా పిల్లలకి చదువు చెప్పక్కరలేదూ అంటే మానేయాల్సిందేగా! ఆ కాస్త డబ్బూ అయినాక—అప్పుడేం చేద్దామని," కోపాన్ని అణుచుకుంటూ విసుగ్గా అంది.

"బాచి చెప్పాడు కదూ! అప్పుడే మర్చిపోయావా? మేష్టారుకూడా చెప్పేరు. ఆ టీచరు ఉద్యోగం నీకే వచ్చేలా చూస్తానని. వాళ్ళ అల్లుడికి ఉత్తరం రాస్తానని అవసరం అయితే తను వెళ్ళి మాట్లాడి వస్తానన్నారు. బాచి కూడా వాళ్ళ నాన్నగారితో చెప్తానన్నాడు."

"వెధవ టీచరు ఉద్యోగం. నేనేం చేయను" కోపంగా అంది మీరా.

"వెధవ ఉద్యోగం ఏమిటే! ఊళ్ళట్టుకు తిరిగి చేస్తే మంచి ఉద్యోగమా? శుభ్రంగా ఇల్లుంది. ఈ వూరికి—వాతావరణానికి అలవాటు పడిపోయాం—ఇక్కడ తీరిగ్గా మన గురించి పట్టించుకునేవాళ్ళు లేరూ...."

మధ్యలోనే విసుగ్గా అంది మీరా "ఏ వూరు వెళ్ళినా నాలుగురోజులు చెప్పుకుని వాళ్ళే మానేస్తారు. దేనికో దానికి అప్లై చేస్తాను—ఈ వూరు మాత్రం నాకు నచ్చలేదు."

కాంతమ్మకి కోపం వచ్చింది. నాలుగురోజులు చెప్పుకుని వూరుకుంటారనుకుంటోంది. ఎన్నెన్ని ఆరాలు తీస్తారో—ఎన్నెన్ని మాటలంటారో దీనికేం తెలుసు—ఆ మాటలు—వాళ్ళ

చూసే చూపులూ భరించలేకా క్షణం చస్తూ యెంత నరకం అనుభవించాలో తనకేం తెలుసూ? పుస్తకాల్లో చదివినంత తేలికనుకుంటోంది. "నువ్వా పని చేసే ముందు నాకేదేనా ఇంత విష మిచ్చి చేసుకో! అన్నీ చేసి పెడుదువు గాని" పెదాలు అదురుతుండగా కోపంగా అంది కాంతమ్మ.

"అమ్మా!" ఒక్క కేక పెట్టింది మీరా.

"అవును! నా మాట ఎప్పుడు విన్నావు నువ్వు? నా బాధ అర్ధం చేసుకోవడానికేనా ప్రయత్నించేవా! నీ మొండిపట్టు నీదేకాని."

మీరా అక్కడనుంచి లేచి వచ్చేసింది.

చాలా సేపు మీరా కిటికీ దగ్గరే నిల్చుంది చీకట్లోకి చూస్తూ.

విజయ్ లేవటంతో మీరా కదిలి ఉయ్యాల దగ్గరకి వచ్చింది. విజయ్‌ని ఉయ్యాల్లోంచి లేవదీసి మంచంమీద పడుకోబెట్టి తనూ వాడి పక్కన పడుకుంది.

'తను—అరుణని తలుచుకుంటే కూడా తనకేం గుర్తుకొస్తాయోనని అరుణని కూడా తల్చుకోకుండా—ఇంత మొండిదానిలా బ్రతుకుతోంటే—తనా యింట్లోనే ఎందుకు పనికి ఒప్పుకోవాలి శాపం కాకపోతే!' శేఖరం మాటలు గుర్తుకొచ్చేయి. 'తను అక్కడ పని మానుకో వద్దట—హుఁ! తను తనింట్లో వంటమనిషిగా వుండడం—ఎంతో ఆనందంగా వుండివుంటుంది—అప్పటికేనా కసి తీరుతుందా!........' విజయ్ కదలటంతో వాడిని దగ్గరగా తీసుకుంటూ అంది:

"బామ్మ దేవుడున్నాడమ్మా! అన్యాయం చేసేవాళ్ళని దేవు డెప్పుడూ క్షమించడు. అలాగే మంచివాళ్ళకి మేలే జరుగుతుంది—కాని, సహనం ఓర్పు కావాలి అనేది. దేవుడున్నాడో—లేదో తేల్చేద్దాంరా విజయ్!" ఆ గొంతులో ఏదో కసీ—బాధా....

§ § §

శాస్త్రిగారి పెద్దకొడుకు శ్రీహరీ, కోడలు అరుంధతీ వచ్చారు. అరుంధతి వచ్చేకా గిరిజకి కాస్త కాలక్షేపం అవుతోంది. తల్లీ బాచీ దెబ్బలాడుకొంటోన్నా అదేం మనసుకి పట్టించుకో కుండా కాలక్షేపం అవుతోంది.

అరుంధతికి తల్లీదండ్రీ చిన్నప్పుడే పోయారు. ఇద్దరు అన్నగార్లు వున్నారు. పెళ్ళి చేసి పంపేశారు. అరుంధతికి నెల తప్పిందని రాసినా వాళ్ళిద్దరి దగ్గరనుంచి జవాబులు లేవు. రమణమ్మకి తెలుసు వాళ్ళు తొలి కాన్పుకి కూడా తీసుకెళ్ళరని. కోడలికి ఏమేం తినాలనుందో అడిగేది. అరుంధతి సిగ్గుపడి చెప్పేదికాదు. ఏది కావలిస్తే ,అది తింటుందని రోజూ ఏదో ఒకటి చేస్తూనే వుంది. "ఆ పిల్లకి మాత్రం ఎవరు చేసిపెట్టను. తనకి మాత్రం కోడలయినా కూతురయినా ఆ పిల్లేనాయే" అనుకుంది.

శ్రీహరి వచ్చినప్పుడల్లా బొబ్బట్లు, బెల్లం మిఠాయి, పూర్ణం బూరెలూ చేయవలసిందే! శ్రీహరి అంటే చంద్రమ్మగారికి అభిమానమే! బాచిలా ఆరాలు తీయటం గొడవ చేయడం ఏం చేయడు. అతనిది రమణమ్మలా చూసీ చూడనట్లు పోయే స్వభావం.

శ్రీహరీ వాళ్ళు రేపు వస్తారనగానే బెల్లం మిఠాయి చేసి వుంచేరు. ఇంకో నాలుగురోజులు పోయాక చంద్రమ్మగారితో అన్నాడు శ్రీహరి. "అత్తయ్యా! నాకివేళ పూర్ణంబూర్లుకావాలత్తయ్యా! మళ్ళా వెళ్ళేలోగా ఇంకోసారి చేసిపెడుదువుగాని" "దానిదేం భాగ్యంరా నాయనా! అలాగే చేస్తాలే. నీ పెళ్ళాం మాత్రం ఏం తినాలని వుందో చెప్పటం లేదురా" అందావిడ.

"ఇంక చెప్పేదేమిటే! తనకని వేరే చేసినవీ—మనకి చేసినవీ—డబల్ డబల్ కొట్టేస్తుంటే" అన్నాడు శ్రీహరి.

"తప్పురా! అలా అనకూడదూ" మందలింపుగా అందావిడ.

పొద్దున్ననగా పొలం వెళ్ళిన బాచి సాయంత్రం అయిదింటికి వచ్చేడు. మధ్యాన్నం భోజనంకూడా చేయలేదు. వస్తూనే "తినటానికి ఏదేనా వుందా?" అంటూ వచ్చాడు. అరుంధతి చెప్పింది బూర్లు చేశారని. బాచి దొడ్లోకి వెళ్ళి గబగబా కాళ్ళూ చేతులూ కడుక్కొని వచ్చేడు. పీట వాల్చుకుని కూర్చుంటూ, "వదినా! వాళ్ళంతా ఏదో పురాణంలో వున్నట్టున్నారు. నువు పెట్టు" అన్నాడు అరుధతిని. "మడి - ముట్టుకోకూడదు" అంది అరుంధతి.

"ఏ పట్టకారుతోనో తీయి. దానికేం అంటులేదు. చేత్తో ముట్టుకుంటే అంటు కాని,"

"ఛ! ఆవిడ మడిగా వున్నప్పుడు అలా ముట్టుకోకూడదు...."

"ఆవిడ వచ్చేసరికి నా ప్రాణం పోతుంది."

"అవేం మాటలు బాచీ! నేను పిలుస్తానుండు" అని చంద్రమ్మగారిని పిలవడానికి వెళ్ళింది అరుంధతి.

బాచి వచ్చేడనే సరికి చంద్రమ్మగారు అదిరిపడింది. బాచి వచ్చినట్లు ఆవిడ చూడలేదు. ఇప్పుడు తను స్నానంచేసి వచ్చేవరకూ బాచి ఆగుతాడని ఆవిడకి నమ్మకం లేదు. రమణమ్మ చెప్పనే చెప్పింది. "ఓ గిన్నెలో ఇవతల పెట్టండి. ఇవతల పెట్టినవి అయిపోయా"యని. "ఆఁ, అందరూ తినేశారుగా! ఆనక నేనే పెడతాలే" అందప్పుడు.

చంద్రమ్మగారు బాచి కళ్ళబడకుండా బావి దగ్గరకి పరుగెత్తింది. అలా గబగబా ఖంగారుగా వెళ్ళడంలో గడప కాలికి తగిలి తూలి పడబోయి ఎలాగో నిలద్రొక్కుకుంది.

"ఏం వదినా! నువ్వా అక్కడే కూర్చున్నావు. నేను ముట్టేసుకోనా?" ఇక్కడనుంచే ఓ కేక పెట్టేడు బాచి.

"ఇదిగో—వచ్చేస్తున్నాను" అక్కడనుంచే జవాబిచ్చింది అరుంధతి.

తను కూర్చున్న పీటమీద వేళ్ళతో వాయిస్తూ పాట అందుకున్నాడు బాచి "రావమ్మ చంద్రమ్మత్తా! మా బూర్ల గాధ చెప్తా" ఆఁ....ఆఁ...."

శ్రీహరి అక్కడికి రావటంతో పాట ఆపేశాడు బాచి.

నిద్రపోతున్న శ్రీహరిని అరుంధతి లేపి తీసుకొచ్చింది చంద్రమ్మగారు స్నానంచేసి వచ్చేసరికి బాచి ఏం గొడవ చేస్తాడోనని. అన్నగారు ఎదురుగా వుంటే ఎలాగయినా కాస్త దడుస్తాడు.

"ఏమిట్రా" అన్నాడు శ్రీహరి.

"ఏముందీ? చంద్రమ్మత్తయ్య కోసం తపస్సు చేస్తున్నాను" కోపాన్ని అణుచుకుంటూ అన్నాడు.

"ప్రత్యక్షమయిందా?" నవ్వాపుకుంటూ అడిగాడు శ్రీహరి.

"ఆ ఈశ్వరుడన్నా ప్రత్యక్షమవుతాడేమోగాని—ప్చ్, ప్చ్" చప్పరించేశాడు.

శ్రీహరికూడా కూర్చుని బాచిని పొలం సంగతులు అడుగుతూ మాటల్లోకి దించేడు. అన్నగారు అడిగిన దానికి సమాధానం చెప్తున్నాడు కాని బాచికి నీరసంతో చాలా తిక్కగా వుంది. అస్తమానూ ఇటొచ్చి-అటొచ్చి ఏదో ఒకటి తింటూ తిరిగే బాచి పొద్దున్న కాఫీనీళ్ళు తప్పితే ఏం ఆహారం తీసుకోలేదు.

చంద్రమ్మగారు తడిబట్టతోనే అవతల గుమ్మంలోంచి వంటగదిలోకి వచ్చింది. పొద్దుటినించీ అన్నం తినలేదు కాబట్టి అన్నం తింటాడో లేక బూర్లే తింటాడో అర్ధంకాలేదావిడకి. కాని, అడిగే ధైర్యంలేక ఓ పళ్ళెంలో బూరెలు పట్టుకొచ్చి బాచిముందు పెట్టింది.

"నా తపస్సుకి మెచ్చి, చంద్రమ్మత్తయ్య ప్రత్యక్షమయింది. మీక్కూడా ఏమేం కావాలో

ఇప్పుడే కోరేసుకోంటి. అదృశ్యమయిందంటే మళ్ళా ప్రత్యక్షమవడానికి కొన్ని గంటలు పడుతుంది" అన్నాడు బాచి.

"ముందు నువు తిను" అన్నాడు శ్రీహరి. బాచి అన్నమాటకి చంద్రమ్మగారికి కోపం వచ్చినా అసలే ఆకలిమీద వున్నాడని నిగ్రహించుకుంది.

బాచి వంటగదికేసి ముఖం తిప్పి అన్నాడు "అత్తయ్యా! ఆ గిన్ని ఇక్కడ పెట్టివెళ్ళు. ఇంక ఆలస్యాన్ని భరించలేను. ముట్టేసుకుంటాను. ఆ తర్వాత నన్ను తిట్టుకోవద్దు" చంద్రమ్మగారు పళ్ళు నూరుకుంది.

"నువ్వు తిను ముందు. నీకు కావలసినవి వేస్తుంది" కసురుకున్నట్టుగా అన్నాడు శ్రీహరి.

"ఆఁ మరేం లేదు. అత్తయ్యకి ప్రతీ బూరెలోనూ మావయ్య కనిపిస్తూంటాడు—గుటుక్కున మింగేస్తుంది. అంతకన్న ఏం లేదు."

అరుంధతికి నవ్వాగక—నవ్వితే బాగుండదని కొంగు అడ్డంపెట్టుకుని నెమ్మదిగా అక్కడనించి జారుకుంది. గిరిజ ఎప్పుడో అక్కడనించి వెళ్ళిపోయింది. శ్రీహరికి నవ్వాగలేదు. అతి ప్రయత్నంమీద నవ్వాపుకుంటూ అన్నాడు "ఏమిట్రా మాటలు? చిన్నాపెద్దా లేకుండా" మందలించేడు.

"కావాలంటే అత్తయ్యనే అడుగు. తనే అంది ఎన్నోసార్లు—మామయ్యని తనే మింగిందట!"

చంద్రమ్మగారు ఇంతెత్తు ఎగిరింది. "విన్నావురా వాడి మాటలు? నేనంటే వాడికి బొత్తిగా పడదు...." అంటూ బూర్లె గిన్నె పట్టుకొచ్చి అక్కడ పడేసి గట్టిగా కేకలు మొదలెట్టింది.

శ్రీహరి యెంత వారించినా, బ్రతిమలాడినా ఆవిడ పెద్దగా ఏడుస్తూ నానా కేకలూ పెట్టింది.

రమణమ్మ ఈ కేకలకి దొడ్లో చేస్తున్న పని అక్కడే వదిలి పరుగెత్తుకొచ్చింది. చంద్రమ్మగారు ఆ విసురు మరదలిమీదికి విసిరింది. "ఇడిగో రమణమ్మా! నీ కిష్టం లేకపోతే నువ్వే చెప్పచ్చు—లేకపోతే తమ్ముడి చేతన్నా చెప్పించవచ్చుగా! వాడినెందుకూ నా మీదకు ఉసిగొలపడం?" అని నానా మాటలూ అంది.

రమణమ్మ "నాకేం తెలవదు—నా మాట నమ్మండి" అన్నా ఆవిడ వినిపించుకోలేదు. "వాణ్ని రానీ! అసలు సంగతి తేల్చుకుంటాను" అంటూ వీధి అరుగుమీద కూర్చుంది.

రాత్రి తొమ్మిది అయింది. అప్పటికే వూరు మాటుమణిగి చాలా సేపయింది. ఎవరెంత బ్రతిమలాడినా చంద్రమ్మగారు లోపలకి రాలేదు. పచ్చి మంచినీళ్ళు గొంతుకలో పోసుకోలేదు. రమణమ్మ కంగారుపడిపోయింది భర్త వచ్చేక యేం గొడవ జరుగుతుందోనని. గిరిజ యేడుస్తూ లోపల కూర్చుంది.

ఆ పూట యెవరికీ భోజనాలు లేవు.

తల్లి అలా వుందని గిరిజ అన్నం తినకుండా ఏడుస్తూ కూర్చుంది. ఆడపడుచు ఏం తిన తినకుండా అలా కోపంగా వుంటే తనేం తింటుంది? రమణమ్మ తినలేదు. అత్తగారూ వాళ్ళూ తిననప్పుడు తను తినటమేమిటని అరుంధతి తినలేదు.

కోడల్ని రమణమ్మ యెంతో బ్రతిమలాడింది. "నువ్వు ఒట్టి మనిషివి కూడా కావు. నువ్వు తినమ్మా! అలా తినకుండా వుండకూడదు" అని.

"నా కసలు ఆకలి లేదండీ!" అని తప్పించుకుంది.

సాయంత్రం చంద్రమ్మగారు కేకలు వేసినప్పుడు యెక్కడికో వెళ్ళిపోయిన బాచి యింకా రాలేదు.

పదిగంటలు కావస్తుండగా శాస్త్రిగారు వచ్చేరు. భర్తకి కాళ్ళకి నీళ్ళిచ్చి, ఆయన కాళ్ళు కడుక్కొంటోంటే రమణమ్మ భర్తకి అంతా చెప్పింది.

శాస్త్రిగారి ముఖం కోపంతో జేవురించింది. "ఏడీ! వాడేడీ?" కోపంగా అడిగారు.

"అప్పుడు వెళ్ళినవాడు యింతవరకూ రాలేదు" అని చెప్పింది. కొడుకు ఎక్కడికెళ్లాడోనని ఆవిడకోపక్క భయంగానే వుంది. ఇలాంటప్పుడు యేం అనకూడదని—అన్నా బాగుండదని ఆ బాధని అణుచుకుంది.

శాస్త్రిగారు వచ్చేముందే చంద్రమ్మగారు లోపలకి వచ్చి మండువాలో కిందనే కొంగు పరుచుకుని పడుకుంది.

శాస్త్రిగారు వచ్చి, "అక్కయ్యా!" అని అభిమానంగా పిలిచారు. ఆవిడ వినిపించినా పలకలేదు. ఆయన అక్కగారి పక్కనే కూర్చున్నాడు.

రమణమ్మ తట్టి లేపింది "మీ తమ్ముడొచ్చారు" అంటూ.

"అక్కయ్యా!" మళ్ళీ పిల్చేడాయన.

"ఊఁ" అందావిడ,

"పడుకున్నావేం?"

"ఏం లేదు" ముక్తసరిగా అంది.

"ఉట్టి కింద ఎందుకు పడుకున్నావ్! లే ముందు."

ఆవిడింక ఉగ్గబట్టుకోలేకపోయింది. ఒక్క ఉదుటున లేచి కూర్చుంది. "ఒరే! శాస్త్రీ! నన్నెక్కడికేనా పంపేరా!" అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ.

శాస్త్రిగారు భార్యని వెళ్ళమన్నట్లు సౌజ్ఞ చేశారు. రమణమ్మ వెళ్ళిపోయింది. "ఏమిటి, ఏం జరిగింది?" ఆతృతగా అడిగాడు.

"నీ భార్య చెప్పలేదూ?"

"వాళ్ళు చెప్పటంకాదు—నువ్వు చెప్పు."

ఆవిడంతా పూసగుచ్చినట్టు చెప్పి, "ఇదిరా వరసా. క్షణం పడదు నేనంటే! నా రాత యిలా తగలడింది గాబట్టి ఇన్ని మాటలు పడాల్సొస్తోంది" కళ్ళు తుడుచుకుంటూ అంది.

"వాడి సంగతి నేను చూసుకుంటాను. నువ్వు వాడి మాటలేం పట్టించుకోకు! అదేమన్నా అందా, చెప్పు! అసలు నువ్వెవరి మాటా లెక్కచేయద్దు! నా మాటే నీకు లెక్క."

"అబ్బే! అది నన్నేమీ అనలేదురా!" అంది. సాయంత్రం ఆవేశంలో మరదలిని అన్నందుకు ఆవిడ బాధపడకపోలేదు.

"అక్కయ్యా! నాన్నకి నేను మాట ఇచ్చేను నిన్ను ప్రాణంలా చూసుకుంటానని. అలాగే చూస్తున్నాను. చూసుకుంటాను కూడా. మాకు మాత్రం మా పెద్దవాళ్ళు ఎవరున్నారు నువ్వుగాక! నేనుగాని—అదిగాని మాకు తెలియకుండా నీకేమన్నా కష్టం కలిగిస్తే మొహాన అడిగేయి—గుంట వెధవ వాడి మాటలు లెక్కేమిటి! వాడు రాగానే కనుక్కుంటాను. లే ముందు. నువ్విలా పడుకున్నావని అందరూ అభోజనమే!" అన్నారు.

చంద్రమ్మగారికి తమ్ముడి మాటలతో మనసుకి వూరట కలిగి, ధైర్యం వచ్చింది. "గుంట వెధవ! వాడి మాటలు ఎవడికి లెక్క" అనుకుంది.

తర్వాత భర్తతో అంది రమణమ్మ. "వాడిని ఎదో ఒక పనిలో పెట్టాలండీ! వూరికే ఇంట్లో కూర్చుని ఎదో ఒహటి వాగుతాడు."

"మనం అనుకోగానే పనులు మనముందుకి వస్తాయా?" విసుగ్గా అన్నాడాయన.

"జమీందారు గారబ్బాయి వచ్చేడన్నారు? అతన్ని అడుగుతానన్నారు అడగలేదా?"

"ఏదీ! మొన్ననేగా వచ్చిందీ! నాలుగు రోజులు పోయాక చెప్దామనుకుంటున్నాను."

"ఎంత చిన్నపనయినా సరే బాబూ! చేతినిండా పనిలేకపోతే కష్టమే" అందావిడ. ఆయనేం మాట్లాడలేదు.

(సశేషం)

కురూపి

చెల్లూరి సీతారాజేశ్వరరావు

అంబిక సముద్రం స్నానం చేసి వచ్చేసరికి జావకారిపోయింది. మూడు మైళ్ళు నడక, పైగా వుప్పునీటికి తల భారంతో యింటికి రాగానే అలసటగా చాపలో వ్రాలిపోయింది. దాసరథి టిఫిన్ తీసుకురావడానికి బజారుకు పోయాడు. మేనక తడి బట్టలు గోడమీద ఆరవేస్తోంది. "ఏం చేస్తున్నావే!" అంబిక పిలుస్తూనే రాగం తీసింది. అది మేనకకి విని పించలేదు.

"ఎక్కడ దిగమారేవే?'' తిరిగి విసుగ్గా కేక పెట్టింది.

మేనక భయంగా వచ్చింది. "పిలిచావా వదినా?"

"పిలవకుండా వచ్చే ముఖమా నువ్వు? పాపమ్మగార్ని అడిగి కాసిని మంచినీళ్ళు తీసుకురా. ప్రొద్దుటే గొంతుక తడారి పోతోంది."

మేనక వెళ్ళింది.

అంబికకి ఎప్పటినుంచో అంతర్వేది తీర్థానికి వెళ్ళాలని వుండేది. కాని ఎప్పటి కప్పుడు ఏదో అవాంతరమే. ఈ సంవత్సరం యింటి ప్రక్కవారందరూ బయలుదేరడంతో మొగుణ్ణి ప్రయాణం చేయించింది.

"చిన్నాకి రాణీకి పరీక్షలు వస్తున్నాయి కదే!" అన్నాడు దాశరధి.

"ఇంకా నెలకు పైగా వున్నాయి పరీక్షలు. వా పిల్లలు చదవకపోయినా ప్యాసవుతారు. దగ్గరున్న క్షేత్రాలే వెళ్ళ రాలేకపోతున్నాం" అంటూ సణిగింది.

ఇక దాశరధి ఒప్పుకోక తప్పలేదు. పిల్లలు కూడా ప్రయాణమయ్యారు. దాంతో మేనకని కూడా తీసుకురాక తప్పలేదు.

దశమిరోజు మధ్యాహ్నానికే అంతర్వేది చేరుకున్నారు. అప్పటికే బంధువుల యిల్లు జనంతో కిక్కిరిసిపోయి వుంది. దాశరధి మీద గౌరవంతో యింటాయన చిన్న వసారా యివ్వ గలిగాడు వీరికి.

అంబికకి తీర్థానికి ప్రయాణమైన సరదా యిప్పుడు లేదు. ఆ జనం రాపిడితో ఆమె వుక్కిరిబిక్కిరయింది.

ఎలాగో రాత్రి కళ్యాణం చూడగలిగింది.

తెల్లవారుఝామునే అంతా సముద్ర స్నానానికి తరలి వెళుతున్నారు. అంబిక తను రానంది నడవలేక.

"బాగుంది. యిక రావడం ఎందుకు?" అన్నాడు దాశరధి.

"సముద్రస్నానం చేస్తేగాని పుణ్యం లేదం డోయ్!" ఇంటావిడ హెచ్చరించింది. నలుగురూ వెళ్ళడంతో మానలేక 'విధి'గా బయలుదేరింది.

దాశరధి మరచెంబుతో కాఫీ, టిఫిన్ పొట్లాలు తెచ్చాడు. రాణి ఏడుస్తూ తల్లి దగ్గరికి వచ్చింది-తీర్థంలో ఎవరో ఆమె కాలు నొక్కేశారు.

"ఎవని వెళ్ళావ్? అత్తని కొబ్బరినూనె రాయమను?" అంబిక కూతుర్ని ఓదారుస్తూ అన్నది.

"మీరిద్దరూ తీసుకోండి. మేం తిన్నాం అక్కడ. కాఫీలు ఏకంగా పోయించుకు



వచ్చాను" దాశరధి మరచెంబు విప్పుతూ అన్నాడు.

అంబిక టిఫిన్ పొట్లాం విప్పి ఆశ్చర్య పోయింది. "ఇవి ఇడ్లీలా?''

"ఇది అంతర్వేదని మరచిపోకు. పచ్చగడ్డి పచ్చడిచేసి పెట్టినా క్షణాలమీద అమ్ముడయి పోతుంది. ఆకలికి అదే అమృతం."

అంబిక బలవంతంగా తినసాగింది.

"తొందరగా తెమలండి. తీర్థం చూసి వద్దాం" అన్నాడు దాశరధి.

మేనక తయారుగానే వుంది. చెదిరిన ముంగురులను అద్దంలో చూచి సవరించు కుంటోంది.

"తిరిగింది చాలు. ఇంకా ఎందుకులెండి. నాకసలు ఏమాత్రం ఓపిక లేదు" అంది అంబిక బెడ్డింగుమీద తల ఆన్చి పడుకుని.

"ఇంత దూరం వచ్చి యిక్కడ పడుకుం దుకా? నడు....మళ్ళీ మళ్ళీ వస్తామా?"

తిరిగి ఆ జనంలోకి పోవడానికి అంబిక సుముఖంగా లేదు. దాశరథి అదిగమనించి బల వంత పెట్టలేదు. "నువ్వు రా మేనకా!"

"ఎందుకది? ఏం చూస్తుంది? మీరు ఎటో వుంటారు. ఏ కొంటె వెధవో దాని మెడలోది త్రెంపుకుపోతాడు."

వదిన వద్దనటంతో మేనక నిరాశపడి పోయింది. తీర్థంలో మట్టిగాజులు, పూసలు, రంగు దారాలు కొనుక్కోవాలని వుబలాట పడింది. 'వెళతాను' అనలేకపోయింది వదిన ముఖం చూసి. అన్నగారికేసి బేలగా చూసింది.

దాశరధికి ఏం తోచలేదు. చెల్లెలిని తీసుకు వెళ్ళాలనే వుంది కాని అంబికతో కొత్తచోట పేచీ పడడానికి అంగీకరించలేకపోయాడు.

"సిగరెట్లు తెచ్చుకు వస్తాను" అని బయ టకి తప్పుకున్నాడు.

మేనక ఖాళీగా వుంటే అంబికకి తోచదు. "విసనకర్ర వుందేమో అడుగు పాపమ్మ గార్ని."

మేనక అసహనంగా వెళ్ళి విసనకర్ర తెచ్చింది.

"తెచ్చి నా ముఖాన తగలెయ్యక్కర్లేదు. కాస్సేపు విసురు. బుట్టబొమ్మలా తిరిగి రావ డానికి నీకే నెప్పీ వుండదు. ఏదయినా పని చెప్పేసరికి మూలుక్కుపోతావ్."

చల్లగాలికి నిద్ర పడుతూండటంవల్ల అంబిక దండకం ఆపుచేసింది. ఆమె నిద్ర లేచేసరికి దాశరధి వచ్చాడు.

"భోజనాలు వడ్డించేస్తున్నారు నడవండి."

"మేనకా! వాళ్ళని లేపు" సబ్బు తీసుకుని పెరటిలోకి వెళ్ళింది అంబిక.

వీళ్ళు సత్రము దగ్గరకి వెళ్ళేసరికి యింకా విస్తర్లు వేసే ప్రయత్నంలో వున్నారు.

"వడ్డించేస్తున్నారని చెప్పారు?" భర్తని నిలేసింది.

"నీ ముస్తాబుతో యింకా లేటవుతుందని" దాశరధి నవ్వాడు.

పన్నెండు గంటలు దాటింది. సత్రం జనంతో నిండుగా వుంది. పరిచయస్థులు గుంపులుగా ఏర్పడి తీర్థం విశేషాలు చెప్పు కుంటున్నారు.

"ఎప్పుడొచ్చావు?" సామంతరావు దూరా న్నుంచే పల్కరించాడు.

"నువ్వటయ్యా .... ఈయన ఎక్కడ ఖాళీగా వుందో చూసివస్తానని వెళ్ళారు. ఎక్క డికిపోతే అక్కడే కూర్చుంటారాయె!" అంది అంబిక.

"మీరు చాలా అలసటగా కనిపిస్తున్నారు" ఆమె గుణం తెలుసు కాబట్టి సామంతరావు సానుభూతిగా అన్నాడు.

"ఏం తీర్థమోనయ్యా, పేలాపుగింజలా అయిపోయాను."

దాశరధి రానే వచ్చాడు. "నువ్వు కూడ సత్రముకి రావడమేమిట్రా? అవమానం....అవ మానం."

"దీని కమిటీలో నేనూ ఒక మెంబర్ని. రాకపోతే ఒప్పుకుంటారా?"

సామంతరావు స్నేహితుడి కుటుంబాన్ని పందిరిలోకి తీసుకువెళ్ళి జాగా చూపించాడు. భోజనాలయ్యేసరికి రెండయింది.

"ఇంకా వుంటారా?" సామంతరావు అడిగాడు.

"నయం, బస్సుకి వెళిపోతున్నాం" అంది అంబిక.

"అంటే వుండిపోతున్నారన్న మాట."

"అదేమిటి?" దాశరధి అడిగాడు.

"ప్రొద్దుట వెళ్ళినవార్కే యింకా టిక్కెట్లు దొరకడం లేదు. ఇప్పుడెళ్ళిన మీకెలా దొరుకుతాయి?"

"పోనీ లాంచీకి పోతాం" అంది అంబిక.

"అక్కడా యిదే తంతు."


"భయపెట్టేయకురా."

"అభయం యిస్తున్నానుకదా! మూడు గంట లకి నా బండిమీద పోదాం."

"ఏం బండి?" చిన్నా వుత్సాహంగా అడి గాడు.

"రెండెడ్ల బండి."

అంబిక నవ్వుతూ అడిగింది "ఎన్ని రోజు లకు వెళతాం?"



"మీరు బండి ఎక్కాక నవ్వితే ఒప్పుకుం టాను."

అంబిక సరేనంది. ఇంటికి నడిచారు. పిల్లలు, మేనక సామాను సర్దడంలో నిమగ్న మయ్యారు. దాశరధికి బండిమీద పోవడం యిష్టం లేదు. బస్సు స్టాండుకి పోయివచ్చాడు. ఆ క్యూ చూసి భయపడిపోయాడు. బండి మీద వెళ్ళడమే బాగనిపించింది.

సామంతరావుకి ఏదో పని తగలడంవల్ల బండి బయలుదేరడానికి ఆలశ్యమైంది. ఎండ బాగా తగ్గాక అయిదు గంటలకి బండి బయలు దేరింది. సామంతరావు తొట్టిలో కూర్చున్నాడు. కబుర్లు చెప్పడానికి వీలుగా అంబిక దగ్గర్లో కూర్చుంది. ఆమె పై అంతస్థువారితో ఎంతో స్నేహంగా చొచ్చుకుపోగలదు.

కోడెవయసు గిత్తలు మువ్వల శబ్దంతో బాణంలా దూసుకుపోతున్నాయి. చల్లటి గాలి తగులుతూండడం వల్ల ప్రాణాలు సుఖంగా వున్నాయి.

"ఈ మధ్య మా వూరు రావడం లేదే మిటి?" అంబిక అడిగింది.

"వస్తే రాకుండా వుంటానా? దాబా కట్ట డంలో ఖాళీ దొరకడం లేదు."

మలికిపురంవచ్చింది "కాఫీ త్రాగుదామా?" సామంతరావు రోడ్డువార బండి ఆపి అగేడు.

"టిఫిన్‌కి కూడా సిద్ధమే" దాశరధి బండి దిగాడు.

సామంతరావు ఏం కావాలో అందర్నీ అడి గేడు. మేనక తనకేం వద్దంది. ఆమెకి అతడ్ని చూడటమే వెలపరంగా వుంది.

ఎనిమిదింటికి రాజోలు వచ్చారు.

"మీరీ రాత్రికి మా యింటికి రావాలి" సామంతరావు బలవంత పెట్టాడు.

సమాధానం చెప్పవలసిన బాధ్యత తనకు లేదని దాశరధి మాట్లాడలేదు. అంబిక అంగీక రిస్తూ "రేపు మాత్రం వుండమనకుస్మీ. పిల్లల చదువులు పోతాయి" అంది.

బండి పాత పెంకుటింటి ముందు ఆగింది. బండి చప్పుడు విని రావమ్మ తలుపు తీసింది.

"మామ్మా వేడినీళ్ళు పెట్టు ముందర" సామంతరావు పురమాయించాడు.

అందరి స్నానాలు పూర్తి అయ్యేసరికి రావమ్మ వంట పని కూడ పూర్తి కావచ్చింది. వెచ్చటి భోజనం పడేసరికి నిద్ర ముంచుకు వచ్చింది అందరికీ.

"తెల్లవారితే వుండరాయె—కొత్త యిల్లు చూద్దురుగాని రండి."

మేనక కదలలేదు.

పెంకుటింటికి పడమరగా కొత్త డాబా ముస్తాబు చేసుకుంటోంది. కొత్తరంగులు వింత వాసన వేస్తున్నాయి.

"బాగుందయ్యా! గృహప్రవేశం ఎప్పుడూ?" అంబిక అడిగింది.

"వచ్చే నెలలోనే. మీరు తప్పక రావాలి."

వాళ్ళ సంభాషణంలోకి దిగేసరికి దాశరధి, పిల్లలు నిద్రకి ఆగలేక జారుకున్నారు.

"ఇల్లు కట్టావు. ఇంటివాడివికా మరి" అంబిక అన్నది.

"నాకు పిల్లనెవరు యిస్తారండీ?"

అది నిజమే. సామంతరావుకి పాతిక ఎకరాల ఆస్థి వుంది. తల్లీ తండ్రీ లేరు. రావమ్మనే దూరపు బంధువు వండిపెడుతోంది.

అతడికి పాతికేళ్ళు వుంటాయి. నల్లగా వుంటాడు. లావుగా వుంటాడు. బట్టతల, ముఖంమీద మచ్చలు. క్రింద పెదవి లోపలికి త్రోసుకుపోయి వుంటుంది. అతడి ఆస్థికి ఆశపడి కొన్ని బీద సంబంధాలు వచ్చినా అవి అతడికి యిష్టం లేదు.

"మా మేనకని చేసుకో!"

అంబిక మాటలకు విస్తుపోయి చూశాడు.

"కట్నం కానుకలు వుండవు మరి" విషయం పూర్తి చేసింది అంబిక.

"మేనకే నాకు కట్నం" సంతోషం వెలిబుచ్చాడు.

అంబిక భారం తగ్గింది.

2

పిల్లిని అడిగి గంట కట్టరు. అంబిక అదే చేసింది ఇంటికి రాగానే. ఆ కుటుంబం యొక్క కళ్ళెం ఆమె చేతిలో వుంది. అందుకే బండి ఆమె యిష్టప్రకారం వెళుతుంది. ఆడపడుచు పెళ్ళి చవకగా అయిపోవడం కావాలి అంబికకి. సామంతరావు సంబంధం ఆ వీలు కల్పిస్తోంది.

ముహూర్తాలు వెదకమని భర్తకు పురమాయించింది.

"సామంతరావుకా?" దీర్ఘంతీస్తూ అన్నాడు. "ఏం ఏ మహారాజునో తీసుకు వస్తారా? వున్న నాలుగు రూపాయలు చెల్లెలి పెళ్ళికి తగలేసి మాకు చిప్పనిద్దామని వుందా?" కళ్ళెర్ర జేసింది.

"దాన్ని కూడ ఒక మాట అడుగుదాం."

"ఎందుకుట? సామంతరావు సంబంధం మన ముఖాలకి చేదుగా వుందా? లక్ష రూపాయలు కట్నం యిచ్చినా చెయ్యగలమా? మగవాడు ప్రయోజకుడు కావాలా? అందాన్ని కొరుక్కు తింటామా?"

దాశరధి భార్య ముందు కోర్టుకి వచ్చిన కొత్తలాయరులాంటి వాడు. వెంటనే ముహూర్తం పెట్టించాడు. అప్పుడు తెల్సింది మేనకకి.

"వదినా!" బాధగా ఆక్రోశించింది యిష్టం లేనట్లు.

"పిచ్చివేషాలు వెయ్యక. పెళ్ళి మా యిష్టం. మాకు తోచింది చేస్తాం. నీ గొంతెమ్మ కోరికలు తీర్చడానికి మాకు శక్తిలేదు" అంబిక గదమాయించి పడేసింది.

పెళ్ళి ప్రయత్నాలు జరిగిపోతున్నాయి. సామంతరావు పెళ్ళి ఖర్చుకూడా పెట్టుకుంటాననడం అంబికకి తృప్తి యిచ్చింది. అట్టహాసంగా ఏర్పాట్లు చేయించసాగింది.

తల్లిలేని పిల్లయినా మంచి సంబంధం చేస్తోంది.... అన్నారు అంబికవైపు వారు.

"కాకి ముక్కుకి దొండపండు." యితరులు పెదవి విరిచారు.

"కక్కుర్తిపడి చేస్తోంది" అన్నారు గిట్టని వాళ్ళు.

ఎవరేమన్నదీ అంబికకి తెలుస్తోంది. ఆమె మాటలకి భయపడే మనిషి కాదు. తోచిన పని చేసుకుపోవడం ఆమె తత్వం.

పెళ్ళయిపోయింది.

రాత్రి వూరేగింపుకి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముత్యాలపల్లకి తయారయింది. బాణసంచా మ్రోగుతోంది చెవులు చిల్లులు పడేలా.

"మేనకా! తయారయ్యావా?" అంబిక లోపలకి వచ్చింది.

మేనక పడుకుని వుంది. వదిన కంఠం వినిపించినా లేవలేదు. అంబిక మంచం దగ్గరకి వచ్చింది. "ఇంకా యిలాగే పడుకున్నావా? ఓం కూర్చుకో.... అవతలవాళ్ళు వూరేగింపుకు సిద్ధంగానే వున్నారు."

"నా కిష్టం లేదు."

"ఏమయినా పిచ్చి పట్టిందా?" అసహనంగా అరిచింది.

"నాకేం పట్టలేదు" అంది నిర్వికారంగా. నీకేమయినా పట్టిందేమో చూసుకో అన్నట్లు చూసింది.

మేనక ఎదిరించడం ఆశ్చర్యంగా వుంది. అవమానంగా వుంది. ఎప్పుడు ఒదిగి వుండాలో ఆమెకి బాగా తెల్సు. "అలా పేచీ పెడితే ఎలా చెప్పమ్మా! ఇప్పుడు కాదంటే అంతా నవ్వుతారు. ఏ చీర కట్టుకుంటావు చెప్పు?" అనునయంగా అడిగింది.

మేనక మూగనోము పట్టింది.

అంబిక ఆగ్రహం పట్టలేకపోయింది. పిచ్చిగా కేకలు వెయ్యసాగింది. దాశరధి, సామంతరావు వచ్చారు.

"రెండు వీధులు తిరిగి వచ్చేద్దాం చెల్లాయ్" దాశరథి బుజ్జగించాడు.

"నేను రాను."

కొత్త చెల్లెల్ని చూస్తున్నాడు దాశరధి.

"ఆవిడ కిష్టం లేనప్పుడు ఎందుకు? మానేద్దాం" సామంతరావు సమస్యని పరిష్కరించి వెళ్ళిపోయాడు.

"నీలాంటి ముఖానికి ముద్దులు కూడానూ! ఛీ...." అంబిక సాధించసాగింది.

"ఇందాకట్నుంచి అరచి అలసిపోయావు వదినా! పోయి విశ్రాంతి తీసుకో!" అంది మేనక వ్యంగ్యంగా.

అంబిక హతాశురాలయింది. నేల తన్నుతూ కదిలింది.

నవ్వుకుంది మేనక.

ఈ పెళ్ళితో ఆమె కన్నె కలలు చెదిరిపోయాయి. ఇప్పటి దాకా పెళ్ళి ఒక మధురమైన కల. మేనక చదువు హైస్కూలుతో ఆగిపోయినా, నవలలు, సినిమాలనుంచి సంస్కృతి నేర్చుకుంది. తన అందానికో హీరో దొరక్కపోడని ఆమె విశ్వాసం. సామంతరావు భార్య కాకుండా తప్పించుకోవాలని చూసింది. తప్పలేదు. దగాపడిపోవడంతో ఆమెలో విప్లవం రేగింది.

మర్నాడు శోభనం!

అంబిక బలవంతంగా ముస్తాబు చేయించి మేనకని గదిలోకి పంపించింది. సామంతరావు మంచంమీద తాంబూలం నములుతున్నాడు.

భూతంలా కనిపించాడు ఆమెకి. కాలు కదపలేకపోయింది రోతగా. సామంతరావు దిగి దగ్గరగా వచ్చి భుజం మీద చెయ్యి వేసి "ఎందాక నించుంటావు?" అన్నాడు.

విద్యుద్ఘాతంలా తగిలింది ఆమెకి. విదిలించుకుని దూరంగా జరిగి "నన్ను ముట్టుకోవద్దు" కోపంగా అరచింది.

"ఆడవారి మాటలకి అర్థాలు వేరులే!" ఆమెని మంచం దగ్గరికి తీసుకుపోయి త్రోశాడు. మేనక వేగిరం లేచి కూర్చుంది.

అతడికేసి చూడలేకపోతోంది. ఈ మృగం తన భర్తా? ఆ కన్నె హృదయం భగ్గుమంది. పులిపంజా తగిలిన మేకలా వ్యధపడిపోయింది.

"ఈ పెళ్ళి నీకిష్టం లేదుకదూ?" సామంతరావు అడిగాడు.

సమాధానం చెప్పలేదు.

"మీ వదిన బలవంతం చేసిందా?"

....

"ఎవర్నయినా ప్రేమించావా మేనకా?"

"ఈ చెత్త ప్రశ్నలకి నేను జవాబు చెప్పను. మీరంటే మాత్రం నా కసహ్యం" దిండు, దుప్పటి తీసుకుని మంచం దిగింది.

సామంతరావు చేయి జాపేడు! చీరకొంగు అందింది. మేనక వెనక్కి తిరగకుండా ఎడం పాదం ఎత్తి నిలబడింది. గాజులు, మువ్వల పట్టాలు సంగీతం పాడేయి.

"ఈ అందాన్ని దప్పరిస్తూ కూర్చోమంటావా మేనకా?"

మేనక చీరకొంగు లాక్కుని దూరంగా దుప్పటి వేసుకుని పడుకుంది. సామంతరావు కాస్సేపు ఆలోచనగా వుండిపోయాడు. మేనక

అందం అందని మిఠాయిలా వుంది. నెమ్మదిగా లేచి ఆమె దగ్గర కెళ్ళాడు. శోభనం ముస్తాబుతో శోభాయమానంగా వుంది మేనక. అమె అందం అలంకరణతో ద్విగుణీకృతమైంది.

నది గట్టుమీద వున్న చెట్టుయొక్క పువ్వు నీళ్ళపై పడి ప్రవాహంపై ప్రయాణించడంలో గల సుందరత మేనకలో వుంది. సంధ్య వెలుగులో తొలకరి వరిచేల సముదాయం యొక్క కాంతి మేనకలో వుంది. వర్షరుతువులోని వెన్నెల రాత్రి కదలాడే మేఘం యొక్క తీక్షణత ఆమెలో వుంది.

వాటికి వారసుడుగా, భర్తగా కోరుకోవడం సామంతరావు తప్పు కాదు. నడుంమీద చెయ్యి వేశాడు. రివ్వున లేచింది. "నన్ను ముట్టుకోవద్దని చెప్పాను. మీ వునికి భరించడం నా వల్లకాదు. ఈసారి మీ స్పర్శ తగిలితే ఈ చీరతోనే వురి పోసుకుంటాను."

"మేనకా!" సంభ్రమంగా అన్నాడు.

"దయచేసి వెళ్లండి."

"ఆల్‌రైట్! నువ్వు నా భార్యవి. బలవంతంగా అనుభవించవల్సిన అవసరం లేదు నాకు." సామంతరావు మంచందగ్గరకి వెళ్లి పోయాడు.

పదిరోజులు గడిచాయి.

పూర్వం యింటి పని అంతా మేనకది. అంబిక కేవలం పైపెత్తనం చేసేది. పెళ్లయినప్పటినుంచి మేనక ఏ పనిచెయ్యడంలేదు. అంబిక చెయ్యమన్నా "చేసినన్నాళ్లుచేశాను. దానికి మంచి బహుమానం దొరికింది. ఇంకా నీకేందుకు చాకిరీచెయ్యాలి వదినా?" నిలేసి అడిగింది ఒకసారి.

అంబిక నోర్మూసుకుంది. మేనకతో మాట్లాడటమే భయంగావుంది. పిల్లి పులయిపోయింది.

"నీ పెళ్లాన్ని తీసుకుపో!" సామంతరావుకి వుత్తరం రాసింది.

వారంరోజుల్లో సామంతరావు వచ్చాడు. మేనక ప్రయాణానికి సుముఖంగానే వుంది. ఆమెకీ యిక్కడ వుండాలని లేదు.

"వుత్తరాలు రాస్తూండమ్మా" బండిదగ్గరకి వచ్చి వీడ్కోలుగా అంది అంబిక.

"ఎవరికి రాయను?" అనడిగింది రుషగా. అంబిక చిన్నబోయింది.

బస్సుఎక్కాక అడిగాడు సామంతరావు. "మీవదినమీద కోపం పోలేదా?"

"నాకు చేసిన ద్రోహానికి....పోదు."

ఇంటికి వచ్చేసరికి నాలుగయింది. పొలం అత్యవసరంగా వెళ్ళవల్సివున్నా భార్య మోజులో సామంతరావు కదలలేదు.

మేనక తలంటుకుని డాబాపై చిక్కుతీసుకుంటోంది. సామంతరావు కుర్చీ తెచ్చుకుని ఆమె దగ్గరగా కూర్చున్నాడు. మేనక మాట్లాడలేదు. సామంతరావు పైమరో భావం కలగడం లేదు ఆమెకి.

రాత్రి భోజనమయ్యాక నిద్రవస్తున్నా బలవంతంగా కూర్చుంది. నిద్రపోతే సామంతరావు ప్రక్కన పడుకుంటాడని.

"భయపడకు. నీలా నేనూ మాటకి నిలబడే వాడ్నే. డాబామీద గదిలో పడుకుంటాను. తలుపేసుకో!"


అంతరంగంలో రవంత సానుభూతి రేగింది మేనకకి. కాని అది తాత్కాలికం.

"నువ్వు గ్రీన్ సిగ్నల్‌యిచ్చే రోజు రావాలని ఆశ," తలుపు సందునుంచి ఆమెని చూస్తూ నవ్వాడు.

రోజులు గడుస్తున్నాయి. అంబిక లేకపోవడం మేనకకి సుఖంగానే వుంది. ఈనాడు స్వేచ్ఛాజీవి. సామంతరావు రూపాయిలతో చేయతగ్గ సదుపాయాలన్నీ భార్యకి చేశాడు. ఇంటిపనికి రావమ్మ వుంది, నౌకరున్నారు. భర్తకురూపితనం తప్ప మేనకకి యితరసమస్యలేం లేవు.

ఓసారి దాశరధి, అంబిక వచ్చారు కొత్త కాపురం చూడడానికి. మేనక అన్నగారితో పొడిగా నాలుగు మాటలు మాట్లాడింది. అంబికని పల్కరించలేదు.

"దాన్ని అందలం ఎక్కించానుకదూ....అదే పగ." అక్కస్సుగా అంది అంబిక.



"రేపు రాణికికూడ డబ్బున్న ముసలి వెధవ సంబంధంచెయ్యి. అందలం అంటే ఏమిటో నీ కూతురు చెబుతుంది." ఫెడీలమని జవాబిచ్చింది.

అంబిక, నీగుమ్మం ఎక్కితేచూడు అంటూ వెళ్లిపోయింది.

రెండు నెలలు గడిచాయి. భార్యాభర్తలు వేర్వేరుగా పడుకోవడం రావమ్మకి అర్థంకాలేదు. మేనకని అడిగే ధైరంలేక సామంతరావుని అడిగింది.

"నువ్వు మునిమనుమల్ని ఎత్తితే ఎక్కడ గుటుక్కుమంటావోనని జాగ్రత్తపడుతున్నాం." సామంతరావు నవ్వాడు.

3

మేనకకి ఆ రోజు చాలా చిరాగ్గావుంది. ఏం తోచడంలేదు. సాయంత్రందాకా విసుగ్గా గదిలోనే కాలక్షేపం చేసింది. అయిదున్నరకి సినిమాకి బయలుదేరింది. ఆమె గుమ్మాలు దిగుతుండగా పొలంనుంచి సామంతరావు వచ్చి "సినిమాకా?" అనడిగాడు. తలూపింది.

"నేనూ వస్తానపద. సినిమాచూసి చాల రోజులైంది."

మేనక ముఖం మాడ్చుకుంది. రిక్షదొరకలేదు. నడవసాగేరు. అది చిన్నసందుకాబట్టి అరుగులమీద మహిళామండలుల దృష్టి వీరిమీద పడింది. నవ్వుకున్నారు. మేనకకి తల కొట్టేసినట్లయింది. అవమానంతో వేగిపోయింది. వాళ్లు తనని గురించి ఎలా అపహాస్యంగా మాట్లాడతారో వూహించసాగింది.

దారిలో స్నేహితుడు కనిపిస్తే మాట్లాడుతూ సామంతరావు ఆగిపోయాడు. మేనక ఆగలేదు. అతడు ప్రక్కన నడవడం ఆమె సహించలేకపోయింది.

పోస్టాఫీసుదగ్గర ఒక యువకుడు సూట్‌స్‌తో ఎదురయ్యాడు. మేనక చప్పున పోల్చేసుకుంది.

"బావా!" చప్పట్లు కొట్టింది.

"నువ్వా మేనకా! .... మీ యింటికోసమే యిందాకట్నుంచి వెతుకుతున్నాను. నా అదృష్టం నువ్వే కనిపించావు." శివగిరి దగ్గరికి వచ్చాడు.

"అంత వెతకవలసిన పట్టణం కాదే.... ఎప్పుడొచ్చావ్?"

"ప్రొద్దుట. నాకీ వూరు ట్రాన్స్‌ఫర్ అయింది."

వెళుతున్న రిక్షని పిలిచింది. ఇంతలో సామంతరావు దగ్గరకి వచ్చాడు. "మా బావ" అని పొడిగా పరిచయం చేసింది. "ఇంటికి వెళదాం రిక్ష ఎక్కు."

"మీరు ఎక్కడికో బయలుదేరినట్లున్నారు" సంశయంగా అడిగాడు.

మేనక, శివగిరి రిక్షా ఎక్కగానే ఎక్కి కూర్చుని "సినిమాకేలే............ఎప్పుడైనా చూడొచ్చు" అంది.

వెళుతున్న రిక్షాకేసి చూస్తూ నిలబడి పోయాడు సామంతరావు.

ఆమె చొరవ శివగిరిని ఆశ్చర్యపరిచింది. "మీ ఆయన ఏమైనా అనుకోడూ?"

"అనుకోనీ" మేనక నవ్వింది. శివగిరి రాక ఆమెకి థ్రిల్లింగ్‌గా వుంది. దూరదేశంలో శత్రువుకూడ ప్రాణస్నేహితుడిలా కనిపించినట్లు, పూర్వం ఘనమైన పరిచయం లేకపోయినా శివగిరి విలువ పెరిగిందీనాడు ఆమె దృష్టిలో.

ఇదేం శివగిరికి తెలీదు.

తన భర్తతో పోల్చి చూసుకుంది. శివగిరి గొప్ప అందగాడు. డాషింగ్ పెర్సనాలిటీ; ఆరాధనం దీనికే పెరుగుత.

టిఫిన్, టీ తీసుకుని కూర్చున్నాడు శివగిరి. వంట పురమాయించడానికి మేనక లోపలకి వెళ్ళింది. ఇంతలో సామంతరావు వచ్చాడు. శివగిరి ఉలిక్కిపడ్డాడు. మేనక చేసిన దానికి గొడవ జరుగుతుందని భయపడ్డాడు.

సామంతరావు దగ్గర కూర్చుని ఆప్యాయంగా మాట్లాడాడు. "ముందర స్నానం చేసెయ్యండి. రిలీఫ్‌గా వుంటుంది."

"వద్దండీ. లాడ్జింగ్‌లో వుంటాను" శివగిరి ముఖమాటం పడ్డాడు.

సామంతరావు నవ్వాడు. "మా యిల్లు బాగాలేదా?"

మేనక వచ్చి సూట్‌కేస్ లాక్కుంది. "అక్కయ్య వచ్చేవరకు నీ బస యిక్కడే. మాట్లాడితే మర్యాద దక్కదు."

ఈ లాగటంలో ఆమె స్పర్శ తగిలి శివగిరి వళ్ళు ఝల్లుమంది. మేనక అందాన్ని తప్పించుకుని పోదామని అతడికీ లేదు. గౌరవం కోసం అన్నాడు.

ఎనిమిదిన్నరకి భోజనాలయినాయి. మేనక శివగిరి చూపిస్తున్న ఆల్బమ్ చూసి పరవశంగా నవ్వుతోంది. సామంతరావు డాబాకేసి వెళుతూ చూశాడు. ఆగేడు. శివగిరి ఇతడ్ని చూశాడు. సామంతరావు పైకి వెళ్ళిపోయాడు.

"మీ శ్రీవారు నీకోసం చూస్తున్నారు" శివగిరి అన్నాడు.

"నా కోసం కాదులే; అన్నట్లు అక్కయ్య ఎప్పుడు వస్తుంది?" అంది సంభాషణ దిశ మారుస్తూ. కుర్చీలో వెనక్కి వ్రాలి కాళ్ళు మేంచానికి తన్ని కూర్చుంది.

ఆమె కాళ్ళు ఆడించడంలో మువ్వలు కదులుతున్నాయి. చీర లంగా గాడి తప్పుతూ నగ్నతకి ఆస్కారమిస్తున్నాయి.

శివగిరి కిదంతా ఇంద్రజాలం చూస్తున్నట్లుంది. మేనక యిలా ఎందుకు ప్రవర్తిస్తోంది? ఆమె సంసారంలో అపశృతులు వున్నాయా? అసంతృప్తి దాగుందా?

"నిద్ర వస్తోందా?" మేనక అడిగింది.

"లేదు."

"సినిమాకి వెళదామా? బాపు సినిమా మిస్ కావాలనిపించలేదు నాకు."

శివగిరి ఏదో అనబోయి మానేసి బట్టలు వేసుకున్నాడు. రావమ్మని తలుపేసుకోమని మేనక అతడితో సినిమాకి బయలుదేరింది.

మధ్యలో కరెంటు పోతూండటంవల్ల రెండవ ఆట వదిలేసరికి నాలుగయింది. మేనక మర్నాడు లేచేసరికి తొమ్మిదయింది. శివగిరి ఆఫీసుకి వెళ్ళిపోయాడు. రావమ్మ, ముఖం కడుక్కున్నా కాఫీ పట్టుకురాకపోవడం చూసి మేనక వంటింటిలోకి వెళ్ళింది.


సామంతరావు పెరటి అరుగుమీద పనస్ కాయ కొడుతున్నాడు.

"కాఫీ పెట్టలేదా?" విసుగ్గా అడిగింది.

"ఎప్పుడు లేస్తావో ఎవరికి తెలుసు? పెడతానాగు....రాత్రి సినిమాకేనా వెళత?" రావమ్మ అప్రసన్నంగా అడిగింది.

"నీకు చెప్పాలా?" మేనక కుతకుతలాడిపోయింది.

రావమ్మ తాటాకు మంటలా లేచింది.



మేనక విచ్చలవిడితనం ఆమెకు నచ్చడంలేదు. రాత్రి బావతో సినిమాకిపోవడం సంప్రదాయాల మధ్య పెరిగిన రావమ్మ భరించలేకపోతున్నది.

"నాకు కాకపోతే లోకానికేనా చెప్పాలే; మొగుడ్ని వదిలేసి దారేపోయే దానయ్యతో సినిమాకి వెళతావా? సంసారం చేసుకునే మనిషివే?"

"దారేపోయే దానయ్యేం కాదు. నా బావ."

"నీ మొగుడికంటె ఎక్కువా?" రావమ్మ హూంకరించింది.

సామంతరావు గాంభీర్యం, రావమ్మ ఉద్రేకానికి మేనక భయపడిపోయింది. కాని, సమర్థించుకుంటూ "సినిమాకి వెళితే యింత గోల చేస్తావేమిటి?" అన్నది కోపంగా.

"ఇంకా పెద్దగోలచేసి మమ్మల్ని నవ్వులపాలుచెయ్యకుండా!" రావమ్మ గుమ్మం దగ్గరకి వెళ్ళి "బెల్లంకొట్టిన రాయిలా మాట్లాడవేంరా? నువ్వు ముందరే జాగ్రత్తపడటం మంచి దబ్బాయ్!" అంది సామంతరావుతో.

"మేనక మూర్ఖురాలు కాదని నా నమ్మకం" సామంతరావు భార్యకేసి చూసి నెమ్మదిగా అన్నాడు.

వ్యక్తి జనితమైన జీవితం ఎప్పటికప్పుడు తన దిశలు మార్చుకుంటూ వుంటుంది. మార్పుకి స్వాగతం చెప్పేవాడు వివేకి. ఎదిరించేవాడు విప్లవవాది. వివేకి అశాంతి నుంచి శాంతి పొందాలనుకుంటాడు. విప్లవవాది అశాంతినే శాంతి చెయ్యాలనుకుంటాడు. అది సవనం. ఇది సమరం.

సామంతరావు వుద్రేకి కాడు.

భార్య తనని ద్వేషిస్తూందని తెల్సు. అదే నిష్పత్తిలో తను ప్రేమిస్తున్నాడు. శాసిస్తూ ఆమెని పొందేకంటె, ఐచ్ఛికంగా తను కోరబడడం కోరుకుంటున్నాడు.

సాయంత్రం శివగిరి ఆఫీసునుంచి వచ్చేసరికి మేనక ఒంటరిగా పెరట్లో ట్రాన్సిస్టర్ వింటూ కూర్చుంది. రావమ్మ గుడికి వెళ్ళింది.

"అలావున్నావేమిటి? రాత్రి సినిమాకి వెళ్ళినందుకు మీ ఆయన తిట్టేడా?"

"ఆయనేమనలేదు. ఆ ముసలిముండ నోరు పడేసుకుంది."

"మంచిమనిషిలా వున్నాడు."

"చేతకాని వాజమ్మను."

రోజులు గడుస్తున్నాయి. మేనక యిస్తున్న ప్రోత్సాహానికి శివగిరికి బెదురు పోయింది. ఆమె బాత్‌రూంలో వున్నా తలుపు కొట్టి

మాటాడగలడు. తడిసిన వంటిమీద అర్ధ నగ్నంగా మేనకని చూడడం అతడికి చాలా యిష్టం. ఈ మోజులోపడి భార్యా పిల్లలని తీసుకురావడం మరచిపోయాడు.

ఏదో పండగ వచ్చింది. సామంతరావు భార్యకి రెండు ఖరీదైన చీరలు కొన్నాడు. పండగరోజున ఆమె మరో చీర కట్టుకోవడం చూసి "ఇదెక్కడిది?" అనడిగాడు.

"మా బావ కొన్నాడు."

"నువ్వంటే చాలా యిష్టం కాబోలు."

"నాకూ యిష్టమే!"

"ఎలాంటి యిష్టం!"

మేనక చెప్పలేకపోయింది. అక్కడ్నుంచి కదలడానికి హడావిడిగా చెప్పులు తొడుక్కుంది. కుడి ఎడమలు తారుమారయ్యాయి. గమనించక అవస్థపడింది.

"విలువలు తారుమారయినా కష్టమే మేనకా!"

వారంరోజులు గడిచాయి. శివగిరి భార్య యిక వుత్తరాలు రాయడం మాని "బుధవారం వస్తున్నాం" అని వైరిచ్చిరది. శివగిరిలో చలనం బయలుదేరింది.

"అద్దెయిల్లు అర్జంటుగా చూడాలి. అర్ధాంగి వచ్చేస్తోంది." మేనకతో ఫిర్యాదు చేశాడు.

"మంచిదేగా?"

"ఏం మంచి? రెండ్రోజుల్లో యిల్లెందొరుకుతుంది?"

"నాకు వదిలెయ్!"

మేనక పాలేర్లకి పురమాయించింది. నాలుగయిదు ఇళ్ళ వివరాలు పోజేసుకుని వచ్చారు. మేనక యింటికి అవతల వీధిలో వున్న యిల్లు నచ్చింది. అడ్వాన్స్ యిచ్చారు. బుధవారం వచ్చింది. లారీలో సామాను వచ్చింది. శివగిరి భార్య వంట్లో బాగాలేక రాలేదు.

రావమ్మ తనతో ఘర్షణపడుతున్నా మేనక తన పద్ధతులేం మార్చుకోలేదు. వాస్తవానికి ఆశలకి మధ్య దారి వెతుక్కుంటూంది. ఏ తీరం చేరుకోవాలో నిర్ణయానికి రాలేకపోతున్నది. భర్త కురూపితనం బాధిస్తోంది, బావ అందం మరిపిస్తోంది. యవ్వనం ఎదురుగాలిలోని పడవలా భారంగా వుంది.

శివగిరి మాత్రం యిల్లు చూసినప్పటి నుంచి యిక్కడికి రావడం లేదు. రావమ్మకి భయపడుతున్నాడు. రావమ్మ మేనక లేకుండా యిష్టమొచ్చినట్లు తిట్టిపోసేది. దాంతో అభిమానం నిద్రలేచింది. మరోవైపు సామంతరావు వ్యక్తిత్వం సవాల్ చేస్తోంది... రాకపోకలు పూర్తిగా తగ్గించాడు.

మేనకే రెండు మూడు సార్లు వెళ్ళివచ్చేది. ఆమె ఎక్కడికి వెళుతూందో రావమ్మకి తెల్సు. రాగానే పోటాడేది. సామంతరావు మాట్లాడేవాడు కాదు. పిల్లలు విలువైన రత్నాలని వదేసి గాజు ముక్కలకోసం ఆరాటపడతారు. మేనక అలాగే కనిపించింది.

ఒకనాడు పన్నెండు గంటల సమయం.... ఎండలేదు....మబ్బుగావుంది....మేనక భోజనం చేసి వరండాలోకి రాగానే ఓ కుర్రాడు పరుగున మీద వచ్చి చీటీ యిచ్చాడు.

"తొందరగా రా............గిరి...."

ఎందుకోనని వెళ్ళింది వెంటనే. శివగిరి ఓ పుస్తకం యిచ్చి "దీన్ని చూస్తూ వుండు.... సిగరెట్లు తెచ్చుకువస్తాను" చిన్నగా నవ్వి బయటకి వెళ్ళిపోయాడు.

మంచంమీద పడుకుని పుస్తకం తెరిచింది. సెక్స్ అట్లాసు. రకరకాల నగ్న చిత్రాలు. మేనక వయసు నిద్రలేచింది. శరీరమంతా తిమ్మిరితిమ్మిరిగా వుంది. తదేకంగా చిత్రాలు చూసేకొద్దీ యవ్వనం తాండవనృత్యం చెయ్యసాగింది.

శివగిరి వచ్చాడు. గడియ వేశాడు. నిట్టూర్పులతో మేనక. ఎన్నాళ్ళనుంచే కలయిక కోసం ఎదురుచూస్తున్నాడు. మేనక ఎదురు చెప్పదని తానే చొరవచేశాడు. మంచం దగ్గరకి వచ్చాడు. వక్షాలు ఎగురుతున్నాయి ఆవేశంగా. మంచం వారగా కూర్చున్నాడు. ఆమె చేతిని మెల్లగా నొక్కాడు.

మేనక వులిక్కిపడింది.

ఎదురుతిరగాలని వుంది. తిరగరాదని వుంది.

తలుపు చప్పుడయింది.

శివగిరి విసుక్కుంటూ లేచాడు. తలుపు దగ్గర కెళ్ళేసరికి భార్యని తెలిసిపోయింది. మైకం వదిలి భయం పట్టుకుంది.

పెరటి తలుపు తీసి "రాధ వచ్చేసింది మేనకా! నువ్విలా వెళ్ళిపో ప్లీజ్!" నెమ్మదిగా గొణిగాడు.

"రానీ! నేను పారిపోవడమెందుకు?"

"అది అసలే అనుమానం మనిషి. ఇల్లు పీకి పందిరి వేస్తుంది...." మేనక రెక్క పుచ్చుకుని గుమ్మంకేసి లాక్కెళ్ళి "తర్వాత చెప్తాగా" అన్నాడు తలుపు వేస్తూ.

దొంగలా పారిపోవడం మేనకకి అదోలా వుంది. అవమానంగా వుంది.

తను బాహాటంగా అందర్నీ ఎదిరించి అతడి దగ్గరకి వెళుతోంది. శివగిరి తన కోసం సాహసం ఎందుకు చేయడు! తన వాళ్ళతో ఎందుకు పోరాడడు?

ప్రశ్నలు ఆమెని నిలదీశాయి.

4

"అయ్యగారు పిలుస్తున్నారమ్మా" పని మనిషి వచ్చి చెప్పింది.

మేనక అదోలా చూసింది. ఒకే కప్పు క్రింద వున్నా ఎవరి ప్రపంచం వారిది. ఒకర్ని ఒకరు ఎదురయితే మాటాడుకోవడంతప్ప పిలుపులు లేవు. మేనక అయిష్టంగానే లేచింది.

"ఇతడు నందకుమార్. నా స్నేహితుడు. ఇతడి సినిమాలు నువ్వు చూస్తూనే వుంటావు" భార్య రాగానే పరిచయం చేశాడు.

సినిమా పక్షి అని తెలియగానే మేనకకి వుత్సాహం వచ్చింది. "మిమ్మల్ని కల్సుకోవడం చాలా ఆనందంగా వుంది" అంది ఎదురుగా వున్న సోఫాలో కూర్చుంటూ.

"ఒరేయ్ నందం....నేను లేనని నువ్వేమీ సిగ్గుపడక్కర్లేదు. మేనక అన్ని విషయాలు చూసుకుంటుంది. నువ్వు వచ్చినట్లే, నాకు విశాఖ ప్రయాణం తప్పనిసరయింది" సామంతరావు బాధగా అన్నాడు.

"పోన్లేరా....మళ్ళీ వస్తాను...." అన్నాడు నందకుమార్.

"అదేం వీల్లేదు.......నాకంటె ఎక్కువగా మేనక సాయపడుతుంది" అంటూ భార్యకేసి తిరిగి "ఏం మేనకా?" అన్నాడు.

"ష్యూర్!"

మధ్యాహ్నం భోజనం అయ్యాక సామంతరావు విశాఖ వెళ్ళిపోయాడు. పడుకున్నా మేనకకి నిద్ర పట్టలేదు. నందకుమార్ గదికి వెళ్ళింది.

నందకుమార్ సిగరెట్టు కాలుస్తూ ఏవో కాగితాలు చూసుకుంటున్నాడు. మేనక గుమ్మం దగ్గర తచ్చాడడం చూసి "రండి" అన్నాడు.

"టీ తీసుకుంటారా?"

నందకుమార్ తలూపాడు. మేనక పని మనిషికి పురమాయించి లోపలకి వచ్చి కూర్చుంటూ "మా వారికి మీలాంటి స్నేహితులుండటం ఆశ్చర్యంగా వుంది" అంది నవ్వుతూ.

విస్మయంగా చూశాడు నందకుమార్.

"ఇప్పటిదాకా యెన్ని సినిమాలు డైరెక్టు చేశారు?" సంభాషణ మారుస్తూ అడిగింది.

"సంఖ్యలో స్వల్పమేనండీ. తొమ్మిది."

"మీ పేరయ్య సంసారం చాలా సహజంగా వుంది. పల్లెటూర్లో ఒక సామాన్య కుటుంబాన్ని చూస్తున్నట్లు వుంది. తెలుగు సినిమాలకి కూడ జాతీయ బహుమతులు వస్తాయనిపించింది."

"అందుకే నాకూ మరిన్ని కొత్త ప్రయోగాలు చెయ్యాలనిపిస్తోంది. అందుకే స్వంత ప్రొడక్షను పెట్టాను. గోదావరి తీరంలో షూట్ చేద్దామని యిలా వచ్చాను."

"హీరో హీరోయిన్లు ఎవరు?"

"ఈసారి కొత్తవాళ్ళతో తీద్దామని వుంది."

మేనక ఆశ చిగురించింది. ఆమెకి ఎప్పటినుంచో సినిమాల్లో నటించాలని వుంది. తనకి అందం వుంది. ఆ క్వాలిఫికేషన్ చాలనుకుంటోంది.

మర్నాడు నందకుమార్, మేనక 'లొకేషన్ సెర్చి'కి బయలుదేరుతూండగా శివగిరి ఉత్తరం పంపించాడు. మేనక అది చదివి చింపి

ఇప్పుడు ఖాళీ లేదని చెప్పు' అంటూ కారెక్కి కూర్చుంది.

శివగిరి సాయంత్రం నుంచి మేనక యింటి ముందు కాపలా కాస్తున్నాడు. తొమ్మిదింటికి మేనక వచ్చింది. ప్రయాణం మూలంగా అలసటవల్ల వెంటనే స్నానానికి వెళ్ళిపోయింది మాట్లాడకుండా. శివగిరిలో కోపం తొంగిచూసింది. నందకుమార్‌తో తిరగడమే అతడికి మంటగా వుంది.

రావమ్మ భోజనాలకి పిలవడంతో "నువ్వు కూడా లే!" కుర్చీలో బిగిసికూర్చున్న శివగిరితో అంది.

"నాకు ఆకలి లేదు."

నందకుమార్ అక్కడికి రావడంతో "మా బంధువు" అంటూ పరిచయం చేసి లోపలకి వెళ్ళిపోయింది.

మేనక ముభావంగా వుండటంతో శివగిరికి అక్కడ వుండాలనిపించలేదు. అసహనంతో వెళ్ళిపోయాడు.

మేనకని యింటికి రప్పించుకోడానికి భార్యని బలవంతంగా పెళ్ళికి పంపించాడు శివగిరి. తనని కాదనడం కంటె, మేనక నందకుమార్‌తో తిరగడం భరించలేకపోతున్నాడు.

5

నందకుమార్‌కి నాలుగు రోజుల్లో లోకేషన్లు తిరిగిరావడం అయింది. రేపే అతడి ప్రయాణం.

"వీడు చూశారా? రెండ్రోజుల్లో వస్తానన్నాడు. ఇప్పటిదాకా రాలేదు" భోజనాల దగ్గర అన్నాడు నందకుమార్.

భర్త ప్రసక్తి రావడంతో మేనక కుదించుకుపోయింది.

భోజనాలు అయినాయి. నందకుమార్ కారిడార్లో పచార్లు చేస్తున్నాడు. "ఇదిగో వక్కపొడి" మేనక వచ్చింది.

"మీ ఆతిథ్యానికి ధన్యవాదాలు మేనక గారూ! మీ కోపరేషన్‌వల్ల నా పని విజయవంతంగా ముగిసింది."

మేనక మందహాసం చేసింది. "మిమ్మల్ని ఒకటి అడగాలనుకుంటున్నాను" అంది చాలా సేపటి తర్వాత.

"అడగండి."

"మీ కొత్త పిక్చర్‌లో నాకు స్థానం యివ్వండి."

"మీకా!"

"నేను పనికిరానా?" విలాసంగా తన సౌందర్యం చూసుకుంటూ అడిగింది.

"ఎందుకు పనికిరారు? మీరు సినిమాల్లో ఎందుకు చేరాలనుకుంటున్నారు? గ్లామర్ కోసమా? అదేం పూలపాన్పు కాదు. ముళ్ళ కిరీటం."

మేనక మాట్లాడలేదు.

"మీకు ఐశ్వర్యం వుంది. చల్లని కాపురం వుంది. ఇంతకంటె తృప్తిగా వుండదు అక్కడి జీవితం? అయినా సామంతరావు ఒప్పుకుంటాడా?"

మేనక చివాలున తన గదిలోకి వెళ్ళిపోయింది. నందకుమార్ విభ్రాంతిపడి ఆమె వెంట వెళ్ళాడు. మేనక మంచం అంచుపై భారంగా కూర్చుంది.

"క్షమించాలి నేను పొరపాటుగా మాట్లాడానా?"

మేనక ముఖం చీరకొంగుతో వత్తుకుంటూ "కూర్చోండి. మీకు కొన్ని విషయాలు చెప్పాలి. నాకీ కాపురం యిష్టంలేదు" చెప్పింది.

"వాట్!" నందకుమార్ ఆశ్చర్యంతో సోఫాలో కూర్చున్నాడు.

"అవును. భర్త కురూపి. అది నేను భరించలేకపోతున్నాను. మీరయినా నన్ను యిక్కడ్నుంచి దాటించండి" అంది వెక్కివెక్కి ఏడుస్తూ.

నందకుమార్ ధైర్యం చెప్పాడు. పెళ్ళయినప్పటి నుంచి తన జీవనం అతడికి విశదీకరించింది.

వీరు మాటలాడుకుంటూండగా శివగిరి క్రిందకి వచ్చాడు. పనిమనిషి డాబామీద వున్నారని చెప్పింది. శివగిరి మెట్లు యెక్కాడు.

తలుపులు దగ్గరగా వేసివున్నాయి. తన వస్తువు దూరమయిపోయినట్లు బాధ రేగింది అతడిలో.

"తప్పకుండా మిమ్మల్ని హీరోయిన్ చేస్తాను."

శివగిరి ఆ మాటలకి కుతకుతలాడిపోయాడు. వీడు సాయం చేస్తున్నాడంటే మేనక ఏదో యిచ్చివుండాలి. ఉత్తుడియంగా సాయం చెయ్యడు కదా! మేనక తన చేతుల్లోంచి జారిపోయి నందకుమార్ సొత్తుకావడం గుండెలు పిండినట్లయింది.

"నువ్వు ఆడదానివే...." విసురుగా తలుపుల త్రోసి లోపలకి వెళ్ళాడు.

ఇద్దరూ వులిక్కిపడ్డారు.

"పరాయి మగాడితో పట్టపగలు పడక గదిలో సరసాలాడతావా?" కోపంగా ఆమెను లాగేడు.

మేనక విదిలించుకుంది, "నా యిష్టం. గెటవుట్. నా మీద పెత్తనం ఏమిటి?" గద్దించింది.

"పొమ్మనవూ. నేనుంటే అడ్డుకదా!" వికటంగా నవ్వాడు.

నందకుమార్ జోక్యం చేసుకున్నాడు. "మిస్టర్ మర్యాదగా మాటలాడ్డం నేర్చుకో. ఆవిడ్ని శాసించడానికి నువ్వెవరు?"

"అది బరితెగించిన రకం. నీకయినా సిగ్గు లేదటయ్యా." ఆవేశంగా శివగిరి అతడి మీదకి వెళ్ళాడు.

మేనక రోహిణీ సూర్యుడయింది. నిప్పుల కుంపటయింది. శివగిరి ప్రవర్తనకి వుడికిపోయింది. డాబా పిట్టగోడ దగ్గరకెళ్ళి క్రిందనున్న నౌకర్లని పిలిచింది. వాళ్ళు వచ్చారు.

శివగిరిని చూపిస్తూ "ఈ వెధవని బయటకి గెంటండి" ఆదేశించింది.

పరిస్థితి మారుతోందని శివగిరి గ్రహించాడు. "మేనకా! నన్ను తప్పించుకోలేవు. ఎలాగయినా నిన్ను పొంది తీరతాను"

శివగిరి వెళ్ళాడు. మేనక అచేతనంగా కూర్చుంది. వేడిగా వుంది మనసు.

"మీ మీద ఆయనకి చాలా అధికారమున్నట్లుంది. అవునా?"

"స్వార్థపరుడని తెలియదు. అతడి అందానికి భ్రమపడ్డాను."

నందకుమార్ గదిలో పచార్లు చెయ్యసాగేడు మాటాడకుండా. పదినిముషాలయింది. నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నాడు. "చూశారా! అందమైన వారికి అందమైన మనసుండదు."

మేనక వులిక్కిపడింది. మంచుముక్కలు మీద పడినట్లు జిలజిలలాడింది.

"మీ మీద ఎంతో నమ్మకముంది సామంతరావుకి. నన్ను అప్పగించి వూరికి వెళ్ళాడు. మీ బావ మనం మాటలాడుకోవడమే భరించలేకపోయాడు. ఇద్దరికీ ఎంత తేడా?"

మేనక బావురుమంది. నందకుమార్ ఓదార్చలేదు.

రాత్రి ఎనిమిది గంటలకి సామంతరావు వచ్చాడు. భోజనాలయ్యాక అర్థరాత్రిదాకా మిత్రులిద్దరూ ఏవేవో మాటాడుకున్నారు.

"గుడ్‌నైట్....నీ కాలాన్ని హరించలేను" నందకుమార్ తన గదికి పోయాడు.

సామంతరావు తన గదిలోకి వచ్చి స్థాణువైపోయాడు. రోజులాలేదు గది. మల్లెలున్నాయి! సుగంధాలున్నాయి! మేనక వుంది.

"మీరు కాదు కురూపి. నేనే కురూపిని. మాణిక్యాన్ని వదిలి గాజుముక్కకోసం పరుగెత్తాను. నన్ను క్షమించండి" అంది అతని వడిలో వ్రాలి.

అది వసంత రాత్రయింది వాళ్ళకి. తీయతీయని సమయంలో గతాన్ని సమాధి చేసుకుని, ఆనందజ్యోతులు వెలిగించుకున్నారు.

"నాకు సినిమాల్లో వేషం వద్దు కుమార్ గారూ! సామంతరావుగారి యిల్లాలు వేషం చాలు నాకు!" మర్నాడు మేనక చెప్పేసింది.

★



నీ వెలుగే నాకు చీకటి

భరించలేని నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ టిక్ టిక్ మంటోంది గోడ నున్న గడియారం. శాపాన్ని అనుభవిస్తున్న దేవతలా గోడవారగా వున్న పేము కుర్చీలో కూర్చుని వుంది జానకమ్మ.

ఆమె చూపులు ఆ గడియారం ముళ్ళమీద వున్నాయి.

కాని ఆమె ఆలోచనలు మరికొన్ని గంటల్లో తాము కలుసుకోబోతున్న అమితానంద స్వామీజీమీద వున్నాయి.

ఆయనకు తనమీద దయ కలుగుతుందా? ఇప్పటికయినా తన ఇరవైయేళ్ళ కలలు పండుతాయా?

తలుచుకుంటే ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది. తనదీ ఓ బ్రతుకేనా అనిపించింది. ఇంతకీ తనేం పాపం చేసిందనీ?

భగవాన్ ఎందుకు నాకీ శిక్ష? కనీసం ఇప్పటికయినా నన్ను కరుణించు....అప్రయత్నంగా చేతులు జోడించింది.

ఆమె ఎదురుగా దేవుడి ఫొటో లేదు. గోడ గడియారం వుంది. జానకమ్మకు ఆ తారతమ్యంలేదు. ఆమె ఇప్పటివరకూ ప్రతి వస్తువులోనూ దేవుడిని చూస్తోంది....

టంగ్‌మని గంట కొట్టింది గడియారం....

'ఐదున్నర' అనుకుంది జానకమ్మ.

ఇంకా ఈయన రాలేదేం? ఎందువల్ల రాలేదు? ఐదు గంటలకే వస్తానని చెప్పారు ఉదయం ఆఫీసుకు వెళుతూ....

అందుకే తను నాలుగున్నర నించే ఆయన కోసం యెరురుచూస్తోంది.

త్వరగా వెళితేనే నయం....మరీ చీకటిపడి వెళితే అమితానంద స్వామీజీ దగ్గర ఎక్కువ మంది భక్తులు చేరవచ్చు....ఇప్పటికే ఆయన ఆ వూరు వచ్చినట్టు చాలామందికి తెలిసిపోయింది.

తనలాంటివాళ్ళు—నిర్భాగినులు—అదృష్టహీనులు ఇంకా ఎంతమంది వున్నారో? వాళ్ళందరూ ఆయన దగ్గరకు రారూ?

జానకమ్మకు అనుమానం వచ్చింది....

తన లాంటి అదృష్టహీన యెవరయినా వుంటుందా?

మాతృత్వానికి నోచుకోని నష్ట జాతకులు యెంతమంది వుంటారు? తనలాంటి ఎవరో? ఎంతో పాపం చేసుకున్నవాళ్లు....

నిజమే—తను గతజన్మలో ఏదో ఘోరమయిన పాపమే చేసివుంటుంది. అందుకే భగవంతుడు తనకు ఈ జన్మలో బిడ్డను కనే యోగం లేకుండా చేశాడు....తనకు భరించలేని శిక్షను విధించాడు....

ఇంకా యెన్నాళ్ళీ శిక్ష? శోకం....బాధ....క్షోభ....రంపపు కోత....

ఇంతకుమించిన నరకం యే స్త్రీకయినా వుంటుందా?

మెదడు పగిలిపోయేలా ఆలోచిస్తోంది జానకమ్మ....ఎంత ఆలోచించినా ఆమెకు యెందుకిలా జరిగిందో తెలీటంలేదు.


తెలిసి తను ఏ పాపమూ చెయ్యలేదు. తెలియక చేసిన పాపం తననిలా వెంటాడుతుందా?

ఆమె హృదయంలో ఎన్నో అర్థం లేని ప్రశ్నలు....తను కనిన కలలు, పెంచుకున్న ఆశలు ఒక్కసారి తల్చుకుంటే గుండె పగిలిపోతుందేమోనన్న భావన.

ఇరవైయేళ్ళ క్రితం వాస్తవానికి తను ఎన్ని కలలు కన్నది?

జానకిగా తనని అందరూ పిల్చేటప్పుడు తనకు పెళ్ళయ్యింది. అప్పుడు తనకు ఇరవైయేళ్ళు. తనకు ఆ సంబంధం కుదిరిందని తెలిసినప్పుడు భూమ్మీద నిలవాలనిపించలేదు. వయసు వచ్చిన దగ్గర్నుంచీ తను అందరు కన్నెపిల్లలాగే పెళ్ళి గురించి ఆ తర్వాత తను గడపబోయే వైవాహిక జీవితం గురించీ ఎన్నెన్నో కలలు కనటం మొదలుపెట్టింది....కాని తన దురదృష్టం ఇలా వుంటుందనేనేమో తన ఆలోచనలన్నీ పెళ్ళయిన తర్వాత తను పొందబోయే మాతృత్వం మీదనే వుండేవి. పెళ్ళయిన ఏడాదికే తనకు బంగారు పాపడు పుడతాడు. అందంగా, ఆరోగ్యంగా ఎంతో ముద్దొస్తూ....వాడిని తను అపురూపంగా పెంచుతుంది. వాడిని పెంచటంలోనే తను మునిగిపోతుంది. ఇంట్లో పసిబాబు తిరుగుతుంటే ఎంత సంతోషంగా, నిండుగా వుంటుంది? అసలు ఆడదానికి మాతృత్వమే హుందాతనాన్నిచ్చేది.

పెళ్ళయింది .... చూస్తుండగానే ఏడాది గడచిపోయింది....కాని తను ఆశించినట్లు ఏమీ జరగలేదు. అంతులేని నిరుత్సాహం....ఐనా ఆశ....కొంతమందికి అంతే....పెళ్ళయిన నాలుగేళ్ళ వరకూ పిల్లలు పుట్టరుట....నిజమే. ....తన తల్లికి కూడా అంతే....పెళ్ళయిన మూడేళ్ళకు అక్కయ్య పుట్టిందట....తనకు అమ్మ పోలిక వచ్చిందేమో....ఇలా అనుకుని మనసును సరిపెట్టుకోలేకపోయింది. అదే నిజమయితే తనకంటే ముందు పుట్టిన అక్కయ్యకు అమ్మ పోలిక యెందుకు రాలేదు? అక్కయ్యకు పెళ్ళయిన ఏడాదికే చక్కని బాబు పుట్టాడు. వాడిని చూసిన తర్వాతనే



తనలో మాతృత్వంమీది మమకారం మరింత పెరిగిపోయింది. పేరుకే అక్కయ్య కొడుకు. ....వాడి ఆలనా పాలనా అంతా తనే చూసేది. అప్పుడప్పుడు అక్కయ్య వాడికి పాలు ఇచ్చేది. అంతే....ఇంక మిగిలిన పనులన్నీ తనవే....స్నానం చేయించటం....పౌడరు అద్దటం....బొమ్మలతో ఆడించటం....యేడుస్తుంటే లాలించటం....ఒళ్ళో పడుకోబెట్టుకొని నిద్రపుచ్చటం....వాడి పనులన్నీ తనే చూస్తుంటే యెంతో తృప్తి....యెంతో ఆనందం....

"ఒసేవ్ జానీ....వాడు నా కొడుకా? నీ కొడుకా? నేను వాడిని మరచిపోయేట్టు వున్నాను" నవ్వుతూ అనేది అక్కయ్య....

"వీడు నా కొడుకే....నా బంగారు బాబే" తను వాడిని నవ్విస్తూ అనేది....

"పోన్లే....వీడిని నువ్వే వుంచేసుకో....రేపు నీకు పుట్టే కొడుకును నాకు యిచ్చెయ్యవే."

"బాగానే వుంది మీ వరస....మీరు మాట్లాడుకుంటున్నది పసిపిల్లల గురించా? బొమ్మల గురించా?" అమ్మ మధ్యలో....

సినిమాలకు వెళ్ళినా, హరికథలకు వెళ్ళినా, పేరంటాలకు వెళ్ళినా తనే వాడిని ఎత్తుకునేది.

వాడూ అంతే....అక్కయ్య యెత్తుకుంటే ఏడ్చేవాడు....తను చేతులు చాపితే నవ్వుతూ మీదకు దూకేవాడు.

అక్కయ్య తన యింటినించి వెళ్ళిపోయేటప్పుడు తనకు ఏడుపు ముంచుకొచ్చింది....తను బాబును చూడకుండా వుండగలదా? వాడు వుండగలడా?

తన అవస్థ గమనించి అక్కయ్య కొన్నాళ్లు తన దగ్గర వుంచుకుంటానని తీసుకువెళ్ళింది. ....వెళ్ళిన పదిరోజులకే వాళ్ళు పెళ్ళికి ఒప్పుకున్నారనీ, వెంటనే రమ్మనీ నాన్ననించి ఉత్తరం....వచ్చేసింది....

ఆ తర్వాత ఇరవై రోజులకే పెళ్ళి....

చూస్తుండగానే మూడేళ్లు దొర్లిపోయాయి. తన కలలు కలలుగానే మిగిలిపోయాయి....తన కడుపు పండలేదు....తనలో ఏదయినా లోపం వుందేమో....అందుకే పుట్టింటికి వెళ్ళినప్పుడు ఓ లేడీ డాక్టరు వద్దకు తీసుకెళ్ళింది అమ్మ.

ఆమె పరీక్షచేసి 'నీలో యెలాంటి లోపం లేదు' అన్నది.

అంటే....ఉన్న లోపం ఆయనలోనేనా? కొన్నాళ్ళకు అదికూడా తీరిపోయింది.

ఆయన కూడా పరీక్ష చేయించుకున్నారు.

ఆ డాక్టరు ఆయనలో యెలాంటి లోపం లేదనీ పిల్లలు పుట్టే అవకాశం వుందనీ చెప్పాడు.... ఆ ధైర్యంతో యింకో రెండేళ్ళు గడిచాయి. ఎన్నేళ్ళు గడిచినా ఫలితం లేకపోయింది.... తను తల్లి కాలేకపోయింది.

ఏమిటిది? తనకు ఇక పిల్లలు పుట్టరా? తను యిలా జీవచ్ఛవంలా బ్రతకాల్సిందేనా?

ఎంతోమందికి తనమీద జాలి..... సాను భూతి....

ఎవరికి తోచిన సలహా వాళ్ళు యివ్వటం మొదలుపెట్టారు....యెక్కడో సంతానం చెట్టు వుంది....దాని చుట్టూ రోజూ వెయ్యిసార్లు నెల రోజులు ప్రదక్షిణం చేస్తే పిల్లలు తప్పకుండా పుడతారుట....

తనూ ఆయనా ఆ చెట్టు దగ్గరకు వెళ్ళారు. తను ఎంతో భక్తితో రోజూ వెయ్యిసార్లు ప్రదక్షిణాలు చేసివచ్చింది. ఆ తర్వాత నాలుగు నెలలు గడిచాయి. తన పరిస్థితిలో యెలాంటి మార్పు లేదు.

నెలరోజులు కాగానే చాపా, చెంబూ తీసుకుని బయట కూర్చునేది....

ఆఫీసునించి వచ్చిన ఆయన ఆ దృశ్యం చూసి నీరుకారిపోయేవారు....

తను ఆయన చూస్తున్నారని తెలిసి మొహాన్ని ఏవైపుకో తిప్పుకునేది ఏదో గొప్ప నేరం చేసినట్టు....ఆ పరిస్థితిలో తనమీద తనకే జాలి కలిగేది. ఐనా తను ఏం చెయ్యగలదు?

ఇలా గడిచింది ఇరవైయేళ్ళ కాలం.... ఎప్పటికప్పుడు యేదో ఆశ....ఇంకేదో నమ్మకం....ఎవరో చెప్పుకునే మాటలు వింటుంటే ఆశ చిగురించేది....ఏ దేశంలోనో ఒకామెకు నలభయ్యో ఏట మొదటిసారిగా కవలలు పుట్టారుట....

ఇలాంటి మాటలే తనలో ఎప్పటికప్పుడు వెలుగును నింపేవి....

ఈ చీకటి బ్రతుకులో వెలుగురేఖ ఉదయించదా?

ఏ దేవుడో తన మొర ఆలకించకపోడు.... ఏ దేవతో తన క్షోభను గ్రహించక పోదు....

ఇవాళ....రేపు....

ఇంకా ఎన్నాళ్ళు?....ఇప్పుడు తన వయసు నలభై....ఆయనకు నలభై ఆరు.

ఈ ఇరవై యేళ్ళలో తను ఎంతమంది దేవుళ్ళకు మొక్కిందో....ఎన్ని దేవుళ్ళకు పూజలు చేసిందో....

ఆ పూజలన్నీ ఏమయినాయి? ఒక్క దేవుడికీ తనమీద దయ కలగలేదా?

దేవుడూ....నన్ను కరుణించు....నా కడుపున ఒక కాయ కాయించు....స్త్రీగా పుట్టినందుకు నా జన్మకు సార్ధకతను ప్రసాదించు....

ఈ ఒక్క కోరికే దేవుడూ....ఓ చిన్న కాంతికిరణం చాలు....

ఇలా ఎన్నిసార్లో ఎన్నో రాత్రులు దిండులో తల దూర్చి గుండెలు నొప్పిపుట్టేలా కుమిలి కుమిలి ఏడ్చింది జానకమ్మ.

ఐనా ఆ దేవుడికి జానకమ్మమీద దయ కలగలేదు....దేవుడు తన పట్ల ఎంత నిర్దయగా ప్రవర్తించినా ఆమెకు దేవుడిమీద నమ్మకం సడలిపోలేదు....ఇంకా యెక్కువయింది. ప్రతి వస్తువులోనూ దేవుడిని చూడగలుగుతోంది....

'నువ్వు నిప్పుల్లో దూకితే నీకు కొడుకు పుడతాడు' అని ఏ దేవుడయినా కల్లో కనిపించి చెబితే దూకటానికి సిద్ధంగా వున్నది జానకమ్మ....

కనీసం జానకమ్మకు దేవుడు అలాంటి సలహాలయినా ఇవ్వటంలేదు....ఇస్తే ఆమె జీవితం అంతమై పోతుంది. అప్పుడు ఇలా బ్రతికుండి నరకం అనుభవించటం తప్పిపోతుంది....

జానకమ్మ చీకటి బ్రతుక్కి వెలుగును చూపేదెవరు?

"ఎవరో ఎందుకు? అమితానందస్వామీజీ నీ జీవితానికి వెలుగును ప్రసాదిస్తారు జానకమ్మా" అన్నది ఆ రోజు ఉదయం జానకమ్మతో పక్కింటి విధవామె.

ఆ క్రితంరోజు రాత్రే స్వామీజీ ఆ వూరు వచ్చాడు....ఆయన ఇంతకుముందు ఎంతో

మరో మార్గం లేదు.. ఐయామ్ వెరీ సారీ మాధవీ !!



మందికి యాభయ్యో ఏట కూడా సంతానభాగ్యం కలిగించాడని చెప్పింది పక్కింటామె.

జానకమ్మకు ఆ మాటలు వినగానే ఆశ మరిన్ని చిగురులు వేసింది....వెంటనే ఈ విషయాన్ని భర్తతో చెప్పింది....ఆ స్వామీజీని మరురోజు తమ యింటికి భిక్షకు రమ్మని ఆహ్వానించుదామన్నది. సరేనన్నాడు భర్త.... సాయంత్రం ఆఫీసునించి ఐదు గంటలకే వస్తాననీ, ఆమెను కూడా తీసుకుని స్వామీజీ దగ్గరకు వెడదామనీ అన్నాడాయన....కాని ఇంత వరకు రాలేదు.

భర్త రాకకోసం యెదురుచూస్తోంది జానకమ్మ....

ఆరున్నర దాటుతుండగా వచ్చాడు భర్త రంగనాధం.

ఆఫీసులో పని ఎక్కువగా వుండటంవల్ల రాలేకపోయానని చెప్పి జానకమ్మను తీసుకుని హడావిడిగా రిక్షాలో స్వామీజీ బస దగ్గరకు బయల్దేరాడు రంగనాధం....

ఆయనకీ మనసులో ఆత్రుతగానే వుంది.... ఈ స్వామీజీ ఏం చెబుతాడో? ఈయన దయ వల్లనైనా జానకి కడుపున ఓ కాయ కాస్తే.... తమ జీవితాలకు దిగులు వుండదు....పాపం.... జానకి యెంతటి ఘోరమయిన నరకాన్ని అనుభవిస్తోంది?

రిక్షా ఆగింది....దిగారు.

అప్పటికే అక్కడ చాలామంది స్వామీజీ దర్శనార్ధం వచ్చి వున్నారు....అంతమంది వున్నా రంగనాధం దంపతులకు స్వామీజీ దర్శనం త్వరగానే అయ్యింది. అక్కడ రంగనాధంకి బాగా తెలిసిన వ్యక్తులు వున్నారు.... వాళ్ళే స్వామీజీని ఆ వూరు రప్పించారు....

భక్తితో స్వామీజీకి సాష్టాంగ నమస్కారం చేశారు జానకమ్మ, రంగనాధం.... ఆయన చిరునవ్వుతో దీవించారు. మరురోజు భిక్షకి తమ యింటికి రావలసిందిగా కోరాడు రంగనాధం....స్వామీజీ కుదరదని అన్నారు.... ఐనా రంగనాధం తన పలుకుబడిని ఉపయోగించి ఆ మరురోజు ఉదయం స్వామీజీ తమ యింటికి భిక్షకు వచ్చేట్టుగా ఆయన అంగీకారాన్ని పొంది జానకమ్మతో ఆయనకు మరో సారి నమస్కారం చేసి అక్కడినించి బయటకు వచ్చాడు....

"స్వామీజీ ఐనా మనల్ని అనుగ్రహిస్తారా?" దుఃఖంతో పూడుకుపోయిన గొంతుతో అడిగింది జానకమ్మ....అనునయంగా భార్య

భుజంమీద చిన్నగా తట్టాడు రంగనాథం....

* * *

అద్దంలో తన నిండు రూపాన్ని చూసు కున్న ఉషకు తనలో తన శరీరంలో ఏదో మార్పు కలిగినట్లు లీలగా అనిపించింది. మరింత పరీక్షగా చూసుకుంది. పదిరోజులనించే తను అనుమానపడుతోంది.

ఇప్పటికి రెండునెలలు గడిచిపోయాయి.... ఇంట్లో చెప్పలేదు....

కొంపదీసి తన అనుమానం నిజమేనా?

మైగాడ్! తను చచ్చిపోతుంది....

గబగబా డ్రెస్ చేసుకుంది....హాండ్ బాగ్ని తీసుకుని చెప్పులు టకటక లాడించుకుంటూ తన గదిలోనించి బయటకు వచ్చి మెట్లు దిగి కిందికి వచ్చింది....

కింద డ్రాయింగ్ రూమ్‌లో ఉష తల్లి మహిళామండలి సభ్యులతో మాట్లాడుతోంది. ....కూతురి హడావిడి నడక చూసి "ఏమిటీ ఆ తొందర?" అన్నది నవ్వుతూ.

"ఏడుగంటలకు సరిత ఇంటికి వస్తానని ప్రామిస్ చేసాను మమ్మీ" అన్నది గారేజ వైపు చూస్తూ.

గారేజ్‌లో కారు లేదు....

"కారు యేమయ్యింది మమ్మీ?...." అడిగింది.

"వాడు మోహన్ తీసుకెళ్ళాడు" చెప్పింది తల్లి.

'వీడొకడు....కారును బతకనివ్వడు....' అనుకుంటూ విసుగ్గా బయటకు వచ్చింది....

రోడ్డుమీదకు రాగానే ఖాళీగా వున్న ఆటో వస్తూ కనిపించింది. దాన్ని ఆపి ఎక్కి కిరణ్ ఎడ్రస్ చెప్పింది ఉష.

ఆటో ముందుకు దూసుకుపోయింది.

ఉష ఆలోచనలు వెనక్కి పరుగు దీస్తున్నాయి.

రెండు నెలల క్రితం ఓ రాత్రి కిరణ్ గదిలో తను పొందిన అమర సుఖం గురించి ఆలోచిస్తోంది....

ఓహ్....ఎంత మధురమయిన అనుభవం? ....ఆ తర్వాత ఎన్నోసార్లు ,ఆ గదిలో.... కిరణ్‌తో....

దాని ఫలితమేనా తనలో యీ మార్పు??

ఆటో ఆగింది....ఫేర్ చెల్లించి గేటు నెట్టుకొని గబ గబా మెట్లెక్కి పై నున్న గదిలోకి వెళ్ళింది.

ఉష వెళ్ళేసరికి కిరణ్ సిగరెట్ కాలుస్తూ టేప్ రికార్డర్‌లో ఓ హిందీపాట వింటున్నాడు.

"హల్లో డార్లింగ్ కమాన్" అన్నాడు ఉషను చూసి నవ్వుతూ.

వెళ్ళి అతని ఎదురుగా కూర్చుంది.

"ఏమిటీ అలా వున్నావ్? వాట్ హేపెండ్? ఎనీ థింగ్ రాంగ్??" ఆమె రెండు భుజాల మీదా చేతులు వేసి నొక్కుతూ అడిగాడు.

తన మనసులో వున్న అనుమానాన్ని బయట పెట్టింది ఉష.

"ఇంతేనా? యూ డోంట్ వర్రీ....నాకు తెలిసిన ఓ డాక్టర్ ఫ్రెండ్ వున్నాడు....వాడి దగరకు వెడదాం....జస్టు ఫైవ్ మినిట్స్" అని సిగరెట్టును బయటకు విసిరి టవల్ తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళాడు కిరణ్....

పాట వింటూ కూర్చుంది ఉష.

కొంచెంసేపట్లో ఇద్దరూ స్కూటరుమీద డాక్టర్ ప్రకాష్ దగ్గరకు వెళ్ళారు.

అతను ఉషను బాగా ఎగ్జామిన్ చేసి నెల తప్పిందని చెప్పాడు.

"మైగాడ్!...." అన్నది ఉష కంగారుగా.


"యూ సిల్లీ....ఇందులో ఏముంది? ఎందుకలా భయపడతావ్?" అన్నాడు కిరణ్.

"మా డాడీకి, మమ్మీకి తెలిస్తే షూట్ చేస్తారు...."

"తెలిస్తే గదా!"

"తెలీకుండా ఎలా?"

"యూ చైల్డిష్....ఇంత ఇన్నోసెంట్ వనుకోలేదు....ఎబార్షన్ సంగతి మరచిపోయావా...." అని "ఏరా ప్రకాష్....మరి ఎబార్షన్ ఎప్పుడు చేస్తావ్?...." అన్నాడు కిరణ్.



"ఎబార్షన్ అవసరం వుందంటావా?" అడిగాడు డాక్టర్.

"ఎందుకు లేదు. అబార్షన్ చెయ్యకుండా ఎలా?"

"ఏం లేదు....మీరిద్దరూ మ్యారేజ్ చేసుకోబోతున్నారు కదా!"

"ఎందుకు!" అడిగాడు కిరణ్.

"చేసుకునేట్టయితే ఇప్పుడే చేసుకోండి. ఎబార్షన్ అవసరం ఉండదు."

"నో....నే నందుకు ఒప్పుకోను" అన్నది ఉష.

"ఎందుకూ?" ప్రకాష్ అడిగాడు.

"ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోదల్చుకోలేదు. చేసుకున్నా యిప్పట్నించే పిల్లలు వద్దు....దర్టీగా వుంటుంది....ఇప్పుడే పిల్లలు పుడితే వన్నియర్ అయ్యేసరికి అమ్మమ్మలాగా తయారవుతాను. ఐ డోంట్ లైకిట్....నాకు పిల్లలు వద్దు....ఎబార్షన్ చెయ్యండి డాక్టర్" అన్నది ఉష.

"యస్....నా ఐడియా కూడా అదే" అన్నాడు కిరణ్.

ఉష మాటలకు డాక్టర్ ప్రకాష్ షాక్ తిన్నాడు. ఉషకేసి ఆశ్చర్యంగా చూసి "స్త్రీకి మాతృత్వం ఎంతో విలువైనది. అందునా తను తొలిసారిగా తల్లి కాబోతుందని తెలిసినప్పుడు ఎంతో సంతోషపడుతుంది....ఈ దేశంలో ఎంతమంది స్త్రీలు సంతానంకోసం చెట్లకి, పుట్టలకి మొక్కుతున్నారో మీకు తెలుసా!" అన్నాడు డాక్టర్.

"అలాంటివాళ్ళను నా దగ్గరకు పంపించు ప్రకాష్....మేము నీ దగ్గరకు వచ్చింది యీ విషయాలు తెలుసుకోటానికి కాదు....ముందు ఎబార్షన్ ఎప్పుడు చేస్తావో చెప్పు" అన్నాడు కిరణ్ అదోలా మొహం పెట్టి.

"ఆల్‌రైట్!....మీ ఇష్టం ఓ నాలుగు రోజుల్లో చేస్తాను" అన్నాడు.

"నాలుగురోజులా? కుదరదు....వెంటనే జరిగిపోవాలి... రేపే చేసెయ్యి....ఇంకా లేట్ చెయ్యటానికి వీల్లేదు."

"సరే....అలాగే....రేపు మార్నింగ్ టెన్‌కి వస్తే సాయంత్రం యింటికి వెళ్ళిపోవచ్చు."

"థాంక్యూ!" అని లేచి నిలుచున్నాడు

కిరణ్. తను కూడా ప్రకాష్‌కి థాంక్స్ చెప్పి కిరణ్‌తో బయటకు నడిచింది ఉష.

"బ్యూటీ క్వీన్‌గారి మనసు కుదటపడ్డ టేనా?" స్కూటర్ స్టార్టు చేస్తూ అడిగాడు కిరణ్.

నవ్వింది ఉష.

రాత్రి తొమ్మిది గంటలవరకూ కిరణ్‌తో గడిపి ఇల్లు చేరుకుంది ఉష. ఆ రాత్రి ఆమెకు నిద్ర పట్టలేదు. 'ముందు ఈ పీడను వదలించు కుంటేగానీ నిద్ర పట్టదు' అనుకుంది.

చివరికి ఎప్పటికో నిద్రపోయింది....

తెల్లవారింది....లేచేసరికే ఎనిమిది గంట లయింది. తొమ్మిదిన్నర అయ్యేసరికి డ్రెస్ చేసుకుని తన గదిలోంచి బయటకు వచ్చి మెట్లు దిగబోతుండగా ఎదురింట్లోకి వెళుతున్న అమితానందస్వామీజీ ఆయన శిష్యులు కని పించారు.

అప్పుడే పైకి వచ్చిన పనిమనిషి వర దమ్మను "వాళ్ళంతా అ ఎదురింట్లోకి ఎందు కొచ్చారే" అనడిగింది.

"ఏవుందమ్మా.......మామూలే....ఆ జాన కమ్మగారికి పిల్లలు లేరు గదా....అందుకని ఆమె సోములోరికి యివాళ పూజ చేసుద్దంట" చెప్పింది వరదమ్మ తనూ వాళ్ళని చూస్తూ.

ఆ మాటలు వింటూంటే ఉషకు అంతులేని నవ్వొచ్చింది.

'స్వాములవారికి పూజ చేస్తే పిల్లలు పుడ తారా? బ్రైన్‌లెస్ ఫెలోస్' అనుకుంటూ గబ గబా మెట్లు దిగింది.

* * *

సాయంత్రం ఐదుగంటలయింది.

మేడముందు ఆటోలోనించి దిగింది ఉష. ఫేర్ చెల్లించింది.

ఆటో వెళ్ళిపోయింది. గేటు నెట్టుకొని లోపలకు వెళ్ళబోతూ ఆగిపోయింది.

ఉషకు యెదురింటి బయట గుంపులు గుంపులుగా ఆడా మగా నిలబడి ఏవో మాటలు చెప్పుకుంటూ కనిపించారు.

ఒక్క నిమిషం అక్కడ నిలబడి విషయం తెలీక లోపలకు నడిచింది.

ఉషకు నీరసంగా వున్నా గుండెల్లో కత్తిలా వున్న ఆ పీడ వదలిపోయినందువల్ల సంతో షంగా, హుషారుగా వుంది.

మేడమీదికి వెళ్ళి ఎదురింట్లోకి చూసింది. త్రుళ్ళిపడింది.

జానకమ్మ శవాన్ని ముందు గది బయట పడుకోబెట్టారు....రంగనాథం సన్నగా ఏడు స్తున్నాడు....ఆయన్ని యెవరూ ఓదార్చలేక పోతున్నారు.

'ఆమె యింత హఠాత్తుగా యెలా చని పోయింది? ఉదయం కూడా ఆమె బాగానే వుంది....ఇంతలోనే....'

ఉష ఆలోచిస్తూ నిలబడిపోయింది.

ఇంతలోనే ఉష గదిలోనించి చీపురుతో బయటకు వచ్చింది పనిమనిషి వరదమ్మ.

"ఆమె యింత సడన్‌గా యెలా చచ్చి పోయిందే వరదమ్మా" అడిగింది ఉష.

"ఏముందమ్మా... బలవంతంగా సచ్చి పోయింది...."

"ఎందుకు?"

"ఇంకెందుకు? ఆ పొద్దున్నొచ్చిన సోము లోరు ఆ యమ్మ సెయ్యి జూసి ఈ జన్మకు పిల్లలు పుట్టరని సెప్పాడంట....అందుకని ఆయ నటు వెళ్ళగానే యిషం తిని సచ్చి పోయింది."

ఉషకు కడుపులో యెవరో చెయ్యిపెట్టి దేవినట్లనిపించింది.

గుండెల్లో కలుక్కుమంది.

పిల్లలు లేరని ఆమె విషం తిని చచ్చి పోయిందా? పిల్లలు లేకపోవటం ఇంత దారు ణానికి దారి తీస్తుందా!

'స్త్రీకి మాతృత్వం యెంతో విలువైనది' డాక్టర్ ప్రకాష్ మాటలు ఉష చెవుల్లో గింగురు మంటున్నాయి....

'ఆడదానికి మాతృత్వం యింత విలు వైనదా?' అవును. అందుకు ప్రత్యక్ష సాక్ష్యం యెదురింట్లో శర్త ఒళ్ళో ప్రశాంతంగా నిద్ర పోతున్నట్టున్న జానకమ్మ శవం. □

మినీ కథ

చెప్పడానికే నీతి

మల్లిక్

రెండో నెంబరు బస్సు దుమ్మురేపుకుంటూ వచ్చి ఆగింది. అది రేపినదుమ్ము బస్సును దాటి మేఘంలా వెళ్లిపోయింది. బస్సుస్టాపులో పావుగంటనుండి ఎదురుచూస్తున్న జనం బస్సు మీదకు విరుచుకుపడ్డారు. వెంగళ్రావు భార్యామణి చింతామణితో బస్సెక్కాడు. ఎక్కడైనా కూర్చోడానికి సీటు దొరుకుతుందేమోనని చుట్టూ కలయజూశాడు.. ఎక్కడా సీటులేదు. నిలుచోకతప్పదు. కానీ లేడీస్ సీటు ఒకటి ఖాళీగా ఉంది. అందులో చింతామణి కూర్చో వచ్చుగానీ అందులో ఎవరో ఒకతను కూర్చుని ఉన్నాడు.

"చూశారా....ఆడవాళ్ల సీట్లో ఎలాకూర్చున్నాడో? నన్ను చూసికూడా లేవట్లేదు....మీరైనా చెప్పండీ" చింతామణి వెంగళ్రావు డొక్కలో పొడిచింది.

"ఉండవే అడుగుతాను" డొక్క తడుముకున్నాడు వెంగళ్రావు.

బస్సుకదిలింది. అతను కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు.

"ఏయ్ మిస్టర్...." వెంగళ్రావు పిలిచాడు.

అతను చూడలేదు. వినపడలేదో లేక వినబడీ వినబడనట్లు నాటకమో!!....

"ఏమండీ మిమ్మల్నే...." ఈసారి కాస్త గట్టిగా పిలిచాడు. అయినా లాభంలేకపోయింది.

"మిస్టర్....మిమ్మల్నే" ఈసారి అతని భుజంతట్టి పిలిచాడు.

తలపైకెత్తి ఏమిటన్నట్లు చూశాడతను.

"ఇది ఆడవాళ్ల సీటు!...." అన్నాడు వెంగళ్రావు.

"ఆడవాళ్ల సీటని ఎక్కడా రాసిలేదే?" అన్నాడతను నిర్లక్షంగా.

"రాసి ఉండక్కర్లేదు. బస్సులో మొదటి మూడు సీట్లూ ఆడవాళ్లకోసం కేటాయించబడినవని అందరికీ తెలుసు...."

"నాకు తెలీదు" అన్నాడతను విసురుగా.

"ఇప్పుడు నేను చెప్తున్నానుగా?" వెంగళ్రావు అంతకంటే విసురుగా అన్నాడు.

"మీరు చెప్పినంత మాత్రాన నేను వినాలని లేదుగా?"


బస్సులో వాళ్లందరి తలలూ అప్పటికే వీళ్లవైపు తిరిగాయి.

"అది లేడిస్ సీట్ నాయనా....లేచి ఆవిడకు సీటివ్వు" ఎవరో ముసలాయన అన్నాడు.

"నేనెందుకు లేవాలి.... నేను ఈ బస్సు స్టార్టింగు పాయింటునుండీ కూర్చుని వస్తున్నాను. ఇప్పుడిప్పుడే బస్సు ఎక్కి సీటురెడిగా ఉండాలంటే ఎలా?...."

"మేము బస్సు ఇప్పుడే ఎక్కి ఉండవచ్చు కాని బస్సుస్టాపులో గంటనుండీ బస్సుకోసం నిలబడి ఉన్నాము" వెంగళ్రావు కోపంగా అన్నాడు.

"అయితే అందుకు నేనేం చెయ్యను.... బస్సుల ఫ్రీక్వెన్సీ పెంచమని వెళ్లి డిపో మేనేజరుకి చెప్పుకోండి. నేనుకూడా ఒకగంట బస్సుకోసం ఎదురుచూసే ఎక్కాను. అయినా నా పక్కన సీటుందిగా. మీ ఇద్దరిలో ఎవరు కూర్చున్నా నాకు అభ్యంతరంలేదు," అదే నిర్లక్ష్యంతో సమాధానం చెప్పాడతను.



వెంగళ్రావుకి కోపం నసాళానికి అంటింది.

"ఏమిట్రా కూస్తున్నావ్?.... నా భార్య నీ పక్కన కూర్చోవాలా?.... పళ్లురాలగొడతా ఏమనుకున్నావో" గట్టిగా అరుస్తూ అన్నాడు.

"రా....గీ....అంటూ పేల్తున్నావేమిటి? మర్యాద ఇచ్చి మాట్లాడు. నేనూ పళ్లురాలగొట్టగలను" అంతకంటే గట్టిగా అరుస్తూ అన్నాడు అతను.

"నీకు మర్యాద ఏమిట్రా....నిన్నూ...."

ఇద్దరికీ మధ్య వాగ్యుద్ధం ఒక పదినిమిషాల పాటు సాగింది. బస్సులోని అందరూ వెంగళ్రావు తరఫునే మాట్లాడేరు.

"ఈ కుర్రకారుకంటె మన ముసలాళ్లమేనయం....వీళ్లు ఒక అయిదు నిమిషాలుకూడా నిలబడలేరు."

"అయినా ఆడవాళ్ల సీట్లో కూర్చుని కూడా ఎలా దబాయిస్తున్నాడో చూడండి...."

"పొగరండీ బాబూ...."

"అతనైతే ఊరికే అనవసరంగా వాగుతున్నాడుగానీ నేనైతే రెండందుకునే వాడిని"

"ఆ ముఖం చూడండి .... రౌడీముఖం వాడూను"

ఇలాసాగాయి బస్సులోవారి కామెంట్లు. అందరూ అతన్ని లేచి చింతామణికి సీటివ్వమని గోలచేశారు. చివరికి అతనికి లేవకతప్పలేదు. చింతామణి ఒకసారిమూలిగి రుసరుసలాడుతూ కూర్చుంది. వెంగళ్రావు నిలబడే ఉన్నాడు.

"ఆమె పక్కసీటు ఖాళీగానే ఉందిగా.... మీరూ కూర్చోండి...." ఎవరో వెంగళ్రావుతో అన్నారు.

"అబ్బే....అది లేడీస్ సీటుగా...." వెంగళ్రావు మొగమాట పడ్డాడు.

"అయితే ఏం?.... ఇప్పుడెవరూ లేరుగా.... ఎవరైనా ఆడవాళ్లు వచ్చినప్పుడు లేచి సీటివ్వొచ్చు"

వెంగళ్రావు తెగ మొగమాట పడిపోతూ చింతామణి పక్కన కూర్చుంటూ తమవెనక సీటువైపుచూశాడు. వెంగళ్రావు మనసు చివుక్కుమంది. వెనక సీట్లోని ఆమె వంకరగా నవ్వుతూ వెంగళ్రావు కళ్లలోకి చూసింది సూటిగా. ఆమె కళ్లలో ఛీత్కారం.

అవును ఆమే!!....

రెండురోజులక్రితం లేడీస్ సీటు విషయమై వెంగళ్రావుకూ ఆమెకూ గొడవజరిగింది.

"పురుషులతో సమానమైన, హక్కులు అంటారు. మరి ఈ రిజర్వేషన్లేమిటి....నేను ఈ సీట్లోంచి లేవనుగాక లేవను" అని అన్న వెంగళ్రావుమాటలు ఆమె చెవుల్లో ఇంకా గింగురు మంటున్నాయి. □

తిరిగిరాని క్షణాలు



ముళ్ళపూడి నాగేశ్వరరావు

సిగరెట్ మళ్ళీ ఆరిపోయింది. తడిసిపోయిన మీద కాబోలు మళ్ళీ మళ్ళీ ఆరిపోతోంది. వెలిగిద్దామా వద్దా అని ఆలోచిస్తుండగానే ఆ సిగరెట్ చేతిలోంచి జారిపోయింది. అతను మళ్ళీ ఆలోచనలలోకి జారిపోయాడు. తనని మిగతా రిక్షావాళ్ళని విడదీసేది ముఖ్యంగా ఆ సిగరెట్టే. తనకు తెలుసున్న రిక్షావాళ్ళెవళ్ళూ సిగరెట్ కాల్చరు. అందరూ చుట్టో, బీడినో కాలుస్తారు. కాని తనకు మాత్రం స్టూడెంటు రోజుల్లోని అలవాటు మిగిలిపోయింది. తను చదువుకున్న పన్నెండు సంవత్సరాల చదువు, తన గుర్తుగా మిగిల్చిపోయిన వస్తువు— సిగరెట్.

టైమెంతయి వుంటుందో? ఒంటి గంటవుతుందేమో. అతను లోపలికెళ్ళి అరగంటవుతుంది కాబోలు. ఏమో ఈ చీకటిలో, కటిక చీకటిలో జారిపోయిన టైమెంత? అతనింకా ఎంతసేపుంటాడో లోపల? ఎంత సేపయినా వుండచ్చు. మరో రెండుగంటలు, మరో మూడు గంటలు. అవును అతనామెని ఆ రాత్రికి కొనుక్కున్నాడు. ఆ రాత్రి ఆమె సర్వస్వం అతనిది.

ఆమె. ఆమె గుర్తుకొచ్చేసరికి అతని గుండెల్లో ఏదో అయ్యింది.

ఆమె నిన్న అందగత్తె, నేడు అందగత్తె, రేపుకూడా అందగత్తె. ఆమె అందం సూర్యుడిలా మార్పులేనిది. ఎంతమంది మూర్ఖుల చేతుల్లో పడి నలిగినా చెక్కు చెదరదు ఆమె అందం.

ఆమెను ఊహించడానికి ప్రయత్నించాడు. ఊహించేడు. కాని ఆమె సంపూర్ణమయిన విగ్రహాన్ని ఊహించలేక పోయాడు. విసుక్కున్నాడు. మళ్ళీ సంబాళించుకున్నాడు. అవును ఆమె అందం ఊహాతీతమైనది.

మళ్ళీ ఆమెని ఊహించడానికి ప్రయత్నించాడు. ఇప్పుడామె ఎలా వుంటుంది? అతని శరీరం మంచుగడ్డలా అయిపోయింది. ఆ మోటు మనిషి చేతుల్లో నలిగిపోతూంటుంది. నవ్వుతూంటుందేమో? అవును నవ్వక తప్పదు కదా మరి. తాగుతూంటుందేమో? రిక్షా దిగేటప్పుడు వాడి చేతిలో సీసా వుందో లేదో చూడలేదు—చీకటివల్ల.

వాడి బండపెదాలు మందార రేకుల్లాంటి ఆమె సున్నితమైన పెదాల్ని.... ఒళ్ళు జలదరించింది అతనికి. ఉద్రేకం ఉప్పొంగింది. తలుపు బద్దలుకొట్టి లోపలికి వెళ్ళి ఆమెని విడిపించాలనిపించింది. అలా చేస్తే ఆమె తనకేసి యెలా చూస్తుందో? కోపంగా చూస్తుందా? అసహ్యంగా చూస్తుందా? భయంగా చూస్తుందా? లేక జాలిగా చూస్తుందా? కాని తనా పని చెయ్యలేడు. అయినా అతనామెనేం బలవంతం చెయ్యటంలేదుకదా? అతను కొనుక్కుంటున్నాడు. ఆమె అమ్ముకుంటోంది. సింపుల్. క్వయిట్ సింపుల్.

ఆమె అసలు ఎందుకీ వృత్తిలోకి ప్రవేశించిందో? అసలు తనెందుకీ వృత్తిలోకి ప్రవేశించాడు? రోజులు గడవడంకోసం.


అతనామెను యేం చేస్తూంటాడు?

ఆమె ఆకర్షణీయమైన కళ్ళల్లోకి ఒక్కసారి కళ్ళెట్టి చూస్తే, ఆమె నున్నని చెంపల్ని ఒక్కసారి స్పృశిస్తే, ఆ లేత ఎరుపు పెదాల్ని ఒక్కసారి ముద్దెట్టుకుంటే ఆమె పొడవైన ముక్కుని తన ముక్కుతో ఒక్కసారి అటూ ఇటూ కదిపితే. ఆమె అందమైన గుండెల్లో తల దాచుకుంటే.... జీవితం ధన్యమయినట్టే.

అతని నరాల్లో విచిత్రమైన సంచలనం కలిగింది. పాతికేళ్ళ అతని వయస్సు అతని మనస్సులో తీవ్రమైన కోర్కెను రేపింది.

చీకటిలోకి చూశాడు. కళ్ళు బాగా తెరిచి చూశాడు. ఏం కనిపించలేదు. ఆ చీకటి నేటి రోజులా వుంది. అంతలో ఆ చీకటిలో ఆమె రూపం కనిపించింది అస్పష్టంగా. అది భ్రాంతి అని తనకు తెలుసు.

ఇంతకీ తనెవరు? అష్ట్రాల్ ఓ రిక్షా లాగేవాడు. చిన్నప్పుడు హిస్టరీ మాస్టరంటూండేవాడు. "మీకంటే ఆ రిక్షా లాగేవాళ్ళు నయంరా" అని. అప్పుడా విషయం ఆలోచించలేదు. ఇప్పుడాలోచిస్తుంటే ఆయనలా ఎందుకన్నాడో అర్థంకావడంలేదు.



పల్లకీ ఎక్కినవాడికంటే మోసేవాడు గొప్పవాడనుకునేవాడు ఆ రోజుల్లో. కాని యిప్పుడలా అనిపించడంలేదు. తను చేస్తున్నది తక్కువపనా? ముమ్మాటికీ. "ఎద్దులా రిక్షా తొక్కుతూ, బెల్ కొడుతూ, సైడు బాబూ సైడంటూ...." ఓహ్ ఏమిటీ జీవితం?

అసలు తనెందుకు రిక్షా లాగాల్సొచ్చింది?

తప్పెవరిదీ? ఈ కాలానిదా? ఈ దేశానిదా? తన పరిస్థితులదా? లేక నిజంగా తన అసమర్థతదా?

పన్నెండు సంవత్సరాలపాటు రోజుకి ఐదు గంటల చొప్పున తను స్కూల్లో గడిపిన సమయం అతి వ్యర్థమేనా? తను నేర్చుకున్న చదువు....నిజంగా తనేమన్నా నేర్చుకున్నాడా?

ఏది యేమైనా తనీ పని మొదలుపెట్టేవాడు కాదుకాని "అతన్ని" చూశాక....అతనూ, తనూ ఆరోక్లాసువరకూ కలసి చదువుకున్నారు. అతనికీ తనకీ మధ్య నున్న ఒకే ఒక సామాన్య విషయం బీదరికం. అతనెప్పుడూ ఫస్టు బెంచిలో కూర్చునేవాడు. అతనికెప్పుడూ ఫస్టుమార్కొచ్చేది. అతను రాకపోతే మాస్టారందరూ ఎందుకు రాలేదని అడిగేవారు. "నేచురల్ సైన్స్" మాస్టారయితే పాఠం చెప్పేవారు కాదు కూడా.

అప్పటికి తను టెన్త్‌క్లాస్ పూర్తి చేసి మూడు సంవత్సరాలయ్యింది. నిరుద్యోగిగా ముప్ఫై ఆరు నెలల అనుభవం గడించాడు. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు. అమ్మ కష్టపడి తెచ్చే డబ్బుమీద ఆధారపడి బతుకుతున్నాడు. అమ్మకి జబ్బుచేస్తే చూపించడానికి ఆసుపత్రికి తీసుకెళ్ళాడు. తిరిగొస్తూ రిక్షా పిలిచాడు.

"చార్జీసు దగ్గరకి ఏవి...." ఆగిపోయాడు ఆ ముఖంచూసి.

"నువ్వు...." ఆశ్చర్యంగా అడిగాడు.

"ఎక్కు" అన్నాడతను. అప్పటికే అమ్మ ఎక్కేసి కూర్చుంది. ఇంటికెళ్ళిన తర్వాత అతన్ని ఇంట్లోకి పిలిచాడు. అతను తన పరిస్థితిని సంక్షిప్తంగా ఇలా చెప్పేడు.

"బియ్యేస్సీ ఫస్ట్‌క్లాసులో పాసయ్యాను కాని వెంటనే ఉద్యోగం వొస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. అలాగే రాలేదు. అదొచ్చేవరకూ ఆగే శక్తి నాకులేదు. ఇంకా ఎన్నాళ్ళు ఎప్పుడు ఆగిపోతుందో తెలియని గుండెతోటి అమ్మ రోజుకి పదిగంటలు పనిచేస్తుంది? అందుకే ఈ పని మొదలుపెట్టాను."

లేచి వెళ్ళిపోతూ అన్నాడతను "బ్రదర్ ప్రతివాడికి అదృష్టం ఎప్పుడో తగుల్తుంది. కాని ఎప్పుడో చెప్పలేం. దానికోసమని కాచుక్కూచోవడం అంత మంచిపనికాదు" అతను

వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతూ తనలోని "ప్రిస్టేజ్", "స్టేటస్" లాంటి దౌర్బల్యాల్ని తీసుకుపోయాడు.

తను రిక్షా తొక్కడానికి అమ్మ అభ్యంతర పెడుతుందనుకున్నాడు. కాని ఆమె అభ్యంతర పెట్టలేదు. అవును ఆమె వంటలు వండీవండీ తనే ఉడికిపోయింది.

నిరాశావాదులు గతాన్ని, ఆశావాదులు భవిష్యత్తునీ తల్చుకుంటూంటారుట. కాని తను నిరాశావాదయ్యుండి ఎప్పుడూ భవిష్యత్తు గురించి కలలు కంటూ వుంటాడు. అవి నిజం కావని తెలుసు. కాని వర్తమానం నుంచి తప్పించుకోవడానికదో మార్గం.

మళ్ళీ ఆమె గుర్తొచ్చింది. ఆమె ఇప్పుడు ఏం చేస్తూ వుంటుంది? వెన్నెలలాటి ఆమెనిచీకటిలా ఆక్రమించుకుంటూ వుంటాడు వాడు.

చలి విపరీతంగా వేస్తోంది. చిరిగిపోయిన మఫ్లర్‌ని మరింత గట్టిగా చుట్టుకున్నాడు. ఈ చలిలో....తన అదృష్టం బావుంటే "ఆమె" లాటి అమ్మాయిని కౌగలించుకుని వెచ్చని రగ్గు కింద పడుకుని వుండాల్సింది.

కాని ప్రస్తుతానికి తను రిక్షా తొక్కుతూ, బ్రోకర్ పనిచేస్తున్నాడు. అవును ఇదే నయం. పెద్ద కష్టపడకుండానే రాత్రికి పది రూపాయిలొస్తాయి.

ఆమె వెడల్పయిన కళ్ళల్లో ఎంత ఆకర్షణ? తనకి కవిత్వం రాదు ఆమెని వర్ణించడానికి. టెన్త్ క్లాసులో పరమహంసనే ఫ్రెండుండేవాడు. అతనెంత బాగా కవిత్వం చెప్పేవాడో. వైజాగ్‌లో మెడిసన్ చదువుతున్నాడని విన్నాడు. వాడు కనిపించినా బాగుండును. ఏదేనా ఉద్యోగం ఇప్పించేవాడు.

"నిద్రపోతున్నావా?" బొంగురుగా పలికిందా కంఠం.

"లేదుసార్". తను రిక్షా దిగాడు. ఆయనెక్కాడు.

అతనాపమన్నచోట ఆపాడు. అతను రిక్షా దిగి ఐదు రూపాయిల కాయితం చేతిలో పెట్టాడు. తను దానికేసి చూడకుండా జేబులో పెట్టుకున్నాడు.

రిక్షా వెనక్కి తిప్పాడు. రిక్షా ఆమె ఇంటి గుమ్మం ముందు ఆగింది. తలుపు తట్టాడు.

"ఎవరదీ" సన్నగా పలికిందా కంఠం. ఆ కంఠంలో విసుగు ధ్వనించింది.

అతను మాట్లాడలేదు. తనమీద తనే చిరాకు పడ్డాడు ఆమెను విసిగించినందుకు.

తలుపు తెరుచుకుంది. ఆమె నిలబడి వుంది. అలసటో నిద్రో సరిగ్గా తెలియటల్లేదు కాని ఆమె ముఖాన్ని ఆవరించుకుని వుంది. ఆమె నలిగిపోయిన తెల్లచీర కట్టుకుని వుంది. ఆమె నలిగిపోయిన తెల్లచీరలా వుంది.

ఆమె నవ్వలేదు. నవ్వడానికి ప్రయత్నించింది.

"ఏం కావాలి?" అని అడగలేదు. కాని అతనికి ఆమె చూపులలా అడిగినట్టనిపించాయి.

అతను మాట్లాడటానికి ప్రయత్నించాడు కాని మాట్లాడలేకపోయాడు.

"ఓహ్ ఐదు రూపాయి లివ్వాలికదూ!" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

మరో రెండు నిమిషాల్లో తిరిగొచ్చి "ఐదు లేదు. అతను మూడు పదులిచ్చాడు. మళ్ళీ సారిది కూడ కలిపి ఇస్తాను"

ఆమె పెదాలు కదులుతున్నాయి. అది మాత్రమే తెలుస్తుందతనికి.

అతను కదలలేదు. ఆమె అతను వెళ్ళిపోతాడేమో అనుకుంది.


"ఇప్పుడంత అవసరమా అయితే పది తీసుకోండి."

అతను తేరుకున్నాడు. "ఊహ ఒద్దు" అంటూ వెనక్కి తిరిగాడు.

ర ర ర

ఎక్కడో చదివాడు ఏదేనా ఒక బలమైన కోరిక పుడితే అది ఒక పట్టాన చావదు కదా మనిషిని చంపినంత పని చేస్తుంది. ఆ కోరిక పోవాలంటే ఒకటే మార్గం. అది ఆ కోర్కెని తీర్చుకోవడం.

ఎంత ఆలోచించినా అదే మంచిదనిపించింది.



ఆమె వెచ్చని నడుము చుట్టూ తన చేతులు బిగుసుకోవడం-అనే మధురమైన ఆలోచనతో ఆతను ఉక్కిరి బిక్కిరయిపోయాడు.

కాని మరో ప్రశ్న. అందరిలాగే తను ఆమె అందాన్ని డబ్బుతో కొనుక్కోగలడా? తనకా ధైర్యం వుందా? అప్పుడతనికి తనచేత పరమహంస బలవంతంగా చదివించిన ఓ కథ గుర్తొచ్చింది. ఆ కథలో రచయిత చివరన వాపోతాడు "సృష్టిలో అతి విలువైన, విలువ కట్టలేని వస్తువు విలువ రూపాయిన్నర" అని.

అలా చెయ్యడం ఆమెని అవమానించినట్టు కాదా? నిజం చెప్పాలంటే అలా చెయ్యడం తన మనస్సునే అవమానించడం.

మరేం చెయ్యాలయితే? ఇలాగే ఆమెని చూస్తూ వుండిపోవడమేనా? ఎంతకాలం?

ఆ రాత్రి ఆమె కలలోకి వచ్చింది. తెల్లటి చీరలో జుత్తు విరబోసుకుని మబ్బులమీద నడుస్తోంది. తనని పిలుస్తోంది. ఇంక ఆగలేకపోయాడు "ఏవయితే అయ్యింది" తనలో తనే అనుకున్నాడు.

ఆవేళ రిక్షా తొక్కడానికి వెళ్ళలేదు. రాత్రి భోజనం అయిపోయిన తర్వాత ఈ మధ్యనే కుట్టించుకున్న తెల్ల షర్టు, నీలంరంగు పాంటు వేసుకున్నాడు. పక్కింటి రాజేశ్వరి నడిగి పౌడరు డబ్బాతీసుకొచ్చి పౌడర్ రాసుకున్నాడు. ఎక్కువయి పోయినట్టనిపించింది. జేబురుమాలుతో తుడిచాడు. పౌడరంతా చెరిగిపోయింది. మళ్ళీ రాసుకున్నాడు. మళ్ళీ ఎక్కువయిపోయినట్టనిపించింది. జేబురుమాలుతో తుడిచాడు. జుట్టు దువ్వుకోవడంలో కూడ అలాటి కష్టమే ఎదురయ్యింది.

"ఎక్కడికిరా శోభనం పెళ్ళికొడుకులా తయారయి వెళుతున్నావు?" సత్యం పలకరించాడు.

"అబ్బే ఏదో చిన్న పనిమీద...." నసిగేసేడు. గుండె దడదడలాడింది. "కనిపెట్టేసినట్టున్నాడు వెధవ" అనుకున్నాడు.

అతని మనసు పరిపరివిధాల పోతోంది.

ఆమె ఒప్పుకుంటుందా? ఎందుకొప్పుకోదు? తనూ పాతిక రూపాయిలిస్తాడు. గుండెల్లో ఏదో భయం మొదలయ్యింది. ఆమె ఒప్పుకోదేమో. "నువ్వా. నీకూ నేను కావాలా? ఏవిటి డబ్బిస్తానంటున్నావా? డబ్బిస్తే మాత్రం నీలాటి మోటు మనిషితోటి, రిక్షా తొక్కేవాడితోటి నాకు సరసమేవిటి? నీ చవటకంపూ నువ్వూను" అంటే.

తను భరించలేడు—అలాటి అవమానాన్ని. అతనికి నీరసం వచ్చినట్టయ్యింది. వెనక్కి తిరిగి వెళ్ళిపోదామనిపించింది. కాని కాళ్ళు ముందుకే కదిలాయి. జీవితంలో ఎన్ని అవమానాలు భరించలేదు. ఇదొక లెక్క కాదు.

ఆమె ఇంటి తలుపు తట్టేటప్పుడు కూడ ఆలోచించాడు. కాని కోరిక అతనిలోని భయాల్ని అదిమి పట్టింది.

తలుపు తెరుచుకుంది. ఆమె నిలబడివుంది. ఎప్పటిలానే — అందంగా జాలిగా నవ్వుతూ. కాని అతనే ఎప్పటిలా రాలేదు. అతని శరీరం కంపిస్తోంది. అతను ఆమెకేసి చూశాడు. ఆ చూపుల్లో ఆరాధన, ఆవేశం, కోరిక, భయం ఇంకా ఏవో అనిర్వచనీయమైన భావాలు వున్నాయి.

"ఏవిటి?" మందారం రంగులో వున్న ఆమె క్రిందపెదవి, పై పెదవి నుంచి విడివడి కిందకు కదిలి మళ్ళీ పై పెదవిని చేరుకుంది. ఆ కదలికను చూస్తూ అలా వుండిపోయాడతను.

"ఏవిటి ఈవేళ రిక్షా తొక్కటల్లేదా?" అడిగింది ఆమె అతని వేషంలోని మార్పుని గమనించి.

"లేదు."

"ఏం?"

అతను మాట్లాడలేదు. చివరకు అన్నాడు. "నేను లోపలికి రావచ్చా."

ఆమె అలాటి మాటను ఊహించినట్టులేదు. తత్తరపడింది "అహ రండి, రండి" అంటూ గుమ్మానికి అడ్డు తొలగింది. అతను లోపలికి నడిచాడు. అదే మొదటిసారి అతను ఆమె ఇంట్లోకి ప్రవేశించడం.

ఎలా చెప్పాలో అతనికి తెలియటల్లేదు. పరిస్థితి ఏవిటో ఆమెకు అర్థం కావడంలేదు.

"కొంచెం మంచినీళ్ళిస్తారా?" అడిగాడు. అవును అతనికి నోరెండిపోతోంది. ఆమె లోపలికి వెళ్ళింది. అమ్మయ్య అని అతను ఊపిరి పీల్చుకున్నాడు. ఇంతలోనే ఆమె గ్లాసూ నీళ్ళతోటి గదిలోకి వచ్చింది.

ఆమె నడిచివస్తుంటే ప్రపంచంలోని అందమంతా ఒక స్త్రీమూర్తిగా మారి నడచివస్తోందా అన్నట్టుగా వుంది. ఆమె కళ్ళల్లోంచి, దయా, జాలీ, ప్రేమ, కరుణాలాటివన్నీ ఒక కాంతి పుంజంగా మారి ప్రసరిస్తున్నట్టున్నాయి.

ఆమెని చూస్తుంటే అతనికి వందల సంవత్సరాల క్రితం అంతఃపురాల్లో మ్రగ్గిపోయిన అందగత్తెలు గుర్తుకొచ్చారు.

"తీసుకోండి" అంది ఆమె.

అతని చెయ్యి వొణికింది. నీళ్ళు కొద్దిగా ఆమె చేతిమీద ఒలికాయి.

"థాంక్యూ."

ఆమె నవ్వింది రేకమందార పువ్వు విచ్చుకున్నట్టుగా.

ఆమె కళ్ళు కుతూహలంగా చూస్తున్నాయి.

ఆ క్షణం వచ్చింది. వచ్చేసింది.

చటుక్కున అతను ఆమె చేతిని పట్టుకున్నాడు "నేనీ రాత్రికక్కడే వుంటాను."

ఆమె అతనికేసి ఆశ్చర్యంగా చూసింది.

"ఏవిటి?" అంది తేరుకుంటూ.


"వదలండి" అంది ఆశ్చర్యంనుంచి తేరుకుంటూ.

"నేనుకూడ డబ్బిస్తాను". ఆ మాట అతను అనకూడదనుకున్నాడు. కాని అనేశాడు.

"అహ అదికాదు" ఆమె జాలిగా నవ్వింది.

"డబ్బు గురించి కాదు. మిమ్మల్ని చాలా కాలంనుంచి చూస్తున్నాను. మీరు వేరు, మిగతా వాళ్ళ వేరు. మీరు మంచి వాళ్ళు. మీరు నాలాంటిదాన్ని కోరడం న్యాయంకాదు."

ఆమె చివరి మాటల్ని అతను వినిపించుకోలేదు. ఆమె ముందరి మాటలు అంతవరకూ అతనిలో అణగివున్న కోర్కెను బయటకు



నెట్టాయి.

అతని చేతులు ఆమె దేహాన్ని ఆత్రుతతో చుట్టుకున్నాయి.

"వొద్దు. ప్లీజ్ వొద్దనద్దు. మీరు నాకు కావాలి."

ఆమె మళ్ళీ నవ్వింది—అందంగా జాలిగా.

ఆ నవ్వు ఆ గదిలో వాతావరణాన్ని పూర్తిగా మార్చేసింది. అతన్ని ఏవేవో లోకాలకు తీసుకుపోయింది. ఆరునెలలుగా ఆమెపట్ల వున్న కోరికలన్నీ అతని పెదవుల్లో చేరాయా అన్నట్టుగా అతని పెదవులు ఆమె పెదవుల్ని అద్దుకున్నాయి.

నిముషం, రెండు నిముషాలు....కాలం ఆగిపోయింది.

"అబ్బ వదలండి నాకు ఊపిరి ఆడటల్లేదు" అంది ఆమె సుతారంగా విడిపించుకుంటూ.

కాని అతను వొదలలేదు — కాదు వొదలలేడు. అతని వెచ్చని ఊపిరి ఆమె చెంపల్నీ, కనురెప్పల్నీ, మెడనీ, చెవుల్నీ కితకితలతో నింపేసింది.

ఆ రాత్రి మంచం, మంచంమీదున్న పరుపు, గదిలో సువాసనలు నింపే అగరొత్తులు, కిటికీ పక్కనే వున్న బోగన్‌విల్లా ఆ గదిలో వాతావరణంలో ఏదో కొత్తదనాన్ని కనిపెట్టాయి. ఆ రాత్రి ఆదమరచి నిద్రపోతున్న ఆ జంటనుచూసి నిశ్శబ్దం నిశ్శబ్దంగా నవ్వుకుంది.

తెల్లారగట్లలేచి వెళ్ళిపోతూ జేబులో వున్న పాతిక రూపాయలూ తీసి బల్లమీద పెట్టేడు.

"వొద్దు" అంది ఆమె.

"అహ ఫర్వాలేదు. ఉంచండి" అన్నాడు.

ఇంకా అతను ఆమెని నువ్వు అనలేకపోతున్నాడు.

ఆమె ఆ రూపాయి నోట్లని మడతపెట్టి అతని జేబులో పెట్టింది.

"మిమ్మల్నికూడ ఈ ఇంటికి వచ్చే మిగతా అందరితోను సమానంగా చూడలేకపోతున్నాను నేను. అందుకే వద్దు."

అతను మాట్లాడలేదు, ఆమె కళ్ళల్లోకి చూస్తూ వుండిపోయాడు.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?"

"మళ్ళీ ఎప్పుడు రాను?"

ఆమె నవ్వింది. అతను ఆమెవేపు అడుగువేసి ఆమె కనురెప్పలమీద ముద్దు పెట్టుకున్నాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చాలాకాలం తర్వాత ఆమె మళ్ళీ ఏడ్చింది.

అతరవాత అలాటిరాత్రులు చాలాగడిచాయి.

వాళ్ళిద్దరి హృదయాల మధ్యవున్న గోడలు కరిగిపోయాయి.

అతని పరిస్థితులగురించి ఆమెకి, ఆమె పరిస్థితుల గురించి అతనికి అవగాహన కలిగింది. ఆమె తల్లి గురించి, పెళ్ళవ్వవలసిన చెల్లెలి గురించి, వాళ్ళపట్ల తనకున్న బాధ్యత గురించి, ప్రేమగురించి, చాలా చాలా చెప్పింది ఆమె. వాళ్ళు తనమీద ఎలా అధారపడి వున్నారో, తను తనపీడ వాళ్ళమీద పడకుండా వాళ్ళకి ఎలా సహాయం చేస్తున్నది అతనికి వివరించింది.

ఒకరాత్రి అన్నాడతను. "నీకో విషయం చెబుతాను నవ్వవుకదా?"

"ఏ విషయం?"

"ఏదో ఒకటి. నవ్వనని సీరియస్‌గా తీసుకుంటానని సరిగ్గా సమాధానం చెబుతానని ప్రామిస్ చెయ్యి."

"ప్రామిస్. నువ్వేలాటి జోకేసినా ఆఖరికి నన్ను పెళ్ళి చేసుకుంటానన్నా నవ్వను సరా." అందామె అతని గుండెలపై తన చెవిపెట్టి వింటూ.

"అవును. మనం పెళ్ళిచేసుకుందాం."

నవ్వుతూ తలెత్తిన ఆమె అతని కళ్ళల్లోని సీరియస్‌నెస్ చూసి షాక్ అయిపోయింది.

"అవును ఇది జోక్ కాదు. నువ్వు నాకు కావాలి. నువ్వు లేకుండా బతకలేను నేను."

"ఇప్పుడూ నీదాన్నే కదా?"

"ఇలాకాదు. పూర్తిగా."

ఆమెకేం మాట్లాడాలో తెలీలేదు.

"నేనెలాగైనా ఉద్యోగం సంపాదిస్తాను. కష్టపడి పనిచేస్తాను. మీవాళ్ళ విషయంకూడా నేనే చూస్తాను" ఆవేశంగా చెబుతున్నాడతను. ఆమె అతనికేసి విచిత్రంగా చూస్తూ కూర్చుంది.

ఠ ఠ ఠ

పందొమ్మిదివందల డభై ఎనిమిది ఫిబ్రవరి ఇరవయ్యొకటో తారీకున జరిగిన అనేక పెళ్ళిళ్లలో వాళ్ళది ఒకటి-అనేక రకాల పెళ్లిళ్లలో వాళ్ళది ఒకటి.

"రిజిస్ట్రారాఫీసులో...."

"వొద్దు" అంది ఆమె అతనిమాట కద్దు తగులుతూ.

"మరి?" అన్నాడతను ఆశ్చర్యంగా.

"మనింట్లోనే చేసుకుందాం" అంది ఆమె నవ్వుతూ.

"ఎలా?" ఎలాగో చెప్పింది ఆమె. ఆ రోజు దేవుడి ఫొటో కెదురుగా ఆమె మెడలో పసుపు త్రాడు కట్టేడతను.

"మనగురించి ఎవరేం అనుకుంటారా? అని నువ్వు భయపడనక్కరలేదు" ఆ రోజు రాత్రి ఆమె ఒళ్ళో తల పెట్టుకుని పడుక్కున్నప్పుడు చెప్పాడతను.

"రేపటినుంచి మళ్ళీ రిక్షా లాగుతాను."

"వొద్దు" అంది ఆమె. "వొద్దు ఏదేనా ఉద్యోగానికి ట్రైచెయ్యండి. ప్రస్తుతానికి నా బాంక్ ఎకౌంట్‌లో డబ్బుంది. దాంతో మనం కొంతకాలం గడపవచ్చు. ఈలోపల మీకు ఉద్యోగం తప్పకుండా దొరుకుతుంది. అప్పుడు మీరు ప్రైవేటుగా చదువుకోవచ్చు. త్వరలోనే పెద్ద పోస్టులో కెళతారు."

"నేనంటే నీకెంత నమ్మకం."

మర్నాటినుంచి అతను ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టేడు. రెండు సంవత్సరాల కాలంలో ఉద్యోగావకాశాలు మరింత తక్కువయ్యేయి కాని పెరగలేదు.

ఇంటర్వ్యూలు వొస్తున్నాయి, వెళుతున్నాయి. ఉద్యోగం రావటల్లేదు.

"పర్వాలేదు పర్వాలేదు" అంటోందామె.


కాని ఎందుకో కొత్తలో వున్న హుషారు ఆనందం ఇప్పుడు లేవు.

"ఈ ఉత్తరం చూస్తారా?" అడిగిందామె.

"ఏదీ?" పరాగ్గా అందుకున్నాడతను.

"అక్కా-

నువ్వే కారణం వలనో కిందటి నెలా, ఈనెలా డబ్బు పంపలేదు. మాకేం చెయ్యాలో తెలీటల్లేదు. బావగారికి మాకు పంపడం ఇష్టంలేదా? అక్కా- ఈనెల ముందర పదిహేను రోజులు నేనూ, అమ్మా, చంద్రం ఒక



పూట భోజనం చేశాం. మొన్నటినుంచి అసలు భోజనం చెయ్యలేదు. ఎలాగో తెలీటల్లేదు. మామీద దయ ఉంచి డబ్బు పంపు. ఇంకా నా చదువు ఆరు నెలలుంది. ఆ తర్వాత నిన్నడగం. బావగారి నడిగేనని చెప్పు. నీ మనసు కష్టపెడితే క్షమించు—

రాజ్యం."

"డబ్బెందుకు పంపలేదు?"

ఆమె పాస్‌బుక్ అతని చేతిలో పెట్టింది. అందులో ఎకౌంట్ క్లోజ్ అయిపోయింది. చివరి ఐదురూపాయలు కూడ పదిహేనురోజుల క్రితం తీసేయబడ్డాయి. డబ్బూ, అమ్యూనిషన్ ఉన్నంతకాలం వాటి విలువ తెలీదు. అవి అయిపోతే జీవితం లేదు.

"ఎక్కడికేనా వెళదాం—బోర్ కొడుతోంది" అందామె.

"ఎక్కడికెళదాం?"

"అలా సినిమాహాళ్ళవేపు వెళదాం."

ఆదివారం సాయంత్రం మూలానా సినిమాల వీధి విపరీతమైన రష్‌గా ఉంది. అసలు రోడ్డుమీద నడవడానికి చోటులేదు.

"అబ్బ ఆరాధన మళ్ళీ వచ్చింది; నాగేశ్వరావు, సావిత్రీ - అనవసరంగా మిస్ అయిపోతున్నాం" నవ్వుతూ అంది ఆమె. కాని అతను నవ్వలేదు. తిరిగివొస్తున్నప్పుడు ఆమె చటుక్కున వెనక్కితిరిగింది—తన పే రెవరో పిలవటం విని. ఓ నలభై యేళ్ళమనిషి నవ్వుతూ నిలబడి ఉంది. ఆమె నోట్లో కిళ్ళీ ఎర్రగా, ఆమె పళ్ళు నల్లగా ఉన్నాయి. ఆమె పేరు సత్యవతి.

అతను ముందర నడుస్తున్నాడు. వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ వెనక నడుస్తున్నారు.

సత్యవతి ఆమెకి పూర్వాశ్రమంలో స్నేహితురాలు.

ఇంటిదగ్గర కొచ్చిన తర్వాత "ఆలోచించు" అంటూ సత్యవతి వెళ్ళిపోయింది.

"ఏవిటంటుం దావిడ?" అడిగాడతను.

"తర్వాత చెబుతాను."

అన్నట్టుగానే ఆమె తర్వాత చెప్పింది.

అతను నోట మాట రాకుండా అయిపోయాడు.

"ఇంపాసిబుల్."

ఆమె నవ్వింది. ఆ నవ్వులో జీవం లేదు—

"ఆవేశపడకండి. ఆలోచించండి."

"ఇందులో ఆలోచించడానికేమీ లేదు. నేను

రిక్షా లాగుదామని చూస్తున్నాను. ఎటొచ్చీ అద్దెకు రిక్షా దొరకటల్లేదు."

అతన్నెలా వొప్పించాలో ఆమెకు తెలియటల్లేదు.

"నేను చేతగాని వాణ్నని నిరూపించడానికేనా?"

"ఛఛ కాదు. అది కాదు. నా మాట వినిపించుకోండి. మనం యెలాగో ఓలాగ బతకాలి. మా అమ్మా, తమ్ముడు, చెల్లీ కూడ బతకాలి. అందుకు డబ్బు కావాలి. మీరు రిక్షా తొక్కినా మనం అందరం దానిమీద ఆధారపడి బ్రతకలేం."

"డామిట్! వాళ్ళకోసమని నువ్వొళ్ళమ్ముకోవడమేమిటి? త్యాగాలు చెయ్యడానికిదేం సినిమా కాదు."

"నేను త్యాగం చెయ్యడంలేదు. వాళ్ళ జీవితాలు ఆనందంగా సాగాలి. అది నా కోరిక. అదే నాకు అత్యంత ఆనందాన్నిచ్చే విషయం. త్యాగాలు, ధర్మాలు యివన్నీ ఎవరి ఆనందం కోసం వాళ్ళు చేసేవి. విచ్చుకుంటున్న మొగ్గలు సగంలో ఆగిపోవడం నా కిష్టంలేదు. నేనేమయిపోయినా వాళ్ళు బాగుపడాలి."

ఆమె ఉద్రేకంగా చెప్పింది. అతను మాట రాకుండా వుండిపోయాడు.

"ఏమండీ! మనం యెందుకు సిగ్గుపడాలి? మనలో యేం తప్పుంది కనుక. తప్పంటూ ఉంటే అది పరిస్థితులదీ, సంఘానిదీ...." ఆమె ఉద్రేకంగా చెప్పుకుపోతోంది. ఆమెలో అంత ఉద్రేకం అతనెప్పుడూ చూడలేదు.

చివరికి "నా అనుమతి నీకవసరం లేదు" అని వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి అడిగాడు "యేం నిర్ణయించుకున్నావ్?"

"నా నిర్ణయం మీ చేతుల్లోనే ఉంది."

"ఏమిటి?"

"ఐదు సంవత్సరాల క్రితం అంటే మొదటిసారిగా నా కిష్టం లేకుండా డబ్బుకోసం మొగవాడికి లొంగిపోయినప్పుడు సంపాదించేనా పొట్లం. ఆ పొట్లం మనకి డబ్బుతో ప్రమేయం లేకుండా యీ లోకాన్నుంచి దూరంగా తీసుకుపోతుంది? కాని యెందుకో ఆ పొట్లాన్ని నీళ్ళల్లో కలుపుకొని తాగే ధైర్యం నాకు లేకపోయింది. ఆ ధైర్యం నా కిప్పటికి కూడా లేదు. మీ నిర్ణయం యింకా మారకపోతే ఆ పొట్లాన్ని నీళ్ళల్లో కలిపి మీరెళ్ళిపోండి. నా చావుకి నేనే కారణమని రాసిపెట్టి అది తాగేస్తాను. మీ కెప్పటికి కృతజ్ఞురాల్నయి ఉంటాను. మీ రా పని చెయ్యకపోతే ఒప్పుకున్నట్టే లెక్క."

అతను షాక్ అయిపోయాడు. ఆ గదిలోంచి బయటకు వెళ్ళిపోయాడు అసహ్యంగా, భయంకరంగా ఉన్న చీకట్లోకి. చాలా కాలం తర్వాత అతను మళ్ళీ తన అసమర్థతను తల్చుకుని ఏడ్చాడు.

గదిలో మాటలు వినిపిస్తున్నాయి.

లైటు వెలిగింది. అంటే అతను వెళ్ళిపోతున్నాడన్నమాట.

వంటగదిలో చాపమీద పడుకుని ఉన్న అతను అసహనంగా కదిలేడు.

పదిహేను నెలల క్రితం తను రిక్షా తొక్కుతూ, ఆమె గురించి ఆలోచిస్తూ గడిపిన రోజులు యెంత బాగుండేవి! ఆ రోజులు ఎక్కడికి వెళ్ళిపోయాయి? అవి మళ్ళీ వస్తే ఎంత బాగుంటుంది?

వీధి తలుపు గడియవేసి ఆ గదికి వంటగదికి మధ్యనున్న తలుపు తీసిందామె.


అతను కళ్ళు మూసుకొని పడుకొని వున్నాడు.

"నిద్రపోతున్నారా?"

అతను మాట్లాడలేదు.

ఆమె లైటార్పేసి వెళ్ళి పడుకుంది. నలిగిపోయిన మల్లెపూవులు మెడవెనుక గుచ్చుకుంటున్నాయి.

ఆ రోజులు యెంత బాగుండేవి! అతను యెప్పుడొస్తాడో అని యెదురుచూస్తూ గడిపిన రోజులు. కాలం పదిహేను నెలలు వెనక్కుపోతే ఎంత బాగుంటుంది. ఆ తియ్యటి క్షణాలు యింక మళ్ళీ రావా! □



నార్లవారి నాటకం
సీత జోస్యం

రచయిత: శ్రీ నార్ల వెంకటేశ్వరరావు
వెల: పదిహేను రూపాయలు.
ప్రతులకు: నవోదయ పబ్లిషర్స్,
విజయవాడ-2, గుంటూరు-2.

ఒక్క బిగిని చదివించే 'సీత జోస్యం'లో ఇతివృత్త మిది. మునులందరూ తమను మోసగించి, మరింత ప్రమాదమని చెబుతూనే, దక్షిణానికే తీసుకుపోతున్నారని సీత గ్రహించింది. ఇది దక్షిణాపథాన ప్రశాంతంగా జీవిస్తున్న వారిని రామునిచేత చంపించటానికేనని ఆమె అభిప్రాయం. ఈ అమానుష హత్యాకాండ ఆపమని రాముణ్ణి బ్రతిమాలుతుంది, భంగపడుతుంది సీత. కుట్రలనీ కుహకాలనీ ఎత్తిచూపి ఎంత వివరంగా చెప్పినా రాముడు అర్థం చేసుకోడు. సీత మాట పెడచెవినిబెట్టి, నిర్హేతుకంగా రాక్షస సంహారమంటూ వెళ్ళిపోతాడు. ఈ చిన్న ఇతివృత్తాన్ని సుందరమైన నాటకంగా మలిచారు శ్రీ నార్ల.

ఉపసంహారణలతో సహా 131 పేజీల పీఠిక, 12 పేజీల రెండు అనుబంధాలు, 12 పేజీల రిఫరెన్సులు. 64 పేజీల నాటకం వెరసి శ్రీ నార్లవారి 'సీత జోస్యం'. వెనుక అట్టమీద 'నాకు కావలసింది మీ ఆమోదము కాదు. మీలో ఆలోచన....' అంటూ ప్రారంభించి 'మీలో కొందరికి కష్టం కలిగించటం ద్వారానే నా లక్ష్యాన్ని సాధించవలసి వస్తే అందుకు నేను వెనుదీయననటానికి నా నాటకాలే, వాటికి నా పీఠికలే తార్కాణాలు' అని వ్రాసుకున్నారు నార్ల వారు.

శ్రీ నార్ల ప్రముఖ సంపాదకునిగా, గొప్ప చదువరిగా, చెప్పుకోదగ్గ స్వంత గ్రంథాలయమున్న వ్యక్తిగా—వ్యక్తిగత పరిచయంలేని వారికి కూడా—తెలిసినవారే! ఏనాడో 'మాటా-మంతీ', 'పిచ్చా-పాటీ', 'నార్ల వారి మాట' ఇత్యాది రచనలతో తెలుగు పాఠకుల మనస్సులో స్థానం సంపాదించుకున్నవారే! విపుల పీఠికలు తెలుగు మాత్రమే చదువుకున్నవారికి కొత్తైనా ఆంగ్ల సాహిత్యంతో పరిచయమున్న వారికి బెర్నార్డ్‌షా తలపుకు రాకమానదు. షా నాటకాలు ఏ మేరకు ప్రదర్శనాయోగ్యత సంతరించుకున్నాయో చెప్పవలసిన అవసరంలేదు. "'వాల్మీకి తన కావ్యనాయకుని' అనే మాటలను అర్. జీ. బండార్కర్ నిర్నిమిత్తంగా వాడలేదు. ఆయన దృష్టిలో (జాబాలి పీఠికలో నేను వివరించినట్లు) రామాయణం కావ్యమే కాని చరిత్ర కాదు...."అంటారు నార్ల (49వ పేజీలో) ఇంత నిర్దిష్టమైన అభిప్రాయ మున్నప్పుడు కావ్య రామణీయకతను కాక దాని చరిత్రనూ, దానిలో ప్రదర్శించబడిన భౌగోళిక పాండిత్యాన్నీ, పురాతత్వ విశిష్టతను, సాంఘిక ఆచారాలను ఎందుకు తీసుకోవలసి వచ్చింది అని ప్రశ్నించుకుంటే సమాధానం దొరకదు. "ఒక జాతిగా మన మనస్సు వికా



సమగ్రం కావా? చదువుతున్నంతసేపూ ఏ పాశ్చాత్య పురాతత్వ శాస్త్రవేత్త పేరో లేక మరో ఉత్తరాది శాస్త్రవేత్త పేరో అడుగడుగునా కనపడుతూ, విషయాన్ని, అర్థంచేసుకోలేనంత జటిలం చేస్తూ, సాగిపోయిన ఈ పీఠికలో విచిత్రంగా రాహుల్ సాంకృత్యాయన్ పేరు కనపడదు. ఋక్వేదిక్ కల్చర్ (అవినాశ చంద్రదాస్)ని ఉటంకించినప్పుడు, ఋగ్వేద ఆర్యులను గురించి, పాదచారిగా ప్రపంచం పర్యటించి అనేక భాగాలను చూసి, 'కొన్ని సంస్థలు చేయవలసిన కృషిని ఒక వ్యక్తిగా సాంకృత్యాయన్ చేస్తే ఆ కృషి నార్లవారి దృష్టికి రాకపోవం దురదృష్టకరమనే అనుకోవాలి.


1954 ప్రాంతంలోనే జాగ్రత్తగా తర్కించి ఆంధ్ర వాల్మీకి వావిలికొలను సుబ్బారావుగారి 'మందరము' (శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం)ను తన విమర్శతో చిన్నాభిన్నం చేసివేసిన శ్రీ జి. పోలయ్యగారి పేరుగానీ, వారి 'విమర్శ-రామాయణం' ప్రసక్తి గానీ ఎక్కడా రాదు. అంతమాత్రంచేత వాటి విలువేమీ తగ్గదు. ఆయన అప్పటికే ప్రతి సర్గనూ ఆధారాలతో సహా విమర్శించారు.

సించటానికి మారుగా ముడుచుకుపోతున్నట్టుగా అనుమానించవలసి వస్తుంది" అన్నారు శ్రీ నార్ల. కనుక వికసింపచేయటానికి నార్లవారు పూనుకున్నారని పాఠకులు అభిప్రాయ పడటంలో తప్పులేదు. అయితే ఇటువంటి ప్రయత్నాలు యింతకు ముందు జరగలేదా! జరిగినవి

ఉదా:—యుద్ధకాండ 607

సీ॥ ఈయున్న వానరబృందంబు గణియించి
వివరింతు వినరయ్య వేయి కోట్లు
శంఖ శతకము మహాశంఖ సహస్రంబు
బృందశతము మహా బృంద మొక్క-
వే పద్మశతమును వే మహా పద్మము
లర్వ సముద్రముల్శతము శతము
శత మహౌఘంబులు శత సహస్ర శత
మహౌఘముల్ కలిగి........

1 కోటికి	అంకెలు	8	(10000000)	ఇట్టివి వెయ్యి
1 శంఖమునకు	,,	12	,,	ఇట్టివి నూరు
1 మహాశంఖ	,,	18	,,	ఇట్టివి వెయ్యి
1 బృందమునకు	,,	23	,,	ఇట్టివి నూరు
1 మహాబృంద	,,	28	,,	ఇట్టిది ఒకటి
1 పద్మమునకు	,,	33	,,	ఇట్టివి లక్షయు
1 మహాపద్మ	,,	38	,,	ఇట్టివి వెయ్యి
1 ఖర్వం	,,	43	,,	ఇట్టివి నూరు
1 మహాఖర్వం	,,	48	,,	— —
1 సముద్రం	,,	51	,,	ఇట్టివి నూరు
1 ఓఘం	,,	56	,,	ఇట్టివి నూరు
1 మహౌఘం	,,	61	,,	ఇట్టివి కోటి



—అంటూ వివరాలు చర్చించి ఇంతటి కపిసేన లంకలో ఎట్లా విడిసింది అని ప్రశ్నిస్తారు. ఇదే విషయాన్ని రీస్ డేవిడ్స్, డబ్ల్యు. హెచ్. మోర్‌లాండ్ లాంటి పేర్లను సామాన్యులు భయపడేట్టుగా వుటంకిస్తూ లెక్కలు తీసి ఏమనాలో తోచటంలేదంటారు నార్ల. లంకేకాక ఎన్ని భూఖండాలైనా అంత జనాభాను ఇముడ్చుకో లేదని నిర్ద్వంద్వంగా ప్రకటించారు పోలయ్యగారు. ఇలా వుదహరించుకుంటూ పోతే 'విమర్శ - రామాయణం'లో నుంచిగానీ, యితర గ్రంథాలలోంచిగానీ అనేకం వున్నాయి. వందపేజీలున్న ఆ చిన్నిపుస్తకం చదివితే రామాయణంపట్లా మూఢ నమ్మకాలపట్లా యెక్కువ వ్యతిరేకత కలుగుతుంది. హేతువాదదృష్టి అలవడుతుంది. రామభక్తులపై సీత జోస్యంలో సాధించబడిన వ్యంగ్యం రచయిత స్థాయినేమీ పెంచదు. ఒక వంక కావ్యమంటూనే కావ్య పరిశీలనగాక యితర పరిశీలనలన్నీ చోటు చేసుకునే టప్పటికి రచయిత చెప్పిన ధ్యేయంగాక చెప్పని లక్ష్యం ఏదో వున్నట్టు కనపడుతుంది.

పురాణాలలో బూతుల జోలికి వెళ్ళి "ఏ పురాణమైన యేమున్న దందులో! నీతి ముసుగుతోడ బూతుగాక?" అని నేను యిదివరలో వ్రాశానంటున్నారు నార్ల. ఈ సందర్భంగా 'పూర్వగాథా లహరి'ని పేర్కొన్నారు.

కానీ 'పురాణాలలో బూతు'ని సులభంగా నలుగురికీ అర్థమయ్యేట్టు వెలువరించిన షోలయ్యగారి నెందుకో మళ్ళీ విస్మరించారు. లక్ష్మణుడి పవిత్రత గురించి చర్చిస్తూ (125వ పేజీలో) లక్ష్మణుడు ఖచ్చితంగా సీతను చూసే వుండాలని తీర్మానించారు. అయితే అలాంటి Inherent contradictions ని గతంలో అనేకులు సూటిగా విమర్శించారు. "ఈ పురాణము లన్నియు వ్యాస నిర్మితము లందురు. పురాణము లన్నియూ ఒక్క వ్యాసునిచే వ్రాయబడినచో ఆయన ఇట్టి పిచ్చి వ్రాతలను వ్రాసియుండడు. రాముని అభిమానులు, స్వార్థులు, పరాన్నభుక్కులు జాత్యహంకారులు మొదలుగా గలవారు యిట్టి తప్పుడు వ్రాతలు వ్రాసి వారి గౌరవ నాయకుడైన వ్యాసుని పేర వెలువరించిరి"—అని నాలుగు ముక్కల్లో వాస్తవాన్ని విమర్శ-రామాయణంలో తేల్చేశారు. దానికి వుదాహరణగా బ్రహ్మాండ పురాణంలో బ్రహ్మ రాముడై పుట్టినట్టుగానూ, స్కంధ పురాణంలో త్రిమూర్తులే రాముడై పుట్టినట్టుగానూ, నిర్వాణ ఖండంలో బ్రహ్మ రాముడనీ, ఆయనవల్ల త్రిమూర్తులు పుట్టారన్నట్టుగానూ, పద్మపురాణంలో సావిత్రి శాపం చేత విష్ణువు రాముడై పుట్టినట్టుగానూ చిత్రించబడిందని చెప్పారు. ఏమైనా "రామాయణ భారతాలైనా, అష్టాదశ పురాణాలైనా వాటి ప్రధానోద్దేశాలు కుల వ్యవస్థను పరిరక్షించటమే, ఫ్యూడల్ సంఘాన్ని సుస్థిరం చేయటమే' అనే శ్రీ నార్ల భావనతో హేతువాదులు ఏకీభవిస్తారు. అలవాట్ల మీద, ఆచారాలమీద, గణతంత్ర వ్యవస్థల ఎదుగుదలపైన ఎంతో కృషి సలిపిన దేవీప్రసాద్ చటోపాధ్యాయ పేరు 'ఋషులెవ్వరు' అన్న అధ్యాయం చివర యిచ్చిన రిఫరెన్సులో ఒక్కచోటే కనపడుతుంది. 'లోకాయత'లాంటి రచనలు చేసిన దేవీప్రసాద్ పుస్తకాలతో పరిచయమున్నవారికి యిది ఆశ్చర్యం కలిగించక మానదు.

సీత వ్యవసాయక దేవత. రాముడు ఇంద్రుడికి కొత్త కూర్పు: అన్న అంశాలను చెప్పేటప్పుడు, ఆర్మేనియన్లు ఉక్కును ఉత్పత్తి చేశారని చెప్పేటప్పుడు ఆర్యుల గురించిన అవసరమైన వివరణకూడా లేకపోవటం కొట్టొచ్చినట్టు కనపడుతుంది. ఎన్నో చోట్ల జియాలజీ గ్రంథాలను ఆధారం చేసుకు సాగిన పీఠికలో ప్రాణికోటి ఆవిర్భావం జరిగినప్పటి నుండి మానవుని ఆవిర్భావంవరకూ గడిచిన చరిత్రను స్పృశించకపోయినా, కనీసం ఉత్తర భారతదేశానికీ దక్షిణ భారతదేశానికీ మొదట సంబంధమే లేదని వున్న రుజువులను ఎందుచేతనో చెప్పలేదు. 'టెతిస్' అనే సముద్రం దక్షిణహిందూదేశం (లంకతో సహా) ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా భూభాగాలను ఉత్తర భారతం తక్కిన భూభాగాన్నించి విడదీస్తూ వుండేదని జియాలజిస్టులు చెపుతారు. దక్కను పీఠభూమి ప్రాంతం, ఆఫ్రికా మరికొన్ని యితర భాగాలు 'గోండ్వానా లాండ్' అని పిలవబడేవట! హిమాలయాలు పైకి పొడుచుకు రావటంతో టెతిస్ మహాసముద్రం అంతరించిందనీ, అంతకు పూర్వపు ఆర్యులే తమను తాము రక్షించుకునే ప్రయత్నంలో 'అర్యనమ్ విజో' అనే ప్రాంతానికి వెళ్ళారనీ, అదే నేటి 'అజర్ బైజాన్' కానీ 'ఆర్మేనియా' కానీ అయివుండవచ్చునని కొందరంటారు. ఇందు గురించిన వివరణ ఈ పీఠికలో లేకపోవటం పాఠకుడిని అనంతమైన సందేహాల్లోకి నెట్టివేస్తుంది. ఏదేమైనా ఉత్తరాపథాన వున్న ఆహారోత్పత్తి వ్యవస్థలోని మనుషులకు మధ్య జరిగిన పోరాటాలు యీ రకంగా చిత్రీకరించబడి వుంటాయని వూహిస్తున్న శ్రీ నార్ల సత్యానికి దగ్గరగా వున్నారని అనిపిస్తుంది.

పీఠికను ముగించబోతూ (పేజి 169) సీతారాములిద్దరిలో చేయెత్తి నమస్కరించదగు వ్యక్తి రాముడు కాదు, "సీత.... సీత.... ముమ్మాటికి సీత" అంటున్న శ్రీ నార్లవారిని హేతువాదిగా తీసుకోవాలో, రామభక్తుల్ని మాత్రమే నిరసించే సీత భక్తునిగా తీసుకోవాలో అర్థం కాదు. దీనితో ఏ 'కృష్ణా కల్ట్' ప్రభావంలోనో యిప్పటికే పడివున్నవారు మరో క్రొత్త 'సీతా కల్ట్'ను ప్రారంభిస్తే ఆశ్చర్యమేమీ లేదు. దీనినుంచి పరిరక్షించబడటానికి పాతికేళ్ళ కిందటి హేతువాదుల సాహితీ ఆయుధాగారాల వేపు మళ్ళీ మళ్ళక తప్పదేమో!

—డా. పరుచూరి రాజారాం

జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

మనం మనం ఒకటి

శ్రీసుభా

విశాలరావుకి మళ్ళీ ట్రాన్స్‌ఫర్ వచ్చింది. ఈ సారి మరో పల్లెటూరు బదిలీ అయ్యింది. ఉద్యోగంలో జేరి ఐదేళ్ళు కాలేదు. ఆంధ్ర దేశంలో యిరవై వూళ్ళు తిరగడం జరిగింది. ఏ ఊళ్ళో అయినా ఒకేరకం మనుషులయినా ఒకొక్క ఊళ్ళో 'వీళ్ళు మనుషులేనా' అని ఆశ్చర్యం, ఆపైన 'వీళ్ళేం మనుషులని' నిరాశా, ఇంకాపోతే 'వీళ్ళు మనుషులు కాదని' విరక్తి—అలా అలా ఎన్ని అనుభవాలు—ఎన్ని భయంకరానుభవాలు.... విశాలరావు నావలో గోదావరి దాటి కోటిపల్లి రేవులో దిగాడు.... అక్కడి నుంచి బస్‌లో రామచంద్రపురం వెళ్ళాలి.... రామచంద్రపురంనుంచి పది మైళ్ళు, యింకా దూరమేమో రాయవరం....

చెట్టుకింద నిలబడ్డాడు.... అతనిలాగే ఎంతో మంది బస్‌కోసం యెదురుచూస్తున్నారు.... విశాలరావు ఆ జనంలో గుర్తుపట్టాడు—వియ్యపురాళ్ళ జీళ్ళు కొనుక్కుంటూన్న రిటైర్డు తాహసిల్దారు రామానుజంగారిని.... పక్కన భార్యా పిల్లలూ వున్నారు.

విశాలరావు రామానుజంగారి దగ్గరకు వెళ్ళి "నమస్కారం సార్!" అన్నాడు.

రామానుజం విశాలరావుని చూసి ఆశ్చర్యం ప్రకటించి "ఎక్కడికి ప్రయాణం?...." అన్నాడు.

"రాయవరం ట్రాన్స్‌ఫర్ అయ్యిందండీ."

"మళ్ళీనా?"

"అవునండీ!"

"ఎన్ని బదిలీలయ్యా నీకు. నువ్వు క్రితం జన్మలో పిల్లివయి వుంటావ్. అందుకే యిలా తిరుగుతున్నావ్...." నవ్వుతూ అన్నాడు రామానుజం.

"మన చేతుల్లో లేదుకదండీ...."

"ఈసారి ఏం చేశావ్? మళ్ళీ ముక్కుకి సూటిగా పోయావా?"

"అవును. అమలాపురంలో రెండు వర్గాలు దెబ్బలాడుకున్నాయి.... దెబ్బలు తిన్న హరిజనుల పక్షాన న్యాయం మాట్లాడాను...."

"అర్థమయ్యింది."

"ఏం అర్థమయింది సార్...."

"పక్షులు ఒకచోట నిలకడగా వుండలేవు. అవి స్వేచ్ఛాజీవులు. అలానే మంచివాళ్ళు ఒకచోట స్థిరంగా వుంటే జనానికి యిబ్బంది.... అంతేనా?"

"ఏమో సార్.... ఒకొక్కసారి యీ ఉద్యోగం రిజైన్ చేసి ఇంటికి పోయి వ్యవసాయం చేసుకోవాలనిపిస్తుంది. ఎన్ని చట్టాలు, యెన్ని జీవోలు, యెంతమంది నాయకులని మనకి! యింత మందీ మార్బలం వున్నా ప్రజల్లో అరాచకం పోవటంలేదు. ప్రజలకి గవర్నమెంటు అంటే పెళ్ళాంకన్నా లోకువయింది.... అందులో పోలీసు ఇన్‌స్పెక్టర్లంటే మరీనూ. కొట్లాడుకోవద్దంటే కోపం.... అసలీ లా అండ్ ఆర్డర్ శాఖని ఎత్తేస్తే జనం తన్నుకోవడం మానేస్తారేమో" విసుగ్గా అన్నాడు విశాలరావు.

"అవును. మిమ్మల్ని చూస్తే మరిన్ని రాళ్ళు లేస్తాయి. వాళ్ళు తన్నుకొంటూంటే వాళ్ళని తన్నుకోవద్దని మీరు తన్నులు మొదలుపెడతారాయె!"

"పోలీసువాళ్ళ బతుకులు హీనం సార్.... యిదివరకు చదువుకోనివాళ్ళూ, అట్టడుగు

జనాభా దెబ్బలాడుకునేవారు. ఇప్పుడు మేధావులూ విజ్ఞులూ తన్నుకుంటున్నారు. ఎం.ఏలూ, పి. హెచ్‌డీలూ, లక్షాధికార్లూ రోడ్ల మీద పడ్డంతో, బి. ఏ. మాత్రం చదువుకొన్న నాలాంటి ఇన్‌స్పెక్టర్‌గాడు వాళ్ళకి అంటరానివాడుగా కనిపిస్తున్నాడు....అందుకే మేం తన్నులు తింటున్నాం."

రామానుజం నవ్వేశాడు.

"మీరు నవ్వుతారుసార్! మీకేం? మీరంతా కోర్టుల్లో, ఆఫీసుల్లో కూర్చుని చట్టాలు చేస్తారు. ఆ చట్టానికీ, జనానికీ మధ్య చచ్చేది మేము......."

రామానుజం తలూపి నవ్వేసి, "మీ ఇన్‌స్పెక్టర్ల సంగతేందును చెబుతావ్....గవర్నమెంటులో మీ అంత పక్షపాత వైఖరి చూపించేవాళ్ళూ, కరప్టివ్ నేచర్ వున్నవాళ్ళూ కాగడా వేసి వెదికినా కనబడరు."

"మీ రెవరూ మా దగరకు రాకండి సార్!....తన్నుకోండి సార్....అప్పుడు మేం ఏమవుతాం? అలా ఆలోచించండి సార్?"

"సరే....బస్ వస్తోంది....రాయవరం చిన్న ఊరు అయినా గట్టి ఊరు అని విన్నాను....జాగ్రత్త!... ....అక్కడ గొడవలేం తెచ్చుకోకు...."

"మీ ఆశీర్వాదం వుంటే చాలండి."

"ఏ పరిస్థితిలోనూ దిగజారకు....నీకు చిన్నప్పుడు చదువు చెప్పిన గురువు యిచ్చే ఆశీర్వాదం యిదే...."

విశాలరావు బస్ ఎక్కాడు.

★ ★ ★

రాయవరం చిన్న ఊరు....పొడుగాటి బజారు....డాబాయిల్లు పెంకుటిళ్ళు....ఊరు చివర్న ఆఫీసు....విశాలరావు చార్జి తీసుకున్నాడు....స్టాఫ్ అంతా విశాలరావుకు సెల్యూట్ చేసి నిలబడ్డారు.

ఆ మధ్యాహ్నం హెడ్‌కానిస్టేబిల్ రాఘవులు ఆ ఊరి గురించీ ఆ ఊళ్ళో వున్న పెద్దమనుషుల గురించీ కథలుగా మొదలుపెట్టాడు....

"డిటేయిల్డ్‌గా చెప్పు."

హెడ్ నసుగుతూ పలుకుబడి వున్న రెడ్ల గురించీ, కమ్మవారి గురించీ, బ్రాహ్మల గురించీ చెప్పి వాళ్ళ పేర్లతో తయారయిన ఓ కాగితం విశాలరావు టేబిల్‌మీద పెట్టాడు.

"నీ పేరు?"

"రాఘవులు...."

"నువ్వెంతకాలంగా ఈ రేంజ్‌లో వుంటున్నావ్?"

"నాలుగేళ్ళబట్టి."

విశాలరావు మాట్లాడలేదు.

ఈసారి ప్రశ్నించడం రాఘవులు వంతు అయింది.

"అమ్మగారూ, పిల్లలూ ఎప్పుడొస్తారు సార్?"

"పెళ్ళికాలే దింకా."

"అమ్మగారూ నాన్నగారూ రారాండి."

"అన్నయ్య దగ్గర హైదరాబాద్‌లో వుంటున్నారు."

రాఘవులు మరో నిముషం ఆగి "వంట ఎలా సార్?" అన్నాడు.

"వండుకోగలను—"

"కోడి తెమ్మంటారా సార్"

"కావాలంటే చెబుతాను...."

రాఘవులు ఓ క్షణం బుర్ర గోక్కుని "ఇళ్ళు అద్దెకిచ్చినవాళ్ళు అడగమన్నారు సార్....మీరేవుట్లో...."

విశాలరావు ఆశ్చర్యంగా రాఘవుల్ని చూశాడు....

"మేం యేవుట్లం అయితే వాళ్ళ కెందుకట...."

రాఘవులు మాట్లాడలేదు.

విశాలరావు ఇన్‌స్పెక్టర్ కళ్ళతో రాఘవులు మొహంలోకి చూశాడు. రాఘవులు మొహంలో అబద్దం ఛాయలు కదిలాయి. రాఘవులికి ఇన్‌స్పెక్టర్ కులంతో ఏం పని??

"అయ్యగారికి కులం లేదని చెప్పు!"

"రాఘవులు మళ్ళీ మాట్లాడలేదు.

నాలుగురోజుల తర్వాత విశాలరావుని చూడ్డానికి ఊళ్ళో పెద్దమనుషులు వీరయ్యచౌదరి, పెద్దిరెడ్డి, రామశాస్త్రి, నాయుడుగారూ వచ్చారు.



విశాలరావు అందరితో ఆప్యాయతగా మాట్లాడాడు. విశాలరావుతో వాళ్ళు మాటల మధ్యలో వాళ్ళు ఊరికి చేసిన సేవ గురించీ, వాళ్ళ పుట్టుపూర్వోత్తరాల గురించీ, వాళ్ళ ఆస్తుల అంతస్తుల వైనాలూ చెప్పారు. ఎవరికి వాళ్ళు గాంధీనీ ఏసుక్రీస్తునీ చంపి పుట్టినట్టు మాట్లాడారు. దేశంలో పాతుకుపోయిన కుళ్ళుని చూసి కళ్ళు వత్తుకున్నారు. అరాచకం హిమాలయాలయెత్తుకు ఎదిగినందుకు కుంచించుకుపోయారు. శాంతిభద్రతలు క్షీణించినందుకు వణికిపోయారు.

విశాలరావుకు వాళ్లు శాంతి దూతల్లా కన్పించారు. అందుకే అలవాటయిన నాలుగుమాటలు చెప్పాడు.

"ఈ జిల్లా ముఖ్యంగా యీ తాలుకా కొట్లాటలకూ దొమ్మీలకూ ప్రసిద్ధి అని విన్నాను. మీలాంటి పెద్దలు అండదండగా వుంటే వాటిని నేను అరికడతాను."

"అలానే, తప్పకుండా" అంటూ, వాళ్ళు వెళ్ళిపోయారు.

కానీ మర్నాడు వీరయ్యచౌదరి ఒంటరిగా విశాలరావు ఇంటికి వచ్చాడు. ఏవేవో కబుర్లు చెప్పాడు. వాకిట్లో రామస్వామిచౌదరి ఫోటో చూసి అమితానందపడి "మీకు ఆయనగారంటే

ఇష్టమా" అన్నాడు అదోలా.

"ప్రాణం...." అన్నాడు విశాలరావు.

ఆ తర్వాత డ్రాయింగ్ హాల్లో కట్టమంచి రామలింగారెడ్డి ఫోటో, తాపీ ధర్మారావుగారి చిత్రం, శంకరాచార్యుల పటం ఏసుక్రీస్తు రాతి ఫలకం వరసగా కన్పించాయి.

వీరయ్యచౌదరికి క్షణం ఏం తోచలేదు.

"మీకు పెళ్ళి కాలేదని విన్నాను...."

"అప్పుడే విన్నారా?" అన్నాడు నవ్వుతూ విశాలరావు.

వీరయ్యచౌదరికి ఆ నవ్వు అర్థంకాలేదు.

"మా అన్నగారి కూతురుంది....కట్నం రెండు లక్షలదాకా పెడతారు. మనం చుట్టాలయితే బావుంటుంది." లౌక్యంగా అన్నాడు చౌదరిగారు.

"చూద్దాం లెండి."

వీరయ్యచౌదరి వెళ్ళిపోయాడు. ఆ వారంలోనే పెద్దరెడ్డి, రామశాస్త్రి, నాయుడు విశాలరావు యింటికి విడివిడిగా వచ్చారు. ఎవరికి వాళ్ళు విశాలరావు ఏ గ్రూప్‌వైపు మొగ్గు చూపిస్తాడో ఆరా తీసి, ఏ అనూ పానూ దొరక్క లీలామానుషమూర్తి లీలలు అర్థంకాని గోపికల్లా తమ లోటుపాట్లనీ అవకతవకల్ని బయటపెట్టుకొని, విశాలరావు నవ్వేస్తే, ఆ నవ్వే ప్రసాదమనుకొని పంచెలు ఎగదోసుకొంటూ వెళ్ళిపోయారు. వెళ్ళేముందు రాబోయే పంచాయితీ ఎలక్షన్లో ఎవరికి వాళ్ళు నిలబడుతోన్నట్టు చూచాయగా చెప్పి, విశాలరావు సహాయ సహకారాలు అర్థిస్తూ చేతులు కలిపి మరీ వెళ్ళారు.

* * *

రెండో ప్రపంచయుద్ధంతో అట్టుడికిపోయిన యూరప్‌లా వుంది వూరు....ఆటంబాంబు పడిన హిరోషిమా ముక్కుమీద వేలేసుకునేటట్టుంది వూరి పరిస్థితి.

అమెరికాయుద్ధ బాంబులకు వడిపట్టిన వియత్నాం పీరుల్లా ఊళ్ళో జనం కిందా మీద అవుతున్నారు. అమెరికా ప్రెసిడెంటుగా నిలబడి గెలవడం ఈజీగానీ ఆంధ్రదేశంలో పంచాయితీ ప్రెసిడెంటుగా నెగ్గడం బహుకష్టం. అమెరికాలో లేనన్ని కులాలు ఆంధ్రదేశంలో వున్నాయి. అమెరికాలో లేనన్ని నాటుబాంబులు ఆంధ్రాలో తయారవుతాయి. అమెరికా మొత్తం తయారు చేయలేనంత కత్తీసారా ఆంధ్రాలో ఒక ఊరు ప్రొడ్యూస్ చేస్తుంది!!

ఓటుమీద కులం గుర్తు, ఓటుకు కత్తిపోటు సమాధానంగా యివ్వడం ఆంధ్రదేశంతో ఆనవాయితీ మరి!

ఎలక్షన్లంటే ప్రజలకు జాతర. పెద్దవాళ్ళకు అయోమయం. క్రిందవాళ్ళకు అవస్థ.

ఎలక్షన్‌రోజు దగ్గరపడింది!

విశాలరావు ఊళ్ళోకి అదనపు పోలీసుబలగం దింపాలనుకొన్నాడు. హెడ్‌క్వార్టర్స్‌కి లెటర్ వ్రాశాడు. ఫోన్ చేశాడు.

"నీ దగ్గర వున్న ఫోర్స్ చాలు" అన్నాడు పై అధికారి.

"చాలదు. టెన్షన్ ఎక్కువగా వుంది."

"కంట్రోల్ చేయకపోతే నువ్వు ఇన్ ఎఫిషెంట్‌వి."

విశాలరావు తల పట్టుకొన్నాడు.

"ప్రెసిడెంటుగా నిలబడుతూన్న పెద్దలూ-గుద్దులాడుకోవద్దు. ప్రజలూ—ఒకవేళ పెద్దలు గుద్దుకున్నా మీరు రెచ్చిపోకండి....పెద్దలు యేవయినా యేం జరిగినా లేళ్ళని తిన్న పులుల్లా సుఖంగానే వుంటారు. మీరు లేగదూడలు. మీరు గాయాలు చేసుకోవద్దు, జనం" అంటూ హితోపదేశం చేయాలనుకొన్నాడు.

కానీ అప్పటికే ప్రజలు వీరావేశంతో వీరభద్రుల్లా మారిపోయారు. ఊరు అగ్నిపర్వతం మీద శివతాండవం చేస్తోంది. కిరాయి మనుషులు గుళ్ళు మింగిన తుపాకుల్లా పేలిగిపోతున్నారు.

* * *

ఆ రోజు పదిగంటలవరకూ దొమ్మలాటలు జరిగాయి. రక్తం చవగ్గా రోడ్లమీద ప్రవహించింది. గెడ్డం పుచ్చుకొని బ్రతిమలాడితే వినని ప్రజలు దెబ్బలతో పోలీస్ స్టేషన్‌మీద

రచయిత గురించి



పుట్టింది చింతలూరు - తూర్పుగోదావరి. పెరిగిందీ, చదివిందీ రామచంద్రపురం, కాకినాడలో. ఉద్యోగరీత్యా ఉయ్యూరు విజయవాడలో కొంత కాలం మకాం. 1960 నుంచీ రాస్తున్నారు. బహుమతి పొందిన నవల 'నవలోకం', ఐ.డి.పి.యల్, హైదరాబాద్‌లో ఉద్యోగం. భార్య ముగ్గురు పిల్లలు. ఇరవై ఏళ్ళ నుంచీ చుట్టూ సమాజం బహుముఖంగా వేస్తూన్న వెర్రి తలలు చూసి, కలం ఝళిపించడం జరుగుతోంది. "ఎవరికైనా రోగం ముదిరితే శస్త్ర చికిత్స అత్యవసరం. ఇది శాస్త్రం. కథలు వ్రాసే తొలిరోజుల్లో ప్రోత్సాహం ఇచ్చిన పత్రిక "జ్యోతి" మాసపత్రిక అందుకే, ఊపిరి పోసిన పత్రిక ద్వారా వచ్చిన బహుమతి వెలకట్టలేనిది" అంటున్నారు శ్రీ సుభా.

పడ్డారు....

వీరయ్యచౌదరి, పెద్దిరెడ్డి, నాయుడు, రామశాస్త్రి అర్జీలు పెట్టుకొన్నారు. అరెస్టులు జరగాలన్నారు. ఆ రాత్రి విశాలరావు యింటికి వెళ్ళి వీరయ్యచౌదరి తలుపు తట్టాడు.

"ఆ రెడ్డిని బాగా లోతుగా యిరికించు. మళ్ళీ లేవకూడదు తెలుసా? మనవాడి వని చెబుతున్నాను. మర్చిపోకు. ఈ సహాయం చేస్తే నీకు సి.ఐ. ఇప్పిస్తాను."

తర్వాత పెద్దిరెడ్డి వచ్చాడు.

"కాల్చిపారేస్తాను వెధవల్ని....తెల్లారేటప్పటికి ఆ చౌదరిని బొక్కలో పెట్టు....ఆ ఏసురత్నంగాడు నెగ్గకూడదు. మనం మనం ఒకటని మర్చిపోకు...." విశాలరావు మంచంమీద వెయ్యిరూపాయలు పడేసి వెళ్ళిపోయాడు.

నాయుడు, రామశాస్త్రి వేరువేరుగా వచ్చారు. వాళ్ళూ చెప్పేదీ యెదటివాళ్ళని వలలో పడేయమని! వాళ్ళలో పగలున్నాయి. క్రోధాలున్నాయి. నలుగురూ పోటీ చేస్తున్నారు. నలుగురి కళ్ళలోనూ యేదో భయం. ఎలక్షన్లో నెగ్గలేమని ఆ వేళ....ఏసురత్నంగారు నెగ్గకూడదు. ఏసురత్నం ఏమిటి, తను తప్ప మరెవ్వరూ నెగ్గకూడదు....తను తప్ప మిగిలిన వాళ్ళంతా మట్టికరుచుకు పోవాలి! అదీ వాళ్ళ సిద్ధాంతం.

కానిస్టేబిల్స్ రాఘవులూ, సూరయ్యా స్టేషన్‌కి పరుగు పరుగున వచ్చారు. అసలు కథ, కాదు తెర వెనక జరిగిన దారుణ గాథ చెప్పారు.

ఏసురత్నాన్ని ఎవరో బాగా కొట్టారు....

ఏసురత్నం వెన్నలాంటి మనసున్నవాడు. హరిజనుడు. తాతలనాటి నుంచీ రెండెకరాల భూమినే నమ్ముకొని, దాన్ని పెంచుకోలేక పోయినా ఊళ్ళో మంచిని పెంచుకున్నమనిషి. ఏసురత్నం అంటే ఊళ్ళో యువతరం ప్రాణం పెడుతుంది....

కానీ ఏసురత్నం చావుదెబ్బలు తిన్నాడు.

మంచితనానికి, మిణుకు మిణుకుమని వెలుగుతూన్న మంచి తనానికి కత్తిపోటు!

విశాలరావు వెళ్ళేసరికి హాస్పటల్లో బెడ్ మీద ఏసురత్నం శిలువవాతబడ్డ ఏసుక్రీస్తులా వున్నాడు....గాడ్సే చేతి తుపాకీ గుండు దెబ్బలు తిన్న గాంధీ మహాత్ముడిలా మంచం మీద పడున్నాడు.

విశాలరావు అక్కడ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి స్టేషన్‌కి వచ్చాడు. పై అధికార్లకి ఫోన్ చేసి జరిగింది జరిగినట్టు చెప్పాడు....

అవతలి కంఠం కొంచెం సేపు తటపటాయించి, "పెద్దరెడ్డిని యిరికించకు. ఆపైన నీ యిష్టం...." అని ఫోన్ పెట్టేశాడు.

మరో గంటకి జిల్లా కేంద్రం నుండి రెండు ఫోన్లు వచ్చాయి. ఒకటి వీరయ్యచౌదరిగురించి, మరొకటి నాయుడు గురించి... ఇద్దర్నీ ముట్టుకోవద్దని.

"మరెవరిమీద కేసు పెట్టమంటావ్? వీళ్ళు నలుగురూ కలిసి ఏసురత్నాన్ని పొడిపించారు. వీళ్ళలో వీళ్ళకి మళ్ళీ మనస్పర్థలు. ఒకళ్ళ వెనక ఒకళ్ళొచ్చి యెదుటివాళ్ళ మీద కేసు పెట్టమంటున్నారు."

"ఓయ్ వెర్రిమొహం....అవి పొలిటిక్స్. ....అంతే....ఇంతకీ చౌదరిగారి అన్నగారు మన స్టేట్ మినిస్టర్. నాయుడుగారి మామగారు ఢిల్లీలో సెక్రటరీ. వాళ్ళమీద ఈగవాలిందంటే నువ్వు మన్యం పట్టిపోతావ్...."

విశాలరావుకి కోపం వచ్చింది. ఆవేశం వచ్చింది. ఆఖరికి రామశాస్త్రి గురించి కూడా గట్టి రెకమెండేషన్‌తోపాటు రామశాస్త్రి బుద్ధభగవానుడి అంశ అని హెచ్చరిక వచ్చింది.

"ఎవరిమీదా కేసుపెట్టకుండా ఏంచెయ్యను? నామీద పెట్టుకోవాలి కేసు."

"ఏం చేసినా సరే నీ ఇష్టం."

విశాలరావు నిద్రపోలేదు. కుర్చీలో కూర్చున్నాడు.

ఎర్రటి ఫోన్ దెయ్యంలా కనిపిస్తోంది. టేబిల్ మీద ఆఫీసు ఫైళ్లు అవయవాలుతెగిన మనుష్యుల్లా కదలిక లేకుండా పడున్నాయి.

బయట కారు ఆగిన చప్పుడు. హుటాహుటీగా జిల్లా కేంద్రంనుంచి నలుగురు పోలీస్ అధికారులు వచ్చారు. అందరూ హై రేంక్ ఆఫీసర్లు. విశాలరావు ఎదురువెళ్ళి సెల్యూట్ చేశాడు. చేతులు కట్టుకొని నుంచున్నాడు.

వాళ్ళు విశాలరావుని లోపలికి వెళ్ళమని ఆఫీసురూమ్ తమ ఆధీనంలోకి తీసుకొని నాలుగు గంటలు కేసునీ, కేసుతో సంబంధమున్న పెద్దమనుషుల జీవిత చరిత్రల్ని మరోసారి మననం చేసుకొని, ఆఖరికి కేసుకో తుది రూపం యిచ్చి రాఘవుల్ని పిలిచి రాఘవులచేత ఎఫ్.ఐ.ఆర్. తయారు చేయించారు.

రాఘవులు వణికే చేతుల్లో చిత్రగుప్తుడిలా తలొంచుకొని తప్పుల తడక వ్రాశాడు. అప్పుడు అధికార్లు విశాలరావుని ఆఫీసురూమ్‌లోకి పిలిపించి కేసు పూర్తిపాఠం చెప్పి, "దీని ప్రకారం కేసు నడుపు, తెలిసిందా....ఈ స్టేట్‌మెంట్ రేపు పోస్టులో పంపు. మేం వచ్చినట్టు ఎవరికీ తెలియకూడదు. జాగ్రత్త...." అని విశాలరావుని హెచ్చరించి అంబేసిడర్ యెక్కి దేవదూతల్లా యిట్టే మాయమయ్యారు.

రాఘవులు నెమ్మదిగా చెప్పాడు.

"ఏసురత్నం గంట క్రితం హాస్పిటల్లో చనిపోయాడు సార్" అని.

అదొక్కటే నిజం! విశాలరావు యేం మాట్లాడలేదు.


కేసు షీట్ చేతిలో వణుకుతోంది....మనసంతా చీకటి లాంటి బాధను తన్నుకు వస్తోంది.

కేసు స్వరూపం మారిపోయింది! బ్రహ్మ తిమ్మి అయ్యింది. జరగనివి జరిగాయి. జరిగినవి చరిత్ర కందకుండా పోతున్నాయి.

హంతకులు వీరయ్యచౌదరి, పెద్దరెడ్డి, నాయుడు, రామశాస్త్రి కానేకారు.

సోమేశ్వరం అనే ఇరవైఐదేళ్ళ యువకుడు....ఐదేళ్ళబట్టి నక్సలైట్ల జనాభాతో కలిసి తిరుగుతూన్న సోమేశ్వరం....

విశాలరావుకి సోమేశ్వరం చరిత్ర తెలుసు. ప్రతి స్టేషనులోనూ అతని గురించిన రికార్డు భద్రపరిచి వుంచారు.



సోమేశ్వరం ఎం. ఏ. పాసయి, ఉద్యోగం లేక తెలివితేటలు అన్నం పెట్టకపోగా నిరాశపడ్డ వ్యక్తి....చుట్టూ అన్యాయాలతో విసిగి వేసారి, దేశకాల పరిస్థితుల్ని చూసి కళ్ళల్లో మంటలు రేగితే, ఆ మంటలు గుండెలకు పాకితే, ఆ మంటలతో లోకాన్ని ప్రక్షాళనం చేద్దామనుకొని అడవులు పట్టిన వందలాది యువకుల్లో ఒకడు.

అవును....సోమేశ్వరంమీద రెండు ఖూనీ కేసులతో, పది దోపిడీలతో సంబంధంవున్నట్టు సమాచారం విశాలరావుకి పంపారు. వారం క్రితం సోమేశ్వరం కాకినాడ పరిసరాల్లో తిరుగుతోన్నట్టు అనుమానంగా వుందనీ జాగ్రత్తగా కాపు వేస్తూ వుండమనీ హెచ్చరిక వచ్చింది. సోమేశ్వరం వింతశక్తు లున్నట్టు రాయవరం రావడం, ఏసురత్నాన్ని ఆ రోజు పొడిచి పారిపోవడం, పారిపోయినట్టు కేసు చిత్రించడం అప్పుడు విశాలరావు వంతయ్యింది.

విశాలరావు ఫోన్‌వైపు చూశాడు. సోమేశ్వరం గురించి యెవరైనా ఫోన్ చేస్తే.... బావుండు ననిపించింది క్షణం. ఏ మినిస్టరో, ఏ అపోజిషన్ లీడరో, ఏ ఢిల్లీ నాయకుడో ఫోన్ చేస్తే....అసలు అలా జరుగుతుందా? జరగదు. సోమేశ్వరం మామూలు మనిషి. మామూలు మనిషికి కష్టం వస్తే పట్టించుకునే జనాభా వుండదు. దిక్కులేని శవాన్ని రాచమర్యాదలతో సంస్కరించడం ఈ దేశంలో జరగని పని.

విశాలరావుకు మగతతో నిద్రపట్టింది. అది నిద్ర కాదు....ఆలోచన. ఆలోచనకాదు, ఆశల నిట్టూర్పు.

ఫోన్ మ్రోగింది.

విశాలరావు ఆతృతగా ఫోన్ ఎత్తాడు.

"విశాలరావు స్పీకింగ్" అంటూ.

"నేనండీ...."

"అంటే...."

"ఏసురత్నంగారి అబ్బాయిని. నన్ను గాంధీ అంటారు."

విశాలరావు "ఓ" అని ఆ తర్వాత "సారీ

బ్రదర్, మీ నాన్నగారు పోయినందుకు నా బాధ్యతా లోపం కూడా వుంది. క్షమించు...." అనేశాడు.

"ఏం చేస్తాం సార్! బాధపడ్డం వరకే. అయినా ఈ దేశంలో రోజూ యిలాంటి హత్యలు యెన్ని జరగడం లేదంటారు. ఇంతకీ సార్...." గాంధీ కంఠం ఆగింది.

"చెప్పు. ఏమన్నా సహాయం కావాలా?"

"కాదు సార్. హంతకుడి ఆచూకీ తెలిసిందా సార్"

విశాలరావు క్షణం ఆగి "సోమేశ్వరం అని...."

అంతే చెప్పగల్గాడు కంఠంలోంచి మాట పెగలలేదు.

"సోమేశ్వరమా?"

"నక్సలైట్ లీడర్."

"కాదండి ఇన్‌స్పెక్టర్. ఇది అన్యాయం. మా నాన్నని అతను చంపడు. సోమేశ్వరం నా క్లాస్‌మేట్. మా నాన్న అతనికి ప్రాణం. అతని సంగతి నాకు బాగా తెలుసు. ఇది దొంగ కేసు సార్."

విశాలరావుకు గాంధీ ఎదురుగా నిలబడి సవాల్ చేస్తోన్నట్టుగా వుంది....తల వంచుకున్నాడు.

"అతన్ని వదిలేయండి సార్. దొంగ కేసులు పెట్టి మెరికల్లాంటి కుర్రాళ్ళన్ని చంపకండి సార్. జరిగింది జరిగినట్టు కేసెట్టి—ఆ కేసులో యిరుక్కున్నది యెంత పెద్దోళ్ళయినా వాళ్ళని ఏరి పారేయండి సార్. సోమేశ్వరం అమాయకుడు. మీలా నాలా సోమేశ్వరం యువకుడు సార్. ఉద్యోగం దొరికితే, మీలా ఇన్‌స్పెక్టర్ అయ్యేవాడు. లేకపోతే నాలా స్కూల్‌మేష్టర్‌గా బ్రతికేవాడు. యువతరం; యిలా యువతరంమీద కత్తి గట్టడం అన్యాయం సార్.. మనం మనం ఒకటి సార్....!"

ఏసురత్నం కొడుకు ఫోనులో ఉద్వేగాన్నీ, ఉప్పెనలా ఆవేశాన్ని నింపి ఆకాశంనుంచి అశరీరవాణిలా వాక్కులు వినిపిస్తున్నాడు.

"నువ్వు చెబితే లాభంలేదు. ఏ పెద్దవాళ్ళ చేతో ఓ అరగంటలో తెల్లవారేలోపున ఫోన్ చేయించు. అంతేగానీ నీ నా రెకమెండేషన్‌తో అమాయకులు గానీ ఎవర్నిగానీ రక్షించలేం. దోషుల్ని శిక్షించలేం" విశాలరావు నెమ్మదిగా అన్నాడు.

"అలాగే సార్! ప్రయత్నిస్తాను. ఓ గంట టైం యివ్వండి."

విశాలరావు తెల్లవారే వరకూ అదే కుర్చీలో అంతే ఆతృతతో, కూర్చున్నాడు. నిద్ర కాకాడు. గుండెల్లో రేగే మంటని అదిమి పట్టుకున్నాడు.

తెల్లవారింది! బాగా వెలుగూ వచ్చింది. కానీ ఫోన్‌కాల్ రాలేదు.

ఫోన్ రాలేదన్న బాధతో గుండెల్లో గుబులుతో కుర్చీలోంచి లేవబోయి—శరీరం లోపలి మానవత మందలింపుగా నెత్తిమీద మోదినట్టయి అదే కుర్చీలో కూలబడిపోయాడు విశాలరావు.

కళ్ళు ఎందుకో సోమేశ్వరం కోసం అన్నట్టుగా రెండు కన్నీటిచుక్కల్ని ఆఖరి వీడ్కోలికి గుర్తుగా వదిలాయి. అందుకే ఏమీకాకీ, ఎవరూలేని సోమేశ్వరం కోసం తన ఉద్యోగానికి రాజీనామా పత్రం వ్రాయడానికి కలం తీశాడు విశాలరావు. □

స్వప్న సముద్రం

సముద్రం నిద్రిస్తే
ఆకాశం కలలోకొస్తుంది
పిగనిండా చుక్కల్ని తురుముకుని
కళ్ళనిండా కాటుక రేఖల్ని. దిద్దుకుని-
కల చెదిరినట్లు బెదిరితే
కలలోనే సముద్రం,
తలనిండా
యుద్ధ విమానాల రెక్కల్ని గుచ్చుకుని
సముద్రమైదానం మీద
కురుస్తోంది వికృతంగా ఆకాశం

—దేవిప్రియ



యూనివర్సిటీ పరీక్షలు అయిపోయాయి. విద్యార్థు లందరిలోనూ ఇళ్ళకు వెళ్ళాలనే తొందర. మెస్సులో భోంచేసి సామానులు సర్దుకోడానికి రూముకు వచ్చాను. ఎండాకాలమైనా యెందుకో చలి వేస్తోంది. రూములో లైట్ వేసి సిగరెట్టు వెలిగించుకున్నాను. టైము దాదాపు తొమ్మిదవుతోంది.

ఆకాశవాసు లెవరో భూలోకాన్ని తాళ్ళతో బంధించినట్లు సన్నని తుంపర ప్రారంభమైంది. ప్రొద్దున్నే తిరుపతి వదలి వెళ్ళిపోతాననుకుంటే ఎందుకో బాధగా వుంది. ఎం. ఏ. పూర్తి చేసిన యీ రెండు సంవత్సరాల కాలంలోనూ ఎన్నో అనుభవాలూ, హృదయంలో హత్తుకొన్న సంఘటనలూ, జీవితంలో మరచిపోలేని గుణపాఠాలు.

మొదటి సంవత్సరం హాస్టలులోనే వున్నా, బాగా చదవాలనే వుద్దేశంతో లోన్లీగా వున్న ఈ రూములో ఒంటరిగా చేరాను. రాత్రిపూట అక్కడక్కడా దీపాలతో నును చీకటి, గాలిని కవ్వించే పూలచెట్లు, దూరంగా సున్నని కొండలు, ప్రశాంతమైన నిశ్శబ్దం, యెంత బావుంది ఈ రూము. ప్యాక్ చేసిన పుస్తకాల వంక ఒకసారి చూసి యిందాక సగం రాసి వదిలేసిన కథను చేతికి తీసుకున్నాను.

తలుపు శబ్దం కావడంతో లేచి ఎవరా? అను కుంటూ తలుపు తెరిచాను.

ఆకాశం మెరిసింది. ఎదురుగా తడిసీ తడ వని శ్లేష. ఆశ్చర్యపు పిడుగులు. యూనివర్శిటీని గడగడ లాడించిన శ్లేష. అందంతో అందరినీ బానిసల్ని చేసుకొన్న శ్లేష. పురుషుల్ని దుస్తుల్ని మార్చినట్లు మార్చి పురుగుల్లా చూసే శ్లేష. చూపుల్ని ఆకాశంపైకి తప్ప క్రిందికి దించని శ్లేష. రెండేండ్లు మౌనంగా నేను ఆరాధించిన శ్లేష. ఎవ్వరికీ అర్థంకాక శేషప్రశ్నలా మిగిలిన శ్లేష.

"ఏం రాజూ! రూములోకి రానీవా?" రాళ్ళపై కొండవాగు దూకుతున్నప్పటి శబ్దం.

"రా శ్లేషా!" తేరుకొని ఆహ్వానించాను. రూములోకి ప్రవేశించి కుర్చీలో కూర్చుంది.

"చలేస్తోంది రాజూ! తలుపు వేసేయ్."

మంత్రముగ్ధుడిలా తలుపులు మూసి పరుపుపై కూర్చున్నాను.

"అలా వున్నావేం?...." అంది తలెగ రేస్తూ.

"అబ్బే యేంలేదు" ఆశ్చర్యం నుంచి, ఆనందంనుంచి తేరుకొంటూ అన్నాను.

మెల్లగా సిగరెట్ తీసి వెలిగించుకో బోయాను.

"నాకో సిగరెట్టివ్వు రాజూ!" అధికార స్వరం.

"శ్లేషా! నువ్వు సిగరెట్లు కాలుస్తావా?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏం కాల్చకూడదా?" అంది తాపీగా చేయి చాస్తూ.

"ఆఁహ కాల్చకూడదని కాదు...." సిగ రెట్ ప్యాకెట్ ఆమె కందించాను.

ఎన్నో ఏళ్ళనుండి కాలుస్తున్న దానిలా పొగ గుండెల నిండా పీల్చి బయటికి వదిలింది.

నేను ఆమెనే చూస్తున్నాను.

"రాజూ! ఈ రోజు నీతో గడపాలని వచ్చాను—ఏమంటావ్?"

"అలాగే—అంతకంటేనా" అన్నాను.

ఆమెకు తెలుసు—ఆమె యూనివర్శిటీలో చేరిన మొదటిరోజునుంచి ఆమెను మౌనంగా నేను ఆరాధిస్తున్నానని.

బయట చినుకుల శబ్దం హెచ్చింది. శ్లేషనే చూస్తూ ఈ హఠాత్తుగా రావడంలో గల ఆంతర్యం ఆలోచిస్తున్నాను.

కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్న శ్లేష హఠాత్తుగా కళ్ళు తెరచి "సరదాగా వుందామని వస్తే ఏమిట్రాజా ఈ మౌనం" గోముగా చూస్తూ శ్లేషగా ప్రశ్నించింది.

"మౌనం కాదు శ్లేషా, ఆలోచనలయానం, అంతుచిక్కని ప్రశ్నల అల్లిక" అన్నాను.

"ఏమిటో ఆ ప్రశ్నలు?...." కొంటెగా అడిగింది.

"అడిగితే చెబుతావా?" చెబుతుందో లేదో అనే అనుమానం.

"రాత్రిపూట ఒంటరిగా, నువ్వు పిలువకుండా, నీ రూముకు వచ్చినదాన్ని ఇంతేనా నీవు అర్థం చేసుకొన్నది. చెప్పగలిగే జవాబులైతే తప్పక" అంది సీరియస్‌గా.


మరో సిగరెట్ వెలిగించుకొని ఫ్లాస్కులో వున్న కాఫీని రెండు భాగాలు చేసి ఆమెకో టిచ్చాను.

మౌనంగా తాగుతోంది.

"శ్రీనాధ్ ఆత్మహత్యలో నీ భాగం ఎంత?" సూటిగా అడిగేశాను.

నా కళ్ళలోకి చూసి నవ్వుతూ "అంతా" అంది.

ఒక జీవితానికి సంబంధించిన ప్రశ్నకు యింత తేలిగ్గా సమాధానం యిచ్చిన ఈ స్త్రీని



యింకేం ప్రశ్నించను? ఆలోచనలను శ్రీనాధ్ ఆక్రమించుకొన్నాడు.

* * *

కొత్తగా ఎం. ఏ. ప్రీవియస్‌లో చేరిన రోజులు.

అందరికంటే ఆలస్యంగా చేరింది శ్లేష. ఆమె క్లాసుకు వస్తోందని తెలిస్తే ఒక్కడూ ఆబ్సెంటయ్యేవాడు కాదు. అంతటి అందం ఆమెది. తన డిపార్టుమెంటు కాని వాళ్ళతో కూడా చాలా ఫ్రీగా, సోషల్‌గా వుండేది.

ఆమె చూపుల్లో శ్లేష, మాటల్లో శ్లేష, నడకలో శ్లేష, నవ్వులో శ్లేష. అందరికీ అర్థంకాని సందిగ్ధం ఆమె.

ఎప్పుడూ కళకళ లాడుతూ వుండే కలవారింటి బిడ్డ శ్రీనాధ్. ఓ మాసం గడిచేటప్పటికీ విద్యార్థినీ విద్యార్థుల్లో యెక్కడ చూసినా వీరిద్దరి గురించి మాటలు. ఎన్నోసార్లు శ్రీనాధ్, శ్లేషలు సినిమాలకు, హోటళ్ళకు వెళ్ళడం నా కళ్ళారా చూశాను. శ్లేష అంటే నాకెందుకో ఓ విధమైన అనురాగం, అభిమానం, ఆరాధన. నేను రాసిన కొన్ని కథలకు ఆమె నాయికిగా నిలిచింది.

నా కథలు చదివి, నా దగ్గరికొచ్చి నన్ను అభినందించేది.

హాస్టల్లో నా రూము ప్రక్కనే వుండేవాడు శ్రీనాధ్. మా యిద్దరికీ మంచి స్నేహమే వుందని చెప్పాలి. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ వుండేవాడు. ప్రతిసారీ అతన్ని శ్లేష గురించి అడగాలనున్నా—యెందుకో అడగలేక పోయేవాడ్ని.

ఒకరోజు మధ్యాహ్నం క్లాసు లేకపోవడంతో లైబ్రరీకి వెళ్ళి 'గాలిబ్ గీతాలు' చదువుకొంటున్నాను భోజన సమయం కాబట్టి లైబ్రరీ దాదాపు నిర్మానుష్యంగా వుంది. నాక్కాస్త దూరంలో కిలకిలా నవ్వు. ఎవరా అనుకున్నాను. నాకు, ఆ నవ్వుకు మధ్య వో పుస్తకాల రేక్. అనుమానంగా రెండు పుస్తకాలు తొలగించి చూశాను. ఆ వైపు శ్లేష, మరో కొత్త వ్యక్తి. ఉన్నట్టుండి అతను శ్లేషను దగ్గరికి లాగి ముద్దు పెట్టుకొన్నాడు. ఎలాంటి అభ్యంతరమూ తెలుపకుండా అతని చెంపపై చిన్న దెబ్బ వేసింది శ్లేష. అంత

పబ్లిక్‌గా ఆ దృశ్యాన్ని చూడలేక పుస్తకాల్ని యథాస్థానంలో వుంచాను.

ఈ విషయాన్ని శ్రీనాధ్‌కు చెప్పాలను కొంటూనే చెప్పలేకపోయాను. పాపం అత డామెను గాఢంగా ప్రేమిస్తున్నాడు. ఆమె లేనిదే జీవితం లేదనుకొనేవాడు. ఆమె కోసం యేం చెయ్యడానికైనా సిద్ధపడినవాడు. ప్రేమ మత్తు అతన్ని పూర్తిగా ఆక్రమించుకొని వుంది.

ఈలోగా యూనివర్సిటీలో అనేక పుకార్లు బయలుదేరాయి.

శ్లేషకు, వేశ్యకు యెలాంటి తేడా లేదని, పురుషుల్ని పురుగుల్లా చూస్తుందని యింకా యెన్నో, యెన్నో. శ్రీనాధ్ ఈ విషయాల్ని పట్టించుకోలేదు. నేనూ నమ్మలేదు.

హఠాత్తుగా ఓ ఇరవైరోజులు శ్లేష మాయమైంది. అన్ని రోజులూ చైతన్యా కాలేజీకి రాలేదు. చైతన్య కూడ డబ్బు విలువ తెలియని యింట్లో పుట్టినవాడే. అతని దృష్టిలో ఆడవంటే అనుభవించే వస్తువు. చైతన్యా శ్లేషా కలసి ఎక్కడికో పారిపోయారని యూనివర్సిటీ అంతా పుకారు.

నవ్వుతూ నవ్విస్తూ వుండిన శ్రీనాధ్ యెలాగో అయిపోయాడు. కాలేజీకి రావడం కూడా తగ్గించేశాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఏకాంతంగా గడిపేవాడు.

ఒకరోజు ఉదయం చైతన్యా శ్లేషా ఇద్దరూ కాలేజీకి వచ్చారు. కాలేజీ గగ్గోలెత్తిపోయిందా రోజు. శ్లేషా చైతన్యలు యూనివర్సిటీలో కలసి తిరగడం మొదలుపెట్టారు. యూనివర్సిటీలో తిరగలేక, తిరగకుండా వుండలేక నానా అవస్థ పడిపోతున్నాడు శ్రీనాధ్.

నాలుగు రోజుల తరువాత దాదాపు పద కొండు గంటలకు ఆడిటోరియం ముందర కూర్చుని మాట్లాడుతున్నారు శ్రీనాధ్, శ్లేషలు. వాళ్ళు పెద్దగా అరుచుకోవడంతో, అటూ ఇటూ తిరుగుతున్న విద్యార్థులతో కలసి నేనూ వాళ్ళ దగ్గరికి వెళ్ళాను.

"ఇదేం బొమ్మలాటా? నువ్వు వచ్చి తీరాలి" కోపంగా అన్నాడు శ్రీనాధ్.

"అది నా యిష్టం. నేను రాను" సౌమ్యంగానే చెప్పింది శ్లేష.

"వాడితో తిరిగితే చంపేస్తాను" శ్రీనాధ్ కళ్ళు ఎర్రబడ్డాయి.

"నా ఇష్టాన్ని ప్రశ్నించే హక్కు నీకు లేదు!...." కోపంగా అంటూ పైకి లేచింది శ్లేష.

"యూ డర్టీ ఓర్" (WHORE) ప్రక్కన మేమున్నా మనే విషయం కూడ మరచి ఊగిపోతూ పైకిలేచాడు శ్రీనాధ్.

"షటప్! మగతనం లేని నువ్వా మగాడిలా మాట్లాడుతున్నావు" అంది కోపంగా శ్లేష.

శ్లేష చెంప చెళ్ళుమంది. ఎర్రగా నెత్తురు కారుతున్నట్టయింది చెంప. ఎడమచేత్తో చెంప సవరించుకుంటూ, కంట్లో నీళ్ళు గిర్రున తిరుగుతుండగా కుడిచేత్తో చెప్పు తీసుకొంది శ్లేష. అర్థంకాక చూస్తున్న మేము ఇద్దరినీ ఆపి, శ్లేషను దూరంచేసి శాంతపరిచాము. విసురుగా వెళ్ళిపోయాడు శ్రీనాధ్.

జరిగిన అవమానాన్ని సహించలేక, అభిమానాన్ని చంపుకోలేక ఆ సాయంత్రమే ఆత్మహత్య చేసుకున్నాడు శ్రీనాధ్.


ఆడిటోరియం ముందు గడ్డిలో కూర్చుని ఏదో ఆలోచిస్తున్న శ్లేషతో జరిగిన విషయం చెప్పాను. ఆమె నన్ను చూసి మెల్లగా నవ్వుతూ "పిరికివాడు" అంది. ఆ క్షణంలో ఆమెపై జనించిన అంతులేని అసహ్యంతో తిరిగి వచ్చేశాను.

శ్రీనాధ్ మరణ విషాదంనుంచి మేం తేరుకోక ముందే మొదటి సంవత్సరం గడచి రెండవ సంవత్సరం ప్రవేశించింది.

హాస్టలు నచ్చక నేను రూములో చేరాను. ఎన్నడూ లేనంతగా ఎలక్షన్ల గొడవ ప్రారంభం అయింది.

యూనివర్సిటీ చైర్మన్‌షిప్‌కు చైతన్య, విశ్వం పోటీ చేస్తున్నారు. ఇద్దరూ మంచి పాపులారిటీ వున్నవారే.

అందరినీ ఆశ్చర్యపరుస్తూ శ్లేష కూడ నామినేషన్ వేసింది. చైతన్యని విరమించుకోమని



ఒత్తిడి చేసినా అతడు లొంగి రాలేదు. ఆమెతో అవసరం తీరిపోయిందతనికి. దానితో విశ్వానికి సన్నిహితంగా వెళ్ళింది శ్లేష. ఎన్నాళ్ళనుంచో శ్లేషకై అతడు యెదురుచూస్తున్నాడు. "నా అందం నీ సొంతం కావాలంటే పోటీనుంచి విరమించి నాకు సహాయం చేయి" అని అడిగింది శ్లేష. అందంకోసం రాజ్యాల్ని, సింహాసనాల్ని, జీవితాలనీ త్యాగం చేసినవాళ్ళున్నారీ గడ్డలో. విశ్వం వాళ్ళకంటే గొప్పవాడేమీ కాదు. నామినేషన్ విత్‌డ్రా చేసుకొన్న రోజున అతనిని తన అందపు ఆనంద సాగరంలో ముంచేసింది శ్లేష. విశ్వమూ, అతని వర్గమూ శ్లేషకై ప్రచారం చేయసాగారు. ఎవరికోసమైతే శ్రీనాధ్‌ని కాలదన్నిందో, అతన్నే వదిలేసి ఎదురునిలిచింది శ్లేష.

అందినా అందకపోయినా అందానికి మొక్కడం అందరికీ అలవాటు. ఊహించని మెజారిటీతో గెలిచింది శ్లేష. యువతి చైర్మన్ కావడం యూనివర్సిటీ చరిత్రలో అదే ప్రథమం.

ఎక్కడ చైన్యను చూసినా ఆడదాని చేతిలో, అదీ మాజీ ప్రేయసి చేతిలో ఓడిపోయాడని గుసగుసలాడుకోసాగారు. అవమానంతో కాలేజీ వదిలేసి స్వంత ఊరికి వెళ్ళిపోయాడు చైతన్య. ఫైనల్ యియర్ పూర్తయ్యేలోగా విశ్వానికి గుడ్‌బై కొట్టింది శ్లేష.

§ § §

"రాజూ, అడగటానికి మరింకే ప్రశ్నలూ లేవా?" అంటూ కుర్చీలోంచి లేచి మెల్లగా నా వరుపు దగ్గరికి చేరి దుప్పటి కప్పుకొంది.

ఏదో అగ్నిపర్వతం నాలో, లోలో బద్దలయి చలి వెచ్చగాను, వెలి చల్లగానూ అనిపించింది. నా ముఖాన్ని గోముగా చూస్తోంది శ్లేష.

"శ్లేషా! ఎందుకిలా పురుషుల జీవితాలతో ఆడుకొంటావు?" బాధగా ప్రశ్నించాను.

"వాళ్ళు నా జీవితంతో ఆడుకొన్నారు కాబట్టి" నవ్వుతోంది, బుసకొట్టే నాగుపాము పడగ దింపేస్తుందా నవ్వుకు.

"అంటే....?" కుతూహలంగా ప్రశ్నించాను.

"నీ 'అంటే'కు సమాధానం చెప్పాలంటే ఒక చరిత్ర రాయాల్సి వుంటుంది" నా చేతిపై తన చేతిని రాస్తూ అంది.

"అలాగే రాస్తాను" రచయితననే గర్వం నాలో.

"నాకు తెలుసు" అంది నవ్వుతూ—గడి

యారంలోని రెండు ముళ్ళూ 12 దగ్గర చలికి కౌగిలించుకొన్నాయి.

మరో సిగరెట్ వెలిగించుకొంది శ్లేష. ఇద్దరమూ ఒకే పరుపుపై ఒకే దుప్పటిలో.

పొగ వదులుతూ "ఎవరికీ తెలియని రహస్యాలు నీకు చెబుతున్నా రాజా" అంటూ ప్రారంభించింది.

* * *

పుట్టిన ఐదేళ్ళవరకూ నాకు పుట్టాననే తెలీదు. ఆ తరువాత మెల్ల మెల్లగా జ్ఞానం వికసించి నేనూ ఓ జీవినని తెలుసుకొన్నాను. నాకు తోడు, నీడ, గూడు అంతా అమ్మే. అమ్మ లాలనలో ఏ సమస్యలూ, సందేహాలూ లేక సాఫీగా సాగిపోయేది జీవితం. ఈ విశాల రత్నగర్భలో ఓ హైస్కూలు ఉపాధ్యాయిని మా అమ్మ. జ్ఞానం వికసించినా తండ్రిని ఎరుగను నేను. నా చిన్నారి మనసులో తండ్రి ఎవరో తెలుసుకోవాలనే కుతూహలం ప్రవేశించి పెరగసాగింది.

అప్పుడు నేనేం చదువుతున్నానో నాకు జ్ఞాపకం లేదు. కానీ ఆ సంఘటన, జీవితంలో యెన్నడూ మరచిపోలేను. సాయంత్రం స్కూలు నుంచి హుషారుగా వచ్చాను. అమ్మ వంటిట్లో కాఫీ పెడుతోంది. కాఫీ త్రాగి ముందు గదిలోకి వచ్చాను. అమ్మ వచ్చి లైటు వేసింది. అమ్మనే చూడసాగాను. ఆమె నే చూస్తున్న నన్ను చూసి "ఏమమ్మా అలా చూస్తున్నావు" అడిగింది. ఎలా అడగాలో అర్థం కాలేదు నా వయసుకు. నా దగ్గరగా వచ్చి కూర్చుని కుడిచేత్తో నా వెంట్రుకలు దువ్వుతూ యెడంచేత్తో నా గడ్డం పట్టుకొని "బళ్ళో యేమైనా జరిగిందా శ్లేషా?" బుజ్జగిస్తూ లాలనగా అడిగింది.

అమ్మ కళ్ళలోకి చూస్తూ "నాన్న మనింటికి రాడా అమ్మా?" అడిగాను. అంతే! అమ్మ కొట్టిన దెబ్బకు ఎగిరి అవతలపడి ఏడుపు లంకించుకొన్నాను. కోపంతో వంటింట్లోకెళ్ళిపోయింది అమ్మ. ఏడుస్తూ ఏడుస్తూ అలాగే నిద్రపోయాను.

ప్రొద్దున్నే లేచి తయారై స్కూలుకు వెళుతుండగా "శ్లేషా ఇలా రా!" పిలిచింది అమ్మ. నర నరానా ప్రవేశించిన భయంతో వెళ్ళాను. నన్ను గట్టిగా కౌగలించుకొని ముద్దు పెట్టి "ఇంకెప్పుడూ అలాంటి ప్రశ్నలు వెయ్యకు శ్లేషా!" అంది. అమ్మ కళ్ళల్లో నీళ్ళు. నేనూ బావురుమని ఏడ్చేశాను.

ఆ రోజు అమ్మ ఎందుకు నన్ను కొట్టిందో చాలా కాలం వరకూ నాకే మాత్రం అర్థం కాలేదు.

మనసుతోపాటు వయసూ పెరిగింది. వయసుకు మించిన వన్నె శరీరానికి వచ్చింది. నా అందమూ అవయవ పొంకమూ చూసుకొని నాకు నేనే ఆశ్చర్యానందాలు పొందేదాన్ని.


ఇంటర్మీడియట్‌లో చేరడానికి అప్లై చేసిన రోజు రాత్రి నిద్రపోయే ముందు అమ్మ తన గదిలోకి పిలిచింది. "ఏమ్మా?" అంటూ తన గదిలోకి వెళ్ళి కూర్చున్నాను. అమ్మ తలలో సగానికి సగం తెల్ల వెంట్రుకలు. వృద్ధాప్య ఛాయలు అమ్మలో బాగా కనిపిస్తున్నాయి.

"శ్లేషా! పెద్దదానివవుతున్నావు. కొద్దిరోజుల్లో కాలేజీలో అడుగుపెడతావు. ఈ లోకం గురించి అందమైన ఊహలే తప్ప, ఇదొక సుడిగుండమని మీ వయసు వాళ్ళెవ్వరూ తెలుసుకోరు" అమ్మ యెందుకిలా చెబుతుందో నాకే మాత్రం అర్థం కాలేదు.

"బయట లోకంలో అడుగుపెడుతున్నపుడు అనుక్షణం జాగ్రత్తగా వుండాలి. ఎక్కడ తప్పటడుగు వేసినా పాతాళంలో పడక తప్పదు" భారంగా చెబుతోంది అమ్మ. కాసేపు మా యిద్దరి మధ్యా ఘనీభవించిన నిశ్శబ్దం.

"శ్లేషా! గుర్తుందా నీ చిన్నప్పుడు ఒక రోజు నీ తండ్రిని గూర్చి అడిగావు?" మౌనంగా తలూపాను.

రెండు డైరీలు నా చేతిలో పెట్టి "ఇవి చదువు. నీకే అర్థమవుతుంది" అన్నది. డైరీలు తీసుకొని నా గదిలోకి వచ్చాను. అవి చదివి నా తండ్రి గురించి తెలుసుకొన్నాను. బి.ఇ.డి.



ట్రెయినింగ్‌లో వుండగా అతనూ మా అమ్మా ప్రేమించుకొన్నారు. అతను యెవరూ యేం పేరూ అని ప్రశ్నించకు—రూపురేఖలే స్మృతిపథంలో లేని వ్యక్తి పేరు తెలుసుకొని మాత్రం ఏం ప్రయోజనం.

అతని కోసం మా అమ్మ అంతస్థునీ తలిదండ్రుల్నీ వదిలేసింది. కాని వాడు వాటి కోసమే నన్ను ప్రసాదించి నా తల్లిని వదిలేశాడు. ఒంటరిదైన మా అమ్మకు కడుపులో ఉన్న నేనే తోడయ్యాను. అందరిలా అధైర్యపడక ఉద్యోగం ఆసరాతో అమ్మ నన్ను పెంచి పెద్ద చేసింది.

ప్రేమకోసం తల్లిని, తండ్రిని, అంతస్థును, పరువూ మర్యాదల్నీ జీవిత సర్వస్వాన్నీ త్యాగం చేసిన స్త్రీ కోసం ఏ చిన్న త్యాగమూ చేయలేక పోయాడు పురుషుడు. ఆ క్షణంలోనే పురుషులపై ద్వేషం నాలో అంకురించింది.

బి. ఏ.లో చేరిన మొదటి రోజుల్లో అమ్మకు రామాపురం ట్రాన్స్‌ఫర్ అయింది. అమ్మ ఆరోగ్యమూ అంతంత మాత్రంగానే వుంది. నేను హాస్టల్‌లో చేరాను. రైలు ఎక్కించి ఏడుస్తున్న నన్ను చూసి "పిచ్చిపిల్లా, ఎందుకే ఏడుస్తావ్? వారం వారం వచ్చి చూస్తుంటానుగా" అంటూ వెళ్ళిపోయింది అమ్మ.

కొన్ని నెలలు హాయిగానే గడిచాయి. ఒక రోజు అమ్మకు సీరియస్‌గా వుందంటూ టెలిగ్రాం వచ్చింది. నేను రామాపురం చేరే లోపలే అమ్మ ఇహాన్ని విడిచేసింది. అనంత విశ్వంలో వున్న ఒక్క తోడును పోగొట్టుకొని ఏకాకిగా మిగిలిన నేను అమ్మ నిర్జీవ శరీరంపై వెక్కి వెక్కి యేడుస్తూ పడిపోయాను. మిగతా తతంగాన్నంతా ఊరి పెద్దలే నిర్వహించారు.

అమ్మ నివసించిన యింట్లో ఒక్కదాన్నే శూన్యంగా శోకంతో జ్ఞాపకాలతో నాలుగు రోజులు గడిపాను. భవిష్యత్తు అంతా ప్రశ్నా చిహ్నంగా తోచింది. అయిదవ రోజు రాత్రి సుమారు పదిగంటలప్పుడు ఊరిపెద్దలిద్దరూ ఇంటికి వచ్చారు.

ముందర గదిలో కూర్చుని "బాధపడకమ్మా జరిగేది జరక్క మానదు. యింత శోకంలో వుండికూడ మేం ఎంతమంది పిలిచినా మా యిళ్ళకు రాకపోయావు" అంటూ ఊరడించడం మొదలుపెట్టారు.

ఓ గంట అలాగే గడచిపోయింది. ఊరంతా భయంకరమైన నిశ్శబ్దం. నిండు పున్నమి లాంటి నా అందం వారిలోని కామ సముద్రాన్ని రెచ్చగొట్టింది. ఒకడు లేచి వచ్చి నా భుజంపై చేయి వేశాడు. శోకంలో వున్న నేను అదీ ఒక విధమైన లాలింపనుకొన్నా. నేను ప్రతి ఘటించక పోవడంతో కౌగలించుకొన్నాడు. అప్పటికి అసలు స్థితిని అర్థం చేసుకొన్న నేను విదిల్చి కొట్టబోయాను. కానీ కిరాతకులు, తల్లి పోయిన దుఃఖంలో వున్నాననికూడా యెంచక, వయసులో యెంతో చిన్నదాన్నని తలచక, ఏ దిక్కూ లేని అనాథనని భావించక, క్రూరంగా, రాక్షసంగా నాపై పడ్డారు. ప్రతిఘటించి, ప్రతి ఘటించి శక్తిలేక శోష వచ్చి పడిపోయాను. ఆ తరువాత ఏం జరిగిందో నాకు తెలీదు.

వేకువ వేళ మెలకువ వచ్చింది. అస్తవ్యస్తమైన బట్టలు, ఒళ్ళంతా నొప్పులు. ఆత్మహత్య చేసుకుందామని బావి దగ్గరికి వెళ్ళాను. కానీ "ఎందుకు చావాలి? చచ్చి ఎవరివి సాధించాలి? పురుషుడి క్రౌర్యానికి అబల బలైపోవలసిందేనా? ఈ తప్పు నాదెందుకవుతుంది?" బావి అంచున నిలబడ్డపుడు ఉదయించిన ఈ ప్రశ్నలే నన్ను జీవింప చేశాయి.

నా తల్లి ఏదో కొద్దిగా మిగిల్చిన డబ్బే నా చదువుకు, జీవితానికి ఆధారమైంది. కానీ నిజానికి అది ఏ మూలకూ చాలదు.

అంతే ఆ రోజు నుంచి, పురుషుల్ని బొమ్మలుగాచేసి ఆడుకొంటున్నాను. అందాన్ని ఎరగా చూపి వాడి పతనానికి, నా ఔన్నత్యానికి బాటలు వేసుకోసాగాను.

ర ర ర

శ్లేష కళ్ళనిండా నీళ్ళు. ఆ స్థితిలో ఆమెను చూసి కరిగిపోయాను.

"టైమెంత రాజూ?" అడిగింది.

పరుపుకు పక్కగా పారేసిన గడియారాన్ని తీసి చూశాను. అయిదవుతోంది. తెల తెలవారుతోంది. దుప్పట్లోంచి లేచి బట్టలు కట్టుకోవడం ప్రారంభించింది శ్లేష. ఆమె ఒంటికి చుట్టుకొంటున్న చీరను చూసి సత్యపు నగ్నత్వంపై ఏదో ముసుగు కప్పుతున్నట్లనిపించింది. "ఈ పాలరాతి బొమ్మ వెనుక యింతటి విషాదపు చీకటి ఛాయ వుందా?" అనుకొంటూ సిగరెట్ వెలిగించాను.

"నిన్నాశ్చర్యపరిచే మరో విషయం చెప్పనా రాజూ...." అంది శ్లేష పైట సర్దుకొంటూ.

"ఊఁ" అన్నాను.

"రామాపురంలో రాక్షసంగా నన్ను వశపరచుకొన్న ఒకడి కొడుకే శ్రీనాథ్" అంది గోడవైపు చూస్తూ.

నిజంగానే ఆశ్చర్యపోయాను. "తండ్రిపై పగ కొడుకుపై తీర్చుకున్నావా?"

"లేదు రాజూ, ఒక పురుషుడిపై వున్న పగ మరో పురుషుడిపై తీర్చుకొన్నాను. వెళ్తాను రాజూ!" వెళ్ళడానికి సిద్ధపడుతూ అంది.

"ఎక్కడికి వెళతావు శ్లేషా?" అడిగాను నాతో ఉండిపొమ్మని అనలేక.

పక పకా నవ్వుతూ "ఎక్కడికా, అనంతంలోకి. ఔన్నత్యంలోకి. మీలోని బలహీనతనాధారం చేసుకొని ఊహించని ఉచ్ఛస్థితిలోకి" అంది చిలిపిగా.

నాకు తెలుసు-నేను ఆపినా ఆమె ఆగదని.

తలుపులు తెరచి బయటికి అడుగేయబోతున్న ఆమెతో "శ్లేషా! ఒక్క ప్రశ్న?" నాలోని ఆందోళనను వెలివర్చుకోవాలని నా తపన.

అడుగు వెనక్కి వేసి "యేమిటి?...."అంది.

"నువ్వు నన్ను....ప్రేమించావా?" మాటలు తడబడ్డాయి.

"లేదు" స్థిరంగా అంది.

"మరి అనుకోకుకుండానే నా దగ్గరికొచ్చి రాత్రంతా నాతో గడిపి" నా మాటలు పూర్తి కాకుండానే "పిచ్చిరాజూ అందరిలా నువ్వూ నన్ను కోరుకొన్నా, వాళ్ళకంటే ఎక్కువగా నిజంగా ఆరాధించావు. అందుకే....అంతకన్నా మరేం లేదు" సూటిగా స్పష్టంగా చెప్పింది.

"రాజూ! కోరుకున్నప్పుడు నీ దగ్గరికి వచ్చి వెళ్ళే స్వాతంత్ర్యం నాకే మిగుల్చు. మౌనంగా తలూపాను.

గదిలోకి ప్రవేశించిన సూర్యుని లేతకిరణాలు ఆమె పాదాలపై పడ్డాయి. ఎర్రగా ప్రక్షాళిత పద్మాల్లా కనిపించాయామె పాదాలు. మెల్ల మెల్లగా అడుగేస్తూ వెళ్ళిపోయింది శ్లేష. □

ఉచితం!!! FREE!!!

ఇదే నాకు స్వర్గం

ప్రశాంత సంధ్యా సమయం. ఏటి ఒడ్డున ఒక కొంగ నత్తలకోసం వెదకుచూ, అవి అందినప్పుడు మహదానందంతో ఆరగిస్తూ అటూఇటూ తిరుగుతుంది. దాని వేటకు అంతరాయం కలిగిస్తూ, హంస ఒకటి ఆకాశంనుండి దిగివచ్చి నీళ్ల మీద గంభీరంగా కదలిపోతూవుంది. "ఎక్కడినుండి వచ్చావు?" ప్రశ్నించింది కొంగ. "దేవలోకమునుండి దిగివచ్చాను" బదులిచ్చింది హంస. "దేవలోకంలో విశేషం ఏమిటో?" ప్రశ్నించింది కొంగ. "దేవలోకం సూర్యకాంతముతో కట్టబడినది. రాజవీధికూడా శుద్ధ సువర్ణమయమై స్వచ్ఛమైన స్ఫటికమును పోలియున్నది. అక్కడ దేవాలయములులేవు. సర్వాధికారియైన దేవుడే దేవాలయము. ఆ ప్రభు మహిమయే అందులో ప్రకాశిస్తుంది. అక్కడ జీవ జలములు ప్రవహిస్తున్నాయి. వాటి ఆవల ఈవల నెల నెలకు ఫలిస్తూ పన్నెండు కాపులు యిచ్చు ఫలవృక్షములున్నాయి. వాటి ఆకులు వ్యాధులు పోగొట్టి స్వస్థత చేకూరుస్తాయి." హంస దేవలోకమునుగూర్చి వివరిస్తుంటే కొంగ ఏమాత్రం వినుటకు ఆసక్తిచూపక నత్తలను నములుతుంది." సరే నీ వర్ణనలకేంగాని అక్కడ నత్తలున్నాయా ఎండ్రకాయలున్నాయా, త్వరగ చెప్పు" అవి "ఏమియు లేవు" బదులిచ్చింది హంస. "అయితే నీ దేవలోకం నీకేవుండనీ, నాకు కావలసింది నత్తలు" ప్రాకుడు పట్టిన బండమీదనిలచి 'నత్తల కోసం అటూయిటూ వెదకుతోంది కొంగ.

లోక సంబంధమైన కోరికలతో నిండిన మార్పులేని మానవ హృదయాలకు పరలోక సంబంధమైన సంగతుల పట్ల ఆశ వుండదు. ఆసక్తి వుండదు. చవక బారుసినిమాలు, స్త్రీలు, తాగుడు, జూదం, గుర్రపు పందాలు ఇలాటివేవిలేని 'స్వర్గం' వారికి 'స్వర్గం'లా అనిపించదు. నత్తగుల్లలే స్వర్గం అనుకొన్న కొంగకు అసలు స్వర్గం గూర్చిన వైభవాలను ఎంతగా వర్ణించి చెప్పినా అర్ధంకాదు. పరలోక సంబంధమైన వాటిమీదేగాని లోక సంబంధమైన వాటిమీద మనస్సు పెట్టుకొనవద్దని పరిశుద్ధ గ్రంధము మిమ్మలను హెచ్చరిస్తుంది. "ఒకడు లోకమంతా సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకుంటే వానికేమి ప్రయోజనం" అని క్రీస్తు పలికాడు. ఈ నాడు మరణం మిమ్మలను వరిస్తే దానిని ఎదుర్కొనుటకు సిద్ధంగా వున్నారా.

-చదలవాడ చంద్రమతీదేవి



తెలుగు సినిమాకి వెలుగు కిరణం 'శంకరాభరణం'

'శంకరాభరణం' ఒక రాగం మాత్రమే కాదు. ఇకమీదట అది, తమది అని తెలుగు వాళ్ళు గుండెలమీద చెయ్యివేసుకొని చెప్పుకునె సినిమాకూడా. నేటి భారతీయ చలనచిత్ర పరిశ్రమ ధోరణులను చూసి నిస్పృహ చెందుతున్న వారికి యిటువంటి మధుర రాగమాలికలే ఉపశమనాన్ని కలిగిస్తాయి. సంగీతమే వేదంగా, జీవన నాదంగా బతికే ఒక శంకర శాస్త్రి జీవితాన్ని, ఆయనను పుంభావ సంగీత సరస్వతిగా భావించి ఆరాధించే, ఒక సాధారణ సంపన్న సాని కుటుంబంలో పుట్టిన అసాధారణ యువతి కళారాధనా జీవితాన్ని మేళవించి దర్శకుడు కె. విశ్వనాధ్ గానంచేసిన రసమయ

'అందాల రాశి'లో రతి, రాజ్ కుమార్





'కొత్తపేట రౌడీ'లో కృష్ణ జయప్రద

రాగం శంకరాభరణం. ఇటువంటి చిత్రాన్ని రూపొందించి తెలుగుదేశాన తిరిగి సంగీత సాగర హృదయఘోషని వినిపించనున్న విశ్వనాధ్ గారికీ, నిర్మాతలు ఏడిద నాగేశ్వరరావు గారికీ, ఆకాశం శ్రీరాములుగారికీ, మహదేవన్ గారికీ, సుందర రామమూర్తిగారికీ, బాలూ మహేంద్రగారికీ, యితర సాంకేతిక నిపుణులకీ, సోమయాజులుగారికీ, మంజుభార్గవిగారికీ చంద్రమోహన్‌గారికీ యితర నటీనటులకీ పేరు పేరునా 'జ్యోతి' అభినందనల్ని ఆలాపిస్తోంది.

పత్రికలవారితో ప్రభ

పత్రికల వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి నటి ప్రభ పామ్‌గ్రోవ్ హోటల్లో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. తీరికలేని తారగా మారిన కోటి సూర్యప్రభ ఆనాటి సమావేశంలో కోటి చంద్రప్రభలా దేదీప్యమానంగా వెలిగిపోతూ పత్రికల వారికి తన కొత్త చిత్రాల గురించి వివరించి హేపీ న్యూయర్ చెప్పింది.

కొత్త సంత్సరానికి విజయచందర్ స్వాగతం!

డిసెంబరు 31, 1979 అర్థరాత్రి 12 గంటలకి మద్రాసులోని తన కార్యాలయంలో శ్రేయోభిలాషులూ, పాత్రికేయమిత్రులు కరతాళ ధ్వనులమధ్య నట, నిర్మాత విజయచందర్ కేక్ కట్‌చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పారు. రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభమైన "క్రొత్త సంవత్సరానికి స్వాగతం" కార్యక్రమం ఒంటిగంట వరకూ — కొత్త సంవత్సరం కాలమహల్ తలుపులు తెరుచుకొని వచ్చేవరకూ—ఆటపాటలతో సంగీత నాట్యాలతో (అంతా మగ సంగీతం, మగ

నాట్యమే) సాగింది. తాను సినిమా రంగంలో ప్రవేశించినప్పటినుంచీ చేదోడు వాదోడుగా వుంటున్న పత్రికలవారికి ఈ సందర్భంగా విజయచందర్ కృతజ్ఞతలు తెలియజేశాడు.

అపర్ణా మూవీస్‌వారి ఆపద్బాంధవులు!

వి. ఎస్. ఆర్. స్వామి పేరు ఉత్తమ ఛాయాగ్రహణానికి మారుపేరుగా మారి చాలా కాలమైంది. కెమేరా పనితనానికి ఆయన పెట్టింది పేరు. అపర్ణామూవీస్ పతాకంలో స్వామిగారు నిర్మిస్తున్న రెండవచిత్రం 'ఆపద్బాంధవులు' వీటూరి రాసిన పాట రికార్డింతో జనవరి నాలుగున ప్రారంభమైంది. ప్రసాద్ రికార్డింగ్ థియేటర్‌లో జరిగిన ప్రారంభోత్సవ ముహూర్తానికి దాసరి నారాయణరావు, కె. విశ్వనాధ్, సింగీతం శ్రీనివాసరావు వంటి దర్శక ప్రముఖులూ, కొందరు ప్రముఖ నిర్మాతలూ, వచ్చి స్వామిగారిని అభినందించారు. ఈశ్వర రెడ్డి కథరాసి, దర్శకత్వం వహిస్తున్న 'ఆపద్బాంధవులు' ఔట్‌డోర్ షూటింగ్ కూడా జనవరి 19న ప్రారంభమైంది. శ్రీధర్, పద్మనాభం, చక్రపాణి, రాళ్ళపల్లి, శారద, గీ[illegible] మొదలయినవారు నటిస్తున్నారు. మాటలు పరుచూరి రాశారు. సంగీత దర్శకుడు స[illegible] ఫిబ్రవరి మాసాంతానికి చిత్రం పూర్తవుతుందని వి. ఎస్. ఆర్. స్వామిగారు తెలియజేశారు.

'సర్కస్ రాముడు'లో జయప్రద, సుజాత





'సంసార బంధం'లో సుభాషిణి, నారాయణరావు

సింగపూర్‌లో శోభన్‌బాబు

నిర్మాత [illegible] ఎం. ఎస్. [illegible] [illegible] 'రాముడు [illegible] [illegible] హాంగ్ కాంగ్, సింగ[illegible] [illegible] లలో ఇటీవల చిత్రీక[illegible] [illegible] పాటలను జనవరి 18న పాత్రి

కేయులకు చూపించారు. తమిళ, తెలుగు భాషల్లో నిర్మించబడుతున్న ఈ చిత్రంలో తెలుగు కథానాయకుడు శోభన్‌బాబు. శోభన్‌బాబు-రతి, శోభన్‌బాబు లతల మీద శోభాయమానమైన విదేశీనగర సౌందర్యం నేపథ్యంలో చిత్రీకరించిన పాటలు మూడూ బావున్నాయి.

సత్యం సంగీతం వినసొంపుగా వుంది. ఎస్.ఎస్. లాల్ ఛాయాగ్రహణం కన్నుల కింపుగా వుంది.

హిందీనుంచి తెలుగులోకి దూకుతోన్న 'ప్రేమతరంగాలు!'

నూతన నిర్మాణసంస్థ 'ప్రభుచిత్ర' హిందీలో

'కొత్తపేట రౌడీ'లో కృష్ణ * 'బుచ్చిబాబు'లో అక్కినేని →





విజయవంతంగా నడిచిన 'ముకద్దర్ కా సికం దర్' చిత్రకథ హక్కులు తీసుకొని గొల్లపూడి రచనలో 'ప్రేమతరంగాలు' పేర పునర్నిర్మిస్తున్నారు. కృష్ణంరాజు, చిరంజీవి, సత్యనారాయణ, కాంతారావు, జయసుధ, సుజాత సావిత్రి ప్రధాన తారలు. శ్రీ ఎమ్. రాయపరాజు నిర్మిస్తున్న ఈ భారీ వర్ణచిత్రానికి దర్శకుడు ఎస్. వి. చిట్టిబాబు. సంగీత దర్శకుడు చక్రవర్తి. కథానాయకుడు కృష్ణంరాజు జన్మదినాన్ని పురస్కరించుకుని, జనవరి 20 న ఏ. వి. ఎమ్. స్టుడియోలో నిర్మాతలు షూటింగ్ ప్రారంభించారు.

లింగమూర్తి నిష్క్రమణ

ప్రఖ్యాత రంగస్థల, చలనచిత్ర మహానటుడు ముదిగొండ లింగమూర్తి జనవరి 24న కన్ను మూశారన్న వార్త ఆయన అభిమానుల్ని, కళాప్రియుల్నీ కలవరపెట్టింది. 1937లో 'భక్త తుకారాం' చిత్రంద్వారా సినిమాలలోకి ప్రవేశించిన లింగమూర్తి దేవత, పోతన, స్వర్గసీమ, పెద్దమనుషులు వంటి చిత్రాలనుండి యిటీవలి పాండవ వనవాసం వరకూ అనేక చిత్రాలలో ఆయన నటించారు. సన్యాసాశ్రమం స్వీకరించి ఆధ్యాత్మిక చింతనలో వృద్ధాప్యాన్ని గడిపిన లింగమూర్తి జీవితంలోనూ, నాటకాలలోనూ, సినిమాలలోనూ తన పాత్రని యథాశక్తి నిర్వహించి అనంతంలోకి నిష్క్రమించారు. లింగమూర్తిగారి కుటుంబ సభ్యులకు జ్యోతి సానుభూతి.


—దేవీదాసు

అమరకవి అనిసెట్టి



ప్రఖ్యాత ప్రగతి కాముక కవి, చలనచిత్ర రచయిత అనిసెట్టి సుబ్బారావు మరణం (27-12-1979) సాహితీ ప్రపంచంమీద దిగులు మబ్బులు కప్పింది. అనిసెట్టి తనజీవితకాలంలో అధికభాగాన్ని గడిపిన మద్రాసు చలనచిత్రరంగం, చలనచిత్ర ట్రేడ్ యూనియన్ రంగాలలోని తన స్నేహితులకీ, సహచరులకీ, దూరంగా వెళ్ళి, స్వస్థలమైన నరసరావుపేటలో కన్ను మూశారు. పుంఖానుపుంఖంగా రచనలు చేసేవారి కోవకి చెందని అనిసెట్టి రచనలు కొన్నే అయినా, అవి అన్ని సాహిత్య ప్రక్రియలలోనూ ఆయన పై చేయికి నిదర్శనంగా పదికాలాలపాటు నిలిచివుంటాయి. "నిదురపోరా తమ్ముడా.....కరుణలేని ఈ జగాన కలత నిదురే మేలురా" అని లతా మంగేష్కర్ కోయిల కంఠంతో చేరి పలికిన అనిసెట్టి జీవిత పరిశ్రమలో అలసిపోయి శాశ్వత నిద్ర కుపక్రమించారు. ఆ అమరకవికి జ్యోతి స్మృత్యంజలి ఘటిస్తోంది.

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆ ధా రా లు   మార్చి '80

అడ్డం:

1. లౌకికం పరమాన్నం
3. ఇదే అనుమానం
5. సరే!
7. హిందీ నవల
9. ఇదే దీని కుదాహరణ
10. హఠాత్తు
12. గ్రీష్మం తెలుపు
13. తుమ్మెద (తల క్రిందుగా)
15. ఇంగ్లీషులో స్వాగతం
16. చంద్రిక చిన్నయసూరిది.
17. కొనడం వ్యాపించడం
18. కొనడం మౌనం
20. కాలం మారింది
22. అర్ధ వివరణ
23. అరసం వారసులు
25. విష్ణు భార్య (తల క్రిందులు)
27. మద్య కావ్యం
28. రెక్క తెగిన పక్షి
31. ఈ అయ్య డైరెక్టరు
32. బంతి

నిలువు:

1. సాక్షి సంతకం
2. శ్రీ
3. దీని ప్రథ క్షణం
4. తెలుగు నాటకం
5. వైకుంఠపురంలో తరంగం
6. కాళ్ళదేవర నిప్పు
7. జోసఫ్ క్యాకిన్‌లో ఉందంటారు
8. వెయ్యి రూపాయిల పిల్లికూన
11. పాప తిండి
14. పానీయం
15. వంశం
18. కొందరు రాజకీయవేత్తల 7 అడ్డు
19. వ్యంజనం
21. నిరుడు
22. కలరా రాకుండా
23. విలుకాడు మన్మథుడు
24. సాయంకాలం
26. సర్వనామం
28. కడుపునొప్పికి కారణం?
30. ఏంటా (అలాకాదు)

ఫిబ్రవరి పదబంధ ప్రహేళికకు సమాధానాలు:

అడ్డం : 1. సీరో 3. బాస 5. గిరగిరా 7. అలాగనా 9. రోజా 10. వినండి. 12. పాడి 13. క్షితి 15. కాలు 16. నత్తి 17. అణా 18. దండం 20. చిలి 22. మాడ 23. పాదుక 25. లాగు 27. విధానము 29. తగవరి 31. రిక్క 32. మితి.

నిలువు : 1. సీరజాక్షి 2. రోగి 3. బాలా 4. సగపాలు 5. గిరో 6. రావి 7. ఆడి 8. నాతి 11. నందం 14. తినడం 15. కాణాచి 18 దండధారి 19. విందు 21. లీలావతి 22. మావి 23. పాము 24. కత 26. గురి 28. నక్క 30. గమి.

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి ఫిబ్రవరి 25 వ తేదీలోపు మాకు చేరేట్టు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపేవారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్‌కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.

ఫిబ్రవరి ప్రహేళిక విజేతలు:

1. కె. ఎల్. నరసింహమూర్తి—అంజనపల్లి. 2. ఎ. వి. సుబ్రహ్మణ్యం—గార. 3. ఎ. సూర్యనారాయణ—ఇచ్ఛాపురం. 4. ఇ. నీలకంఠరావు—ఖమ్మం. 5. కె. జి. జయరామిరెడ్డి—కర్నూలు. 6. వి. ధర్మాంబ—కాకినాడ. 7. ఎస్. వి. యస్. సత్యనారాయణ—కాకినాడ. 8. ఎ. శ్యామలాదేవి—శ్రీకాకుళం. 9. బి. బి. ఆర్. కృష్ణమూర్తి—టెక్కలి. 10. కె. వి. నరసింహమూర్తి — సునాబేడా. 11. సి. ఎస్. శర్మ — విజయనగరం. 12. ఆర్. కమల—వరంగల్. 13. ఎస్. రామశాస్త్రి—వరంగల్.

Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony, Kodambakkam, Madras-600024&Printed by D. HanumanthaRao at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600001.


JYOTI MARCH '80
Rs.3/-